VISALAANDHRA, VIJAYAWADA PHONE. No 376

700735

విశాలాంధ్ర

6 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డు నెం. A 193

సంపుటి 10] విజయవాడ • 9 డిసెంబరు 1960 శుక్రవారం • సంచిక [252

ఆల్విన్ లోహ కర్మాగారం

ప్రశ్నలకు శాసనసభలో మంత్రి సమాధానం

హైద్రాబాద్, డిసెంబరు 8

హైద్రాబాద్ ఏజెన్సీస్ (ప్రయివేటు) లిమిటెడ్‌తో ప్రస్తుతం ప్రభుత్వానికున్న ఒప్పందం కాలపరిమితి అయిపోగానే ఆల్విన్ మెటల్ (లోహ) వర్క్సు లిమిటెడ్‌ను స్వాధీనం చేసుకోవాలన్న ప్రతిపాదనేమీ ప్రభుత్వంవద్ద లేదని మంత్రి శ్రీ పి రంగారెడ్డి నేడు రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రి తరఫున ఒక ప్రశ్నకు జవాబిస్తూ తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో వరద, క్షామ నివారణకు రు. 50 లక్షలు

కేటాయించినట్లు శాసనసభలో మంత్రి వెల్లడి

హైద్రాబాద్, డిసెంబరు 8

1960 61 సంవత్సరంలో, వరదబాధితుల కరువు నివారణ నిమిత్తం ప్రదేశ్ ప్రభుత్వం రు 50 లక్షలు కేటాయించినట్లు నేడు రాష్ట్ర శాసనసభలో మంత్రి శ్రీ కె వి రంగారెడ్డి శ్రీ ఎం నాగిరెడ్డి తీర్మానానికి జవాబుగా చెప్పారు ఈ మొత్తంలో గుంటూరుజిల్లాకు 80 వేల రూపాయలు కేటాయించామన్నారు

జనాభా దామాషానుబట్టి ఆంధ్రప్రణాళికకు అదనపుధనం కావాలి

కేంద్రాన్ని కోరుతున్న ప్రతిపక్షాల సవరణతో ప్రభుత్వ తీర్మానానికి శాసనసభ ఆమోదం

లుముంబా విడుదలకై ప్రధాని నెహ్రూ జోక్యం

డిమాండు చేయవలసిందిగా ప్రజాస్వామ్య సంస్థలన్నింటికీ అ.భా. కిసాన్ సభ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 7

"మొబుటూ దారుణ నిర్బంధంనుండి కాంగో ప్రధాని లుముంబాను విడిపించేందుకు ప్రధాని నెహ్రూ, ఐరాస కార్యదర్శి వెంటనే జోక్యం కలిగించుకోవాలని కోరవలసిందిగా దేశంలోని వివిధ ప్రజాస్వామిక సంస్థలకు అఖిల భారత కిసాన్ సభ నేడు విజ్ఞప్తి చేసింది.

కిసాన్‌సభ అధ్యక్షులు శ్రీ ఎ కె గోపాలన్, ప్రధాన కార్యదర్శి శ్రీ భవానీసేన్‌లు నేడు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఇలా తెలియజేశారు

"కర్నల్ మొబుటూ సైనికులను నిరాయుధులను చేయాలని, కాంగో పార్లమెంటు అధికారాన్ని, కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభింప చేయాలని వారిని సంస్థలన్నీ కోరాలి.

ఈ సమస్యపై బహిరంగ సభలు జరిపి, అక్కడ తీర్మానాలుచేసి వాటిని తంతిద్వారా ప్రధాని నెహ్రూ కూ, ఐరాస కార్యదర్శికి పంపించాలి."

అనంతపురంలో డాంగే ఉపన్యాసం

అనంతపురం, డిసెంబరు 8

ప్రదేశ్ కమ్యూనిస్టు మహాసభకు హాజరవుతున్న భారత కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ డాంగే, అనంతపురంలో 14వ తేదీ సాయంత్రం బహిరంగ సభలో ఉపన్యసించుతారు (వి వి)

కాంగ్రెస్‌కు తాతా కంపెనీ కనకవర్షం

రు. 11 లక్షల 66 వేలు

ఖర్గపురం, డిసెంబరు 7

తాతా కంపెనీవారు గత మూడు సంవత్సరాల్లో కాంగ్రెసుకు మొత్తం రు 11 లక్షల 66 వేలు యిచ్చారు 1956-57 లో వారు ఎ ఐ సి సి కి రు 6 లక్షలు, బీహార్ కాంగ్రెస్‌కు రు 3 లక్షల 30 వేలు, ఒరిస్సా కాంగ్రెసుకు రు 1 లక్ష, 1957-58 లో బీహార్ కాంగ్రెస్‌కు రు 25 వేలు, ఒరిస్సా కాంగ్రెసుకు రు 50 వేలు, 1959-60 లో బీహార్ కాంగ్రెసుకు రు 55 వేలు, యిచ్చారు ఇవిగాక సాక్చి (జంషెడ్‌పూర్) థానా కాంగ్రెసుకు కొన్నివేలు యిచ్చారు

పాలకవర్గ పార్టీకి, తాతా లకు ఈ మధ్య ఒక రహస్య ఒప్పందం [illegible] విశ్వసనీయవర్గాలద్వారా తెలియవచ్చింది ఈఒప్పందం ప్రకారం వచ్చే జనరల్ ఎన్నికలకై బీహార్ కాంగ్రెస్‌కు అయ్యేఖర్చంతా తాతాలు భరిస్తారు కాంగ్రెసుకు రు 50 లక్షల నుండి రు 80 లక్షల వరకు ఇస్తామని మాట ఇచ్చారట. (వి వి)

అకాలీలకు, ప్రభుత్వానికి మధ్య రాజీకుదిరే సమస్యలేదని పంజాబు ముఖ్యమంత్రి శ్రీ కైరాన్ అన్నారు.

తృతీయప్రణాళికపై మూడు రోజులచర్చ పరిసమాప్తి

(విశాలాంధ్ర విలేకరి)

హైద్రాబాద్, డిసెంబరు 8

రాష్ట్ర మూడో ప్రణాళికవ్యయం రు 305 కోట్లతో పాటు, ఆంధ్రప్రదేశ్ జనాభానుబట్టి అదనపు ధనాన్ని కేటాయించాలని ప్రతిపక్ష నాయకులు శ్రీ సుందరయ్య, శ్రీ వావిలాల ప్రభుత్వ తీర్మానానికి ప్రతిపాదించిన సంయుక్త సవరణను నేడు శాసనసభ, ప్రభుత్వ తీర్మానంతోపాటు ఏకగ్రీవంగా ఆమోదించింది

రాష్ట్ర శాసనసభలో రాష్ట్ర తృతీయ ప్రణాళిక ముసాయిదాపై మూడురోజులుగా జరిగిన చర్చ నేటితో ముగిసింది. చర్చకు ప్రణాళికా మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి జవాబిస్తూ, ప్రతిపక్షం వారుచేసిన సూచనలను దాదాపు తిరస్కరించారు

అయితే ప్రణాళికా మంత్రి తీర్మానానికి వచ్చిన ఈ క్రింది సవరణను ఆమోదించారు. సభవారు ముసాయిదా ప్రణాళికను పరిగణనలోకి తీసుకోవాలన్న ప్రతిపక్షనాయకులు శ్రీ సుందరయ్య, వావిలాల గోపాలకృష్ణయ్యగార్ల సంయుక్త తీర్మానాన్ని మంత్రి ఆమోదించారు

సభవారు ఆమోదించిన తీర్మాన పాఠం ఇది:

"రాష్ట్రకోటాగా కేటాయించిన రు 305 కోట్లతోపాటు, కేంద్ర ప్రయివేటు రంగాలలో ఆంధ్ర ప్రదేశ్ జనాభా దామాషానుబట్టి, అదనపు ధనాన్ని కేటాయించాలని, ముఖ్యంగా మొదటి రెండు ప్రణాళికల్లో ఆయా రంగాలలో రాష్ట్రానికి కేటాయించినది చాలా స్వల్పంగావుంది కాబట్టి, ఈ అదనపు కేటాయింపు జరగాలనీ కేంద్ర ప్రభుత్వాన్నిఈసభ కోరుతున్నది,"

ఈ సవరణను ప్రభుత్వం ఆమోదించింది సవరణతో తృతీయప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వ తీర్మానాన్ని సభవారు ఏకగ్రీవంగా ఆమోదించారు.

లుముంబాపై సైనికుల ముష్కర చర్యలు

కాంగో పరిస్థితిపై మంత్రివర్గానికి నెహ్రూ వివరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 7

కాంగో ప్రధాని లుముంబా పరిస్థితి చాల ప్రమాదకరంగా తయారైందని, ఆయన ముఖమంతా ఒద్దలైపోయిందని, శరీరం మీదకూడా పలుచోట్ల తీవ్ర గాయాలు తగిలాయని నేడిక్కడికి వచ్చిన వార్తలు తెలుపుతున్నాయి

కాంగోలో దినదినమూ అధ్వాన్నమౌతున్న పరిస్థితులను గురించి కేంద్ర మంత్రివర్గానికి ప్రధాని నెహ్రూ నేటి సాయంత్రం క్లుప్తంగా వివరించినట్లు తెలుస్తూంది.

కాంగో పరిస్థితిని అదుపులో పెట్టడంలో ఐరాస పూర్తిగా విఫలమైంది. లుముంబాకు అనుకూలంగా వున్న కొన్నిరాష్ట్రాలుకేంద్రప్రభుత్వం నుండి విడిపోవాలని, స్వాతంత్ర్యం ప్రకటించుకోవాలని సన్నద్ధమౌతున్నాయి.

కాంగోలో నేడు సంభవించుతున్న పరిణామాలపట్ల ఆఫ్రికా రాజ్యాలు ఆందోళన చెందుతున్నాయి. అధ్య

(మిగతా 8 వ పేజీలో)

కృష్ణా, గోదావరీ నదీజలాల సమస్య:

"మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వాల వైఖరి న్యాయంకాదని నెహ్రూ చెప్పిఉండాల్సింది"

ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలిలో పబ్లిక్ వర్క్సు మంత్రి ప్రకటన

(విశాలాంధ్ర విలేకరి)

హైద్రాబాద్, డిసెంబరు 8

కృష్ణా, గోదావరి నదీజలాల పంపిణీ సమస్యపై మైసూర్, మహారాష్ట్ర ప్రభుత్వాలవైఖరి న్యాయంకాదని ఆ రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాని నెహ్రూ అయినా విస్పష్టంగా చెప్పివుండాల్సిందని పి. డబ్ల్యు డి మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు నిన్న శాసన మండలిలో ఈ సమస్యపై చర్చకు తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ అన్నారు

శ్రీ అల్లూరిప్రతిపాదించిన అధికార తీర్మానాన్ని నేడు శాసనమండలివారు చర్చకు తీసుకున్నారు

తీర్మానంలో యిలా వుంది 1951 నాటి ఒప్పందం న్యాయమైనది న్యాయసూత్రాలపై ఆధారపడి వుంది అందువల్ల దానిని పునఃపరిశీలించరాదు రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ మూలంగా అవసరమైతే కొద్దిపాటి సర్దుబాట్లు మాత్రం చేసుకోవచ్చు"

తీర్మానాన్ని శ్రీ అల్లూరి ప్రతిపాదిస్తూ, 1951 నాటి ఒప్పందాన్ని తిరగదోడాలన్న మైసూర్, మహారాష్ట్ర ప్రభుత్వాల డిమాండ్ అసంగతమైనదని కేంద్ర ప్రభుత్వమూ, ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ ఆ ప్రభుత్వాలకు విస్పష్టంగా చెప్పివుండాల్సిందని తాను అభిప్రాయపడుతున్నా నన్నారు. ఈ సమస్యపై కేంద్రం వైఖరిపట్ల తాను ఆశాభంగం పొందినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ న్యాయమైన వాదనను పూర్తిగా గుర్తించి ఆంధ్రప్రదేశ్ పట్ల సానుభూతి కనబరుస్తుందనడంలో తన కెట్టి సందేహమూలేదన్నారు

శ్రీ అల్లూరి యింకా యిలా అన్నారు:

"ఈ సమస్యకు సంబంధించిన సాంకేతికనిపుణు లందరూ కూడం

(మిగతా 2 వ పేజీలో)

ప్రకటన

మాస్కో సమావేశంలో పాల్గొన్న 81 దేశాల కమ్యూనిస్టుపార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించిన ప్రకటనపూర్తిపాఠం విశాలాంధ్ర 10వ తేదీ సంచికలో ప్రకటిస్తున్నాము పాఠకులు, ఏజెంట్లు గమనించవలెను

మేనేజరు

విశాలాంధ్ర

ఆంధ్ర ప్రభుత్వ అధిపత్యమున శాస్త్రీయముగా తయారైన

INCO'S easy flow Statesman FOUNTAINPEN INK

Sponsored by Ind & Com Govt of A P

'స్టేట్స్‌మన్'
సిరానే వాడి
బహుమతులకు
ప్రయత్నించండి

వివరములు దుకాణదారుని అడిగి తెలుసుకోండి

డిస్ట్రిబ్యూటర్లు: (సర్కారు, రాయలసీమ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు)

స్వాకో జనరల్ ఏజన్సీస్, విజయవాడ - 1

శార్వరినామ సంవత్సర
మార్గశిర బ॥ షష్ఠి రా 7-36
ఆశ్లేష ఉ 8-6

విశాలాంధ్ర

శుక్రవారం 9-12-60

అపశ్రుతులు

రాష్ట్రపతి అంటే రాజ్యాంగాధినేతగా మాత్రమే కాక, పార్లమెంటుకూ, కేంద్రమంత్రివర్గానికీ అతీతమైన సర్వాధికారిగా కూడా ఉండాలన్న ప్రతిపాదన ఒకటి ఇటీవల ముందుకు వస్తున్నది.

మామూలుమనుషులెవరైనా ఇట్టి సూచన చేస్తే అంతగా పట్టించుకోవలసిన పనిఉండేది కాదేమో గాని, రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ తనకుతానై బహిరంగంగా యీ ప్రతిపాదన తెస్తుండటంవల్ల, దీని మంచి చెడ్డలను చర్చించవలసిన అగత్యం ఏర్పడుతున్నది.

రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ఈమధ్య ఢిల్లీలో 'ఇండియన్ లా ఇన్‌స్టిట్యూట్' భవనాలకు ప్రారంభోత్సవం చేస్తూ 'బ్రిటిష్ చక్రవర్తి వలె భారత రాష్ట్రపతి కూడా కేంద్రమంత్రివర్గ సలహా ప్రకారం రాజ్యాంగాధినేతగా మాత్రమే వ్యవహరించాలన్న అభిప్రాయం మన దేశంలో ప్రబలివున్నదనీ, ఇదితప్పో - ఒప్పో, బ్రిటిష్ చక్రవర్తికీ, భారత రాష్ట్రపతికీ గల అధికారాలు - వ్యవహారాలు ఎక్కడెక్కడ ఎంతవరకు విభేదిస్తున్నాయో అధ్యయనం చేయమనీ' న్యాయవాదులకూ, న్యాయమూర్తులకూ ఒకవిజ్ఞప్తి చేశారు

అంతటితోనే ఆగలేదు ఇక్కడ రాజ్యాంగంద్వారా కార్యనిర్వహణాధికారం సంపూర్ణంగా రాష్ట్రపతికి దఖలు పడివున్నదనీ, ఆయన కేంద్రమంత్రివర్గ సలహాకు బద్ధుడు కానవసరం లేదనీ, వంశపారంపర్యా వారసత్వహక్కుగల్న బ్రిటిష్ చక్రవర్తికీ, ఎన్నికద్వారా అధికారంలోకి వచ్చి, రాజ్యాంగ విహిత పద్ధతుల ప్రకారం తొలగించడానికి వీలున్న రాష్ట్రపతికీ తేడా కలదనీ శ్రీ రాజేంద్రప్రసాద్ వాదన

అలాగే భారత రాష్ట్రపతికి రక్షణ విషయాల్లో సర్వాధిపత్యం ఉండటం, రాజ్యాంగంలోని 44,75 నిబంధనలప్రకారం ప్రధానమంత్రిని రాష్ట్రపతే నియమించడం, ప్రధాని సలహాపై మంత్రివర్గాన్ని నియమించేదికూడా రాష్ట్రపతే కావటం, మంత్రివర్గంరాష్ట్రపతియొక్క విధుల నిర్వహణలో సహాయపడేదిగా ఉండాలని నిర్వచించటం - ఇవన్నీ తన వాదనకు తగిన ఆధారాలని రాజేంద్రప్రసాద్‌వక్కాణిస్తున్నారు

వీటినిబట్టి రాష్ట్రపతి రాజ్యాంగాధినేతకన్న అధికమనీ, పార్లమెంటుకూ మంత్రివర్గానికీ బాధ్యుడు కాకపోగా, ఆయనే ప్రధానిని నియమించడంవల్ల ప్రధానికన్న ఎక్కువనీ, సర్వసైన్యాధిపత్యమూ, కార్యనిర్వహణాధికారమూ ఉండటంవల్ల రాష్ట్రపతి సర్వాధికారేననీ శ్రీ రాజేంద్రప్రసాద్ అభిప్రాయపడుతున్నట్లు స్పష్టం.

అంటే ప్రస్తుతం మనదేశంలో ఉన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్నే ఆయన బహిరంగంగా సవాలు చేస్తున్నారన్నమాట

ఇది ఎంత ప్రమాదభూయిష్ఠమో వేరే చెప్పనక్కర్లేదు.

రాష్ట్రపతిఅంతటివాడు, తనకు గల అధికారాలెట్టివో పరిశీలించమని న్యాయవేత్తలను అర్థించటమే అసాధారణ విషయం. దీనికితోడు ప్రజలెన్నుకున్న పార్లమెంటునూ, మంత్రివర్గాన్నికాదని రాష్ట్రపతిని సర్వాధికారి గానూ నియంత గానూ రూపొందించాలనిచూడటం మరీ విడ్డూరం

అధికార వర్గాల్లో ఇలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక భావాలు ప్రబలమై, ఎన్నిచోట్ల ప్రజాతంత్ర ప్రభుత్వాలు ఎగిరి పోతున్నాయో నిత్యం మనంచూస్తూనే ఉన్నాం.

కాగా, రాష్ట్రపతే ఇట్టి ప్రచారం మొదలుపెడితే, ఇక అభివృద్ధి నిరోధకులను పట్టపగ్గాలుండవన్న సంగతి మనకు తెలియనిది కాదు ఇప్పటికప్పుడే గుర్తి

వ్యాపారుల పత్రికలు కొన్ని రాష్ట్రపతి సూచనలను ఆకాశానికెత్తుతూ ప్రచారం కూడా ప్రారంభించాయి

ఈ అపశ్రుతుల్ని మొగ్గలోనే తుంచివేయాలంటే పెద్దపెట్టున ప్రజల అసమ్మతి ప్రదర్శితంకావాలి

ముఖ్యంగా రాష్ట్రపతి ప్రతిపాదనలపై తన అభిప్రాయమేమిటో ప్రధానమంత్రి స్పష్టీకరించాలి అలాగే పార్లమెంటుకూడా ఈ సమస్యమీద తక్షణం కూలంకషమైన చర్చ జరపటం అవసరం

ప్రణాళికల డబ్బు కాంగ్రెస్ దొరల పాలు

నాగర్ కర్నూలు సభలో శ్రీ రాజేశ్వరరావు విమర్శ

నాగరుకర్నూలు, డిసెంబరు 6

ప్రణాళికల నుద్దేశించింది పేద ప్రజల బాగుకోసమే కాని, వాటిద్వారా వచ్చినడబ్బంతా కాంగ్రెసు దొరలు పంచుకొంటున్నారని ఇక్కడ జరిగిన ఒక బహిరంగసభలో రాష్ట్ర కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావుగారు విమర్శించారు

ఒకవంక ప్రణాళికలు అంటూ ఉంటే, రెండవవంక ఆహారధాన్యాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి కాంగ్రెస్ దొరలను ప్రణాళికలు అమలుజరచమని కోరడం, దొంగ చేతికి తాళంచెవి ఇవ్వడంవంటిదే కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన ప్రణాళికలను జయప్రదం చేయడానికీ, ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో సహకరించడానికీ కమ్యూనిస్టుపార్టీ సిద్ధంగా ఉంది. కాని కాంగ్రెస్‌వారు చిత్తశుద్ధితో ముందుకు రావాలని శ్రీ రాజేశ్వరరావుగారు అన్నారు.

సభాధ్యక్షులు శ్రీ కె. లక్ష్మణాచారిగారు ఉపన్యసిస్తూ, సబ్సిడీబావులన్నీ కాంగ్రెస్ దొరలకే మంజూరు చేశారని తెలియజేశారు. జిల్లాలోని దేశ్‌ముఖ్‌లు తమ పాతవిధానాన్ని మార్చుకొని, కొత్త పద్ధతులలో దోపిడీ మొదలుపెట్టారని చెప్పారు.

శ్రీ ఇంద్రెకల్లు తిరుపతిరెడ్డిగారు కమ్యూనిస్టుపార్టీ నిధికి పదిరూపాయలు విరాళమిచ్చారు

ఉపన్యాసాల అనంతరం రంగన్న దళంవారు గోసాయి ప్రదర్శనం, గొల్లసుద్దులద్వారా ప్రజలను ఆనందపరచారు. తాలూకా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ లింగారెడ్డి వందనసమర్పణతో సభ ముగిసింది.

కాంగ్రెస్‌వారి పశువులకేనా టీకాలు!

మధిర, డిసెంబరు 5

మధిరబ్లాక్‌కు చెందిన దెందుకూరు గ్రామంలో ఇటీవల పశువులకుటీకాలు వేయడానికి వచ్చిన కాంపౌండరు, స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు చూపించిన పశువులకు మాత్రమే టీకాలు వేసి వెళ్ళిపోయాడు గ్రామంలో నూటికి తొంభై పశువులకు టీకాలు వేయలేదు

మధిర పంచాయతీ సమితి స్థాయీ సమితి ఏర్పాటు అయినప్పటినుండి ఈ పక్షపాతం ప్రారంభమైంది. సమితి కిందవున్న 24 పంచాయతీలలో 9 పంచాయతీలకు యిందులో ప్రాతినిధ్యం లేదు

బ్లాకు పంచాయతీసమితి కంపోస్టు ఎరువుల ట్రెయినింగ్ అనే తతంగం ఒకటి ఏర్పాటుచేసి తమ అనుయాయులను పిలిపించారు 50 మంది ట్రెయినింగ్‌కు 8 రోజులు హాజరు కావాలి. ఒక్కొక్కరికి రూపాయిన్నర బత్తా యిస్తారు ట్రెయినింగ్ యిచ్చేది ఒక గంట ఆ గంట సేపూ ఉపన్యాసం వుంటుంది. విన్నందుకు రూపాయిన్నర బత్తా ఈ విధంగా సమితి తమ అనుయాయులకు, చివరకు బజారున వెళ్లుతున్నా పిలిచి కూర్చోబెట్టుకుంటున్నారు. తమ అనుయాయులు కానివారు ఆఫీసు ప్రాంతంలో వుంటే అమర్యాదగా ప్రవర్తిస్తున్నారు

ప్రదేశ్ కార్మిక సంఘాల ఆఫీసులు

చిరునామాల మార్పు

హైద్రాబాద్, డిసెంబరు 8

ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్, ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ప్రదేశ్ హైవేస్ పనివారల సంఘ ఆఫీసులను చిక్కడపల్లినుండి హిమయత్‌నగర్‌కు మార్చారు

ఇకమీదట ఈక్రింది చిరునామాకు ఉత్తరప్రత్యుత్తరాలు జరపాలి

"3-6-602, హిమయత్‌నగర్, హైద్రాబాద్" అని వ్రాయాలి

(వి వి.)

1960 సంవత్సరపు తిరువాన్కూరు పట్టణ ప్రణాళికా సవరణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు

◆ ◆ ◆

అమ్మకంపన్ను చెల్లించేందుకు మద్రాసులో ప్రత్యేక మనియార్డరు ఫారాలు 1961నుండి అమల్లోకి వస్తాయని పోస్టుమాష్టర్ జనరల్ అన్నారు

వ్యవసాయ కార్మికుల వేతన నిర్ణాయక సంఘ సిఫార్సులు

ఆశాభంగం కలిగిస్తున్నాయని శ్రీ నండూరి ప్రసాదరావుగారి విమర్శ

హైద్రాబాద్, డిసెంబరు 8

"వ్యవసాయ కార్మికుల కనీస వేతనాల నిర్ణాయకసంఘ నివేదిక చాలా ఆశాభంగం కల్గిస్తోంది. భారత ప్రభుత్వం ఆధ్వర్యాన జరిగిన ద్వితీయ వ్యవసాయ కార్మిక విచారణవల్ల వెల్లడైన కార్మికుల జీవన వ్యయ, హీన పరిస్థితులను ఈ సంఘం గణనలోకి తీసుకోవడంలో విఫలమైంది" అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘ కోశాధికారి శ్రీ నండూరి ప్రసాదరావుగారు ఒక ప్రకటనలో విమర్శించారు

శ్రీ ప్రసాదరావుగారు తమ ప్రకటనలో ఇంకా యీ క్రింది విషయాలను తెలిపారు

"వ్యవసాయ కార్మికుల వేతన నిర్ణాయక సంఘం సూచించినకనీసవేతనాలు ప్రస్తుతమున్న దినసరి వేతనాలకన్నా చాల తక్కువగా వున్నాయని చెప్పడానికి విచారిస్తున్నాను కరువుభత్యంగాని, లేదా తదితర సౌకర్యాలుగాని లేని వ్యవసాయరంగంలాంటి పరిశ్రమలో వ్యవసాయ కార్మికునికివచ్చేది కూలిమాత్రమే అందుకల్ల ప్రస్తుతమున్న రేట్లకన్నా తక్కువ స్థాయిలో కనీస వేతనం నిర్ణయించడమంటే ఆ నివేదికను భూస్వాముల నివేదిక అనాలిగాని మరేమీ అనలేం

ఆచరణలో కనీసవేతనం అనేది గరిష్టవేతన మవుతుంది కాబట్టి ప్రస్తుతమున్న రేట్లకన్నా తక్కువగా ఈ కనీస వేతనం నిర్ణయించడమంటే అది వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధం

"వ్యవసాయం బాగా అభివృద్ధి చెందుతోందని ప్రభుత్వం పెద్దగా చెప్పకుంటోంది. ఉత్పత్తి పెరుగుతోందని అంటూంది అదే నిజమైతే మరి వేతన నిర్ణాయకసంఘంవారు మరింత ఉదారమైన, వాస్తవికమైన వేతనాలను నిర్ణయించి వుండాల్సింది. కాని అలా జరుగలేదు.

"కాని వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించాల్సి వచ్చేసరికి, వ్యవసాయరంగం అధికతర వేతనాలను భరించలేదని ఏవేవో ఇతర వాదనలను తీసుకొస్తున్నారు ఇది నాల్కచీలిన ధోరణితప్ప మరొకటి కాదు

"అందువల్ల వేతన నిర్ణాయకసంఘం కన్నా ప్రభుత్వం, ఈ విషయంలో మరింత సానుభూతికర వాస్తవికమైన వైఖరిని అవలంబించాలనీ, రాష్ట్ర వ్యవసాయ కార్మిక మహాసభ సూచించిన కనీస వేతనాలను నిర్ణయించాలనీ కోరుతున్నాను. తేలికరకపు పనికి కనీసవేతనం రోజుకు రు. 1-50 కన్న తక్కువ వుండరాదు నాట్లు, కోతలప్పుడు, మాత్రం ఈ కూలి యెక్కువగా వుండాలి. పోతే దుక్కులప్పుడు, మట్టి త్రవ్వకాలప్పుడు తదితర కష్టపుపనులకు రు 2 లకు తక్కువ వుండరాదు

"ఈ విషయమై వ్యవసాయకార్మికులకు మంచిసౌకర్యాలు ఏర్పడేటట్లు, ప్రస్తుత జీవనవ్యయానికి అనుగుణంగా కనీసవేతనాలను నిర్ణయించాలని ఆంధ్రప్రదేశ్‌లోని శాసనసభ్యులంతా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయవలసిందిగా కోరుతున్నాను."

సమితుల నిర్మాణంలో పరోక్షపు ఎన్నికలు అనర్థకారకమని

శ్రీ సదాశివన్ సాక్ష్యం

అనంతపురం, డిసెంబరు 7

పంచాయతీ సమితుల నిర్మాణంలో పరోక్షపు ఎన్నికలు సర్వానర్థకరములుగా మారినవనిశాసనమండలిసభ్యులు శ్రీ ఐ. సదాశివన్ పంచాయతీ పాలనా పరిశీలనకమిటీ ముందు సాక్ష్యమిచ్చారు

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ తరఫున నియమించబడిన పంచాయతీ పరిపాలన పరిశీలనోపసంఘం నిన్న యిక్కడకు వచ్చింది ఏడుమందికిగాను శ్రీయుతులు రఘువీరసహాయ్ (నాయకులు), శ్రీ యస్ ఆర్ మాల్కాని, యస్ ఆర్ కులకర్ణి, కె వి. రామకృష్ణారెడ్డిగార్లు నలుగురు వచ్చారు తక్కిన ముగ్గురు రెండుమూడు రోజులలో కలుసుకుంటారట.

జిల్లాపరిషత్తు సమావేశంలో వీరిని కలుసుకొని సభ్యులు వివిధములైన సలహాలు చెప్పారు పరిషత్తు అధ్యక్షులు శ్రీ చిదంబరరెడ్డిగారు ఒక నివేదికను సమర్పించారు

జిల్లా కలెక్టరు శ్రీ యస్ ఆర్ రామమూర్తిగారు సాధకబాధకాలను వివరించారు

శాసనమండలి సభ్యులు శ్రీ ఐదుకల్లు సదాశివన్‌గారు వారితో సాక్ష్యమిస్తూ యిలా అన్నారు

"పంచాయతీ సమితుల పరిపాలన వచ్చిన తర్వాత ఎన్నడూ లేనంత లంచగొండితనం, దౌర్జన్యం, ముఠాతత్వం పెరిగిపోయింది కక్షలు పెరిగాయి దీనికి ప్రధాన కారణము ప్రత్యక్ష ఎన్నికలు కాకుండా పరోక్షపు ఎన్నికలద్వారాఈనిర్మాణం జరగడమే సర్వ హక్కులూ సమితులకు దఖలుపరచకుండా బి డి. ఓ లను అడ్డుపెట్టి ఇద్దరిమధ్యా వైషమ్యాలు పెరిగేటట్లు చేశారు కొందరుసమితిఅధ్యక్షులు తమముఠాకోరికలనే తీర్చడానికి పూనుకొనడంతో యీ వ్యతిరేకత ఇంకా పెరిగింది. చాలీచాలని గ్రాంట్లతోను, ప్రజలు దరిద్రావస్థతో సతమతమౌతూవుంటే వారు కూడా విరాళము యివ్వవలెననే పద్ధతివలనను జరగవలసినంతపని జరగడంలేదు"

సింగనమల సమితి అధ్యక్షులు శ్రీ పొడరాళ్ళ లక్ష్మన్నగారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిషత్తులు, సమితులు, పంచాయతీలు, అందరూ ప్రజలమీదపడి పన్నులు వసూలుజేయుటకు పూనుకొని ప్రజలను విసుగెత్తించుచున్నారనీ, పరిపాలనను వికేంద్రీకరణ చేసినట్లుగానే పన్నులను కూడా వికేంద్రీకరణ చేస్తే బాగని అన్నారు.

కంబదూరు పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ వి ఓబయ్యగారు వికేంద్రీకరణ పేరుతో అధికార కేంద్రీకరణ జరుగుతూ వుందన్నారు

తాము కరువు వుందని తీర్మానము చేసి పంపితే ప్రభుత్వం నమ్మక, తిరిగి తాసీల్దారు రిపోర్టు తెప్పించుకొంటూ తమ గౌరవానికే లోటు తెస్తున్నారని అన్నారు. (వి వి)

ఉద్యోగుల సంఘాల గుర్తింపు

ప్రభుత్వం పునరాలోచింపుతున్నదని లోక్‌సభలో శ్రీ పంత్ వివరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 7

ప్రభుత్వానికి, ప్రభుత్వోద్యోగులకు మధ్య వుండవలసిన సంబంధాల పూర్తి అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదనీ, పరిశీలన పూర్తి అయినతర్వాత గుర్తింపు రద్దుచేసిన ఉద్యోగుల సంఘాల్లో ఏయే సంఘాలకు తిరిగి గుర్తింపుయివ్వాలో ప్రభుత్వంఆలోచిస్తుందని హోంశాఖామంత్రి శ్రీ పంత్ నేడు లోక్‌సభలో ప్రశ్నలకు సమాధానం చెబుతూ అన్నారు.

కేంద్ర ఉద్యోగుల సమ్మె సందర్భంలో సంఘాలు నిర్వహించిన పాత్రపై కేంద్ర ప్రభుత్వం గుర్తింపు రద్దు చేసిన అంశంపై సభ్యులు అనేక ప్రశ్నలు వేశారు. సభలో వాదోపవాదాలు తీవ్రంగా జరిగాయి. ఒకదశలో స్వతంత్రసభ్యుడు శ్రీ రాజా మహేంద్ర ప్రతాప్ సింగ్‌ని స్పీకరు మందలించారు స్పీకరు యిచ్చిన తీర్పు ప్రకారం నడచుకొనకపోతే చర్యలు తీసుకోవలసి వస్తుందని కూడా స్పీకరు అన్నారు

సమ్మె సందర్భంలో కొన్ని సంఘాలు దేశద్రోహకరమైనచర్యల్లో పాల్గొన్నాయని కాంగ్రెసు సభ్యుడు శ్రీ సేర్ గోవిందదాస్ చేసిన ఆరోపణలకు ప్రజా సోషలిస్టు సభ్యులు శ్రీ నాద్‌పాయ్ ఆక్షేపణ తెలియజేశారు మరి కొందరు ప్రతిపక్షసభ్యులుకూడ తమ నిరసనను తెలిపారు

విచ్ఛిన్నకర పద్ధతులు అవలంబించే సంఘాలపట్ల ప్రభుత్వం యెలాంటి వైఖరి అనుసరిస్తున్నదని శ్రీ మహావీరత్యాగి ప్రశ్నించారు కొన్ని సంఘాలను రద్దు చేయాలని తీర్మానించుకొన్న తర్వాత మళ్ళీ గుర్తించే విషయం ఆలోచిస్తున్నామని మంత్రిగారు తెలియచేయడాన్ని తాను అర్థం చేసుకొనలేకుండా వున్నట్లు శ్రీ త్యాగి అన్నారు ఈ విధంగా ప్రతిరోజూ పద్ధతులను మార్చడం ఎందుకో తనకు తెలియడంలేదన్నారు

ప్రమాదకరమయిన, అవమానకరమయిన నిందలతోకూడిన విసుర్లు సభ్యులు ప్రయోగించడాన్ని అరికట్టవలసిందిగా నాద్‌పాయ్ స్పీకరుకు విజ్ఞప్తి చేశారు కొన్ని సంఘాల గుర్తింపును ప్రభుత్వం రద్దు చేయడానికి కారణం సమ్మె పట్టుబద్ధమైందికాదని ప్రభుత్వం భావించింది కనుకనేగాని సంఘాలు దేశద్రోహకరమైన చర్యల్లో దిగాయన్న కారణం మీదకాదని శ్రీ నాద్‌పాయ్ వివరించారు.

ఇరుపక్షాలవారూ తమ అభిప్రాయాలపై గట్టిగా వున్నారు. గనుక రెండు అభిప్రాయాలను వెలిబుచ్చుకొనడానికీ తాను అనుమతి నిస్తానని స్పీకర్ తెలియజేశారు.

శ్రీ పంత్ సమాధానమిస్తూ ఇలా అన్నారు

పరస్పర విరుద్ధమైన ధోరణులను నేను అవలంబించడంలేదు రెండు రకాలైన భావాలొచ్చేటట్లు నేను ప్రసంగించడంకూడాలేదు ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగుల మధ్య వుండవలసిన సంబంధాలను పరిశీలిస్తున్నాము ఏ పరిస్థితుల్లో సంఘానికి గుర్తింపు ఇవ్వాలో కూడా పరిశీలిస్తున్నాము అవన్నీ పరిశీలించిన తర్వాత గుర్తింపు రద్దుచేసిన ఏ సంఘాలకు తిరిగి గుర్తింపు ఇవ్వాలో మేము ఆలోచిస్తాం

సంఘాలు ఏవిధంగా వ్యవహరిస్తున్నాయో కూడా ప్రభుత్వం పరీక్షిస్తుంది అప్పుడే గుర్తింపు ప్రశ్నను పునరాలోచిస్తుంది

ఈ అంశంపై ప్రభుత్వం నిర్ణయాలు యెప్పుడు చేస్తుంది అనే విషయం నేను చెప్పలేను ఇందులోవున్న లోతుపాతులు అర్థం చేసుకోవాలని సభ్యులకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను"

ఏలూరు కళాశాల విద్యార్థుల నిరసన సమ్మె

ఏలూరు, డిసెంబరు 8

ఏలూరు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి కళాశాలా విద్యార్థులు నిన్న పరీక్షా విధానంపట్ల నిరసనగా సమ్మె చేశారు (1) మూడేండ్ల డిగ్రీకోర్సు చదివేవారిని పార్టు I లో ఏ ఒక్క సబ్జెక్టు తప్పినా ఈ ఏడు జరిగే గ్రూపు పరీక్షలకు పంపకపోవటం, (2) ప్యాస్ మార్కులను 35% కాకుండా 40% పెట్టటం, (3) పి. యు. సి విద్యార్థులకు కూడా 40% మార్కులు పెట్టడం ఈ నిరసన సమ్మెకు కారణాలు

శాసనమండలిలో అల్లూరి ప్రకటన

(1వ పేజీ తరువాయి)

క్రమంగా చర్చించినమీదటే 1951 నాటి ఒప్పందం కుదిరింది అందువల్ల ఇప్పుడా ఒప్పందాన్ని పునః పరిశీలించాలనడంవల్ల ఒక ప్రశ్న ఎదురవుతుంది అందుకు సంబంధించిన రాష్ట్రాలమధ్య అటువంటి ఒప్పందాలు ఒకసారి కుదిరిన తరువాత వాటిని ఎవరి వీలుకొద్దీ వారు తిరుగతోడాలనుకుంటే, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సందర్భంలోనూ, అటువంటి ఇతర విషయాలలోనూ కుదిరిన అనేక ఒప్పందాల గతేమికాను? పైగా 1951 నాటి ఒప్పందం అనేది రాజకీయ ఒప్పందమేమీ కాదు అది కేవలం సాంకేతిక విషయాలకు సంబంధించిన ఒప్పందం అందులో అనవసరమైన విషయాలేమీ లేవు.

జాతీయ ప్రయోజనాలు

"రాష్ట్రాల పునర్విభజనకు ముందే 1951 నాటి ఒప్పందం కుదిరింది ఈ ఒప్పందం చర్చలప్పుడు మద్రాసు, మైసూరు, హైద్రాబాద్, బొంబాయిరాష్ట్రాల ప్రభుత్వాలు పాల్గొన్నాయి ఆ సమయంలో ఈ ఒప్పందాన్ని వారు సంకుచితమైన ప్రాంతీయ భాషావాదం దృష్ట్యా పరిశీలించలేదు ఎక్కువమంది ప్రజలకు ఎక్కువ లాభాలు చేకూరాలన్న విశాల సూత్రాల దృష్ట్యానే వారీ ఒప్పందాన్ని పరిశీలించారు ఇలా ఎందుకు జరిగింది? అన్ని రాష్ట్రాలలోనూ ఆనాడు మిశ్రమ జనాభావుంది అందువల్ల రాష్ట్రాలు భాషావివాదానికి తావీయకుండా జాతీయ ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకున్నాయి.

'అందువల్ల రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ఫలితంగా అవసరమైన కొద్దిపాటి మార్పులుతప్ప 1951 నాటి ఒప్పందాన్ని పునః పరిశీలించాలనడానికి ఆంధ్ర ప్రజలుగాని, ఆంధ్ర ప్రభుత్వంగాని ఎటువంటి కారణమూ ఊహించలేకుండావున్నారు ఒప్పందం న్యాయసూత్రాలపై ఆధారపడివుంది కాబట్టి ఆ ఒప్పందాన్ని తిరుగతోడాలని ఎవరినుండి డిమాండు వచ్చినా అది అసంగతమూ, అసంబద్ధమూ. మైసూర్, మహారాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి ఆంధ్రుల ఆందోళన చెందడం న్యాయమైనదే. అయితే ఈ సమస్యను వారు (ఆంధ్రులు) ఉద్రేకంతోగాని, దురహంకారంతో గాని పరిశీలిస్తున్నట్లు భావించరాదు దేశం యొక్క మంచికోసం తమ ప్రయోజనాల్ని అవసరమొచ్చినప్పుడు పణంగాపెట్టడం ఆంధ్రులకు ఎప్పుడూ వున్న సుగుణమే. మహారాష్ట్ర సంపదైశ్వర్యాలను ఆకాంక్షించడంలోగాని, అది దానికనుగుణమైన జాతీయ అభివృద్ధి కోరడంలోగాని లేదా పశ్చిమకనుమలలోని జలాలనువిద్యుదుత్పత్తికి వినియోగించుకోవడానికి ఆ రాష్ట్రానికి కేంద్రం ఆర్థిక సహాయం చేస్తున్నందుకు సంతోషించడంలోగాని ఆంధ్రులు ఎవరికీ వెనుదీయరు అయితే జాతీయ ప్రయోజనాలదృష్ట్యా తగినంత ఆహారోత్పత్తి జరగాలనీ, అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ నీటికి వాలైన ప్రాంతాన్ని నిర్ణయించడంలోఅంగీకృతమైన సూత్రాలకు కట్టుబడి వుండాలనీ ఆంధ్రులు కోరుతున్నారు. ఎక్కువ మందిప్రజలకు ఎక్కువలాభం చేకూరాలని కోరుతున్నారు అందువల్ల ఎక్కువ మందికి లాభదాయకమైన 1951 నాటి ఒప్పందాన్ని తిరగతోడరాదనీ, అలా చేస్తే అది ఆంధ్రులకు అన్యాయం చేసినట్లేననీ ఆంధ్రులుభావిస్తున్నారు"

శ్రీ కొల్లా వెంకయ్య విమర్శ

తరువాత ప్రతిపక్ష నాయకులు శ్రీ కొల్లా వెంకయ్య చర్చను ప్రారంభిస్తూ ఇలా అన్నారు

"మన రాజ్యాంగంలో, అంతరాష్ట్రీయనదులను అభివృద్ధిచేసి వాటిని క్రమబద్ధం చేయాల్సిన హక్కు కేంద్ర ప్రభుత్వానికి వున్నా, 1951 నాటి ఒప్పందం వివాదంపై కేంద్ర ప్రభుత్వం ముభావంగా వుండడం ఆశ్చర్యంగా వుంది నదీజలాల్ని అభివృద్ధిచేసే హక్కుకూడా కేంద్రానికి వుంది. తప్పుత్రోవ తొక్కిన రాష్ట్రాలకు సహాయం యివ్వలేని పరిస్థితికి కేంద్రం దిగజారింది. తన అధికారాన్ని అది వినియోగించ లేకపోతోంది.

"1951 ఒప్పందం సంపూర్ణమైన చర్చల అనంతరమే కుదిరినదన్న విషయం సుస్పష్టం అటువంటప్పుడు కేంద్రం బయటపడి ఆఒప్పందాన్ని తిరగతోడాలన్న వాదనను ఎందుకు ఖండించదు? ఆంధ్ర వైఖరి న్యాయమైనదేనని కేంద్రానికికూడా నమ్మకంఏర్పడి వుంటుందనడంలో నాకెట్టి సందేహమూ లేదు కాని తనకు బాగా తెలిసిన యింకా ఏవో కారణాల వల్లనే కేంద్రం కిమిన్నాస్తిగా వుంది. మైసూరు, మహారాష్ట్ర వాదనలే న్యాయ సూత్రాలపై ఆధారపడి వున్నట్లయితే ఆంధ్ర ప్రభుత్వం 1951 నాటి ఒప్పందాన్ని పునః పరిశీలించి వుండేదే కాని తమకు కృష్ణ నీటిలో 65 శతకోటి ఘనపుటడుగుల నీరు కావాలని మైసూర్, గోదావరి నుండి 65 శతకోటి ఘనపుటడుగుల నీరు కావాలని మహారాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న డిమాండ్లు చాలా అసంబద్ధమైనవి ఈ డిమాండును వారు మొత్తం ఒప్పందాన్ని తిరుగతోడడానికి సాకుగా వినియోగించుకుంటున్నారు ఇంతకన్నా వారి కోర్కెకు ఇంకా బలమైన కారణాలు వుండివుండాలి అందుకనేవారు ఒప్పందాన్ని తిరగతోడాలంటున్నారు ఆరాష్ట్రాల నుండి కృష్ణానదిలోకి ప్రవహించే నీరు 45 శతకోటి ఘనపుటడుగులకన్నా యెక్కువ వుండదు అలాగే గోదావరి నీటిలో తమకు రావాలని మహారాష్ట్ర ప్రభుత్వం చెపుతున్న వాటా కూడా విపరీతపు కోర్కెగా వుంది. వాస్తవానికి మహారాష్ట్ర నుండి గోదావరి నదిలోకి ప్రవహించే నీటికన్నా మహారాష్ట్ర కోరుకుంటున్న వాటా చాలాఎక్కువనే చెప్పాలి

నీటికి వాలైన ప్రాంతం

"నదీలోయను నిర్ణయించడానికి నీటికి వాలైన ప్రాంతమనే సూత్రం "ఎక్కువమంది ప్రజలకు ఎక్కువ లాభాలు" సమకూడాలన్న సూత్రంపై ఆధారపడినది ఆర్థికప్రయోజనంరీత్యా కూడా ఇది ముఖ్యమైనదే

నీరు ఎక్కడ ప్రవహిస్తుందో ఆరాష్ట్ర వినియోగానికి అవిఉపయోగపడాలన్న అంతర్జాతీయ సూత్రాన్ని ఆధారంగా తీసుకున్నా, ఆంధ్రుల వైఖరే న్యాయమైనదని బోధపడుతుంది

"ఒకవేళ మహారాష్ట్రకు విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి నీరుకావాలంటే, పశ్చిమ కనుమలలో లభ్యమయ్యే నీటిని వారు పుష్కలంగా వినియోగించుకోవచ్చుగదా? వాస్తవానికీ నీరు వృధాగా సముద్రంలోకే పోతుందిగదా? ఈనాడు దేశానికి అవసరమైనది ఆహారధాన్యాలు. వాటినిఆంధ్రలోమాత్రమే చౌకగా ఉత్పత్తిచేయగలం ఆంధ్రలోని నేల, ఇరిగేషన్ పరిస్థితులూ ఆహారోత్పత్తికి సరిపోయేవి పైగా చౌకగా లభ్యమవుతాయి

"కృష్ణ లోయలోని అనేక పథకాల (వీటికి 1951 ఒప్పందంలో నీరు కేటాయించారు)ను ఖోస్లా కమిటీ అంగీకరించింది ఈ కమిటీ కృష్ణలోయలోని ప్రాజెక్టులను పరిశీలించింది ఇవి కృష్ణా- పెన్నారు, ఈనాడు నాగార్జునసాగర్-శ్రీశైలం అని పిలువబడే పథకాలు కృష్ణా-పెన్నారుపథకంక్రింద లాభపడే ప్రాంతాలూ, జిల్లాలూ ఈ ప్రాజెక్టుల వల్లా లాభపడతాయి అలాగే గోదావరిపై రామపాదసాగర్ ప్రాజెక్టును అంగీకరించారు దీనికి వెయ్యి శతకోటి ఘనపుటడుగుల నీటిని కేటాయించారు. కాబట్టి ఆంధ్రులు ఇప్పుడే కొత్తపథకాలను తలపెట్టారని చెప్పడంలో అర్థం లేదు."

ఒప్పందంలో స్వల్పమైన మార్పులకు అభ్యంతరం వుండదుగాని, 1951 నాటి ఒప్పందాన్ని పూర్తిగా తిరగతోడాలంటే మాత్రం అందుకు ఆంధ్రులు అంగీకరించరనీ, కమ్యూనిస్టుపార్టీ ప్రభుత్వ తీర్మానాన్ని పూర్తిగా బలపరుస్తోందనీ శ్రీ వెంకయ్య అన్నారు

ప్రదేశ్ శాసనసభ ప్రశ్నోత్తరాలు

[విశాలాంధ్ర విలేకరి]

హైద్రాబాద్, డిసెంబరు 7

గత మేనెలలో కాగజ్‌నగర్ వద్ద జరిగిన అగ్నిప్రమాదంలో రు 6 వేల రూపాయల నష్టం జరిగిందని ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య నేడు రాష్ట్ర శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు

భీమా కంపెనీ అగ్నిప్రమాద కారణాలను విచారించిందనీ, నిజమైన కారణాన్ని కనుగొనలేకపోయిందనీ శ్రీ సంజీవయ్య అన్నారు.

హరిజనుల ఇళ్ళ స్థలాల సమస్య

హరిజనుల ఇళ్ళ నిర్మాణానికి సంబంధించిన పథకాలకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందజేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి శ్రీమతి మసూమా బేగం ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 1960-61 సంవత్సరంలోఇందుకై కేంద్రం యివ్వనున్న గ్రాంటు మొత్తం 5 లక్షల 45 వేల రూపాయలని ఆమె తెలియజేసింది పోతే అదే సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం యిచ్చే మొత్తం 18 లక్షల 12 వేలు.

ఆంధ్రనుండి బియ్యం ఎగుమతి

వ్యవసాయమంత్రి శ్రీ విశ్వేశ్వరరావుప్రశ్నకుసమాధానమిస్తూ, 1959 డిసెంబరునుండి 1960 జనవరి నెలవరకూ ఆంధ్రనుండి 428 టన్నుల బియ్యం ఎగుమతి అయినాయని తెలిపారు ఈ బియ్యం పశ్చిమ బెంగాల్, బొంబాయి, మద్రాసు, కేరళ రాష్ట్రాలకు ఎగుమతి అయినాయన్నారు వీటికితోడు మరో వెయ్యి టన్నులు ప్రయివేట్ వ్యాపారులకు ఎగుమతి అయినాయన్నారు

428 టన్నులబియ్యం కేంద్రం పద్దుక్రిందఎగుమతిఅయినాయనీ, ప్రయివేటు వ్యాపారులకు ఏధరచొప్పున ఎగుమతి అయినదీ తెలియదని మంత్రి అన్నారు

మంత్రి మరోప్రశ్నకు జవాబిస్తూ, రాష్ట్రంలో 1959-1960 సంవత్సరంలో 66 వేల 400 టన్నుల బియ్యం మిగులు తేలిందన్నారు పోతే పంజాబ్, బర్మాలనుండి కొంత బియ్యం మన రాష్ట్రంలోకి దిగుమతి అయినాయన్నారు చౌక డిపోలకు అవసరమైన ఈ బియ్యం చౌకగా లభ్యమైందన్నారు కాని రాష్ట్రంలో లభ్యమైన బియ్యం ధర కొద్ది హెచ్చుగా వుందన్నారు ఇది పేద వారికి అందుబాటులోలేదన్నారు

నెల్లూరు జిల్లాలో పంచాయతీలు

ప్రణాళికామంత్రి శ్రీ బి శంకరయ్య ప్రశ్నకు సమాధానమిస్తూ, నెల్లూరు జిల్లాలో 66 పంచాయతీలున్నాయనీ, ఈజిల్లాలో రెండు, అంతకన్నా ఎక్కువ రెవిన్యూ గ్రామాలున్నాయనీ, ఈ గ్రామాలలో 500 మంది కన్నా ఎక్కువ జనాభా వున్నారని తెలియజేశారు

ఈ పంచాయతీలను ఏర్పర్చడంలో ఆర్థికవనర్లు, గ్రామాల సామీప్యత వగైరా అనేక విషయాలను దృష్టిలో వుంచుకున్నామని ఆయన అన్నారు ఒకవేళ ఏ రెవిన్యూ గ్రామమైనా మరో పంచాయతీతో కలిసివుండి అందులో 500కన్నా మించిన జనాభా వుంటే, ఆ రెవిన్యూ గ్రామం తనకొక ప్రత్యేక పంచాయతీని ఏర్పర్చమని అడుగవచ్చుననీ, ఆ విషయమై ప్రభుత్వం తప్పక ఆలోచిస్తుందనీ మంత్రి అన్నారు

బుల్‌డోజర్ల మరమ్మతులు

రాష్ట్ర వ్యవసాయశాఖ క్రిందనున్న 86 బుల్‌డోజర్లలో 36 బుల్‌డోజర్లు ప్రస్తుతం మరమ్మత్తులలో వున్నాయని వ్యవసాయశాఖా మంత్రి తెలిపారు. అనేక బుల్‌డోజర్లు మరమ్మతులలో వుండడానికి వాటికి కావాల్సిన స్పేర్ పార్టులకు విదేశీ మారకద్రవ్యం కొరతగా వుండడమేనని కూడా ఆయన అన్నారు

ఆంధ్రలో స్టీల్ రోలింగ్ మిల్లు

ఆంధ్రలో స్టీల్ రోలింగ్ మిల్లు నిర్మాణం విషయమై ప్రభుత్వం పరిశీలిస్తోందనీ, అది ఖాయమైతే దానిని ప్రభుత్వరంగంలో నెలకొల్పుతామనీ మంత్రి నేడు తెలియజేశారు ఈ విషయమై ఇంకా ప్రాథమిక పరిశీలన పూర్తి కాలేదన్నారు

నాగా తిరుగుబాటు నాయకుడు ఫిజో

తిరిగి అప్పగించమని బ్రిటిషు ప్రభుత్వాన్ని కోరడం వాంఛనీయం కాదని నెహ్రూ

న్యూఢిల్లీ, డిసెంబరు 8

నాగా తిరుగుబాటు నాయకుడు శ్రీ ఫిజోను మనకు అప్పగించమని బ్రిటిషు ప్రభుత్వాన్ని కోరడం వాంఛనీయం కాదని, ఆ అవసరంకూడాలేదని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో ప్రశ్నలకు సమాధానం చెబుతూ అన్నారు.

శ్రీ నెహ్రూ ఇంకా యిలా అన్నారు శ్రీ ఫిజో ప్రస్తుతం ఇంగ్లాండులో వున్నారు ఆయనకు బ్రిటిషు ప్రభుత్వం పౌరసత్వం యివ్వలేదు అయితే భారత పౌరసత్వ హక్కుమీద ఆధారపడి బ్రిటిషు పరిపాలితుడుగానే అక్కడ వున్నారు. మరో దేశానికి యెక్కడికైనా వెళ్లాలనుకుంటే పాస్‌పోర్టుకొరకు భారత ప్రభుత్వాన్ని కోరాలి

ప్రస్తుత బ్రిటిషు ప్రభుత్వ ప్రకారం కామన్వెల్తు సభ్య దేశాల్లో పౌరుణ్ణి దేశంనుండి బహిష్కరించడానికి వీల్లేదు అయితే మనదేశంనుంచి వెళ్ళినవారిని తిరిగిరప్పించుకొనేందుకు రెండుదేశాలమధ్యా ఒప్పందం కుదుర్చుకోడానికి ప్రయత్నం చేస్తున్నాము. దీనికీ, ఫిజోకూ ఎలాంటి సంబంధమూ లేదు ఈవిషయంలో ప్రభుత్వం అనేకసార్లు ప్రయత్నించింది కాని ఎక్కువ జయం కలుగలేదు

ఇంగ్లాండులో ఫిజో చేసే ప్రచారాన్ని అరికట్టేందుకు భారతప్రభుత్వం ఆ ప్రభుత్వంతో సంప్రతించింది. వ్యక్తి చేసే ప్రచారాన్ని ఆపుచేయడానికివీల్లేదని ఆప్రభుత్వం జవాబిచ్చింది.

'జాతివివక్ష కామన్వెల్త్ వైఖరికి విరుద్ధం'

లోక్‌సభలో నెహ్రూ ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు

కామన్వెల్తు విధానాలకు జా విద్వేష వైఖరి విరుద్ధమని ప్రధా నెహ్రూ లోక్‌సభలో నేడు అన్నా జాతులు సమానమనేది కామన్వె అంగీకరించిన సూత్రాల్లో ఒకటని ప్రధాని నెహ్రూ అన్నారు.

కామన్వెల్త్‌లో ఒక సభ్యదేశం దక్షిణాఫ్రికా రిపబ్లిక్‌గా రూపొందాన్న [illegible] అన్న ప్రశ్నను ప్రస్తావించి శ్రీ నె. ఇంకా ఇలా అన్నారు

దక్షిణాఫ్రికా ఒక రిపబ్లిక్ రూపొందాలని ఆ దేశంలో ఓటింగు జరిగింది. అంతకుమినహా మిగతా ఏ చర్యలూ ఆ దేశం తీసుకోలేదు. కామన్వెల్తులో సభ్యదేశంగా తాను రిపబ్లిక్‌గా రూపొందదలచుకొన్నట్లు దక్షిణాఫ్రికా ప్రభుత్వం భారత దేశానికి తెలియజేయలేదు అందుకు అనుమతించవలసిందిగా కోరలేదు. అలాంటి కోరిక ఆ దేశం వ్యక్తపరిచినప్పుడే అప్పటి పరిస్థితుల నాలోచించి మనం వారి కోరికను పరిశీలిస్తాము."

హనుమాన్ జంక్షన్‌లో పాలపొడి ఉపకేంద్రం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు

గన్నవరం, నూజివీడు, ఏలూరు తాలూకాలను కలుపు ప్రదేశమైన హనుమాన్‌జంక్షన్‌లో పాలపొడి ఉపకేంద్రం అతి త్వరలో ఏర్పాటు చేయబడుతుందని నేడు ఇచ్చటికి వచ్చిన పాల సరఫరా ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ శ్రీ ప్రభాకరరావు, పాల సరఫరా ప్రత్యేకాధికారి శ్రీ కామేశ్వరరావుగార్లు తెలియజేశారు.

ఉపకేంద్రం ఏర్పాటుకు లక్షన్నర రూపాయలు ఖర్చు పెట్టబడుతుందని, మార్చి నెలలోనే భవన నిర్మాణం జరుగగలదని చెప్పారు

స్థల నిర్ణయం చేయడానికై వీరు ఇచ్చటికి వచ్చారు (వి వి)

మద్రాసు రాష్ట్రంలో తుఫాను బాధితుల సహాయార్థం స్థానిక దక్షిణ భారతీయులు 3500 రూపాయలు దానమిచ్చారు

ధరల స్థిరీకరణకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సూచనలు

ధాన్యం బస్తా రు 22 వుండాలని, వాణిజ్య పంటలధరలకు కంట్రోలు పెట్టాలని సిఫార్సు

హైదరాబాద్, డిసెంబరు 7

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో నేడు వ్యవసాయమంత్రి శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, ధరలను పెరగనీయకుండా అదుపులో వుంచడానికి రాష్ట్రప్రభుత్వం ప్రణాళికా సంఘానికి కొన్ని సూచనలు చేసిందని తెలిపారు

కమ్యూనిస్టుసభ్యుడు శ్రీ కాశిరెడ్డి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ మంత్రి ప్రసంగించారు. గత ఏప్రిల్‌లో ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సభలో జరిగిన చర్చల పర్యవసానంగా ఈ సూచనలు చేశామన్నారు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన సూచనలు

1. ధాన్యం, బియ్యం ధరలతోపాటు వాణిజ్య పంటల ధరలను, ఇతర నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో వుంచాలి.

2 రెండవరకం ధాన్యం రెండు మణుగుల బస్తా ధర సంచికాక రూ 22/- వుండాలి, ధాన్యంధరపై ఆధారపడి బియ్యం ధర నిర్ణయం కావాలి

3 ఇతర జీవితావసర వస్తువుల ధరలు పెరిగితే ధాన్యం ధరలనుకూడా అందుకు అనుగుణంగా పెంచాలి

4. ప్రభుత్వం ఆహార ధాన్యాల నిల్వలుపోసి పెద్ద నగరాలకు సప్లయి చేయాలి.

5 మిల్లుల్లో, వ్యాపారులు మున్నగువారు ఆహార ధాన్యాలు నిల్వలుపోసి దాచివేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

6 రాష్ట్రానికంతకూ ఒకే ధరల కంట్రోలు అమలుపరచి, ఉల్లంఘించిన వారిపై కేసులు నడపాలి

7 ప్రభుత్వనిర్ణయానుసారంలైసెన్సు వున్న మిల్లర్లు అనుసరించకపోతే వారి లైసెన్సులు రద్దు చేయాలి

8 ఇతరరాష్ట్రాలకు ఎగుమతి చేయడానికి ఏరాష్ట్రంలో సరుకుకొంటారో ఆ రాష్ట్ర ప్రభుత్వంవద్ద కొనుగోలుదారు లైసెన్సు పొందాలి

9 రైతులను దో[illegible] అవకాశం లేకుండా చేయడానికి పెద్ద మిల్లర్లను ప్రభుత్వానికి ఏజంట్లుగా పెట్టి, కంట్రోలు ధరలకు రైతుల దగ్గర కొనిపించాలి ఈ ధరకు అమ్మడానికి సంసిద్ధత చూపిన రైతు దగ్గరనూ మిల్లులు కొనేలాగా ఉత్తరువు చేయాలి

10. వ్యాపారులు, మిల్లర్లలాగానే రైతులుకూడ ఒక నిర్ణీత మొత్తాన్ని మించి నిల్వపోయాలంటే లైసెన్సు పొందాలి (రైతుకు వున్న భూమిని బట్టి అతడు లైసెన్సు లేకుండా నిల్వవుంచుకోతగిన మొత్తాన్ని నిర్ణయిస్తారు)

ఏడాది అంతా ఒకేవిధమైన కంట్రోలుధర అమలు జరగాలి.

11 బియ్యానికి నిర్ణయించిన ధరపై ఆధారపడి పత్తి, ఆముదాలు, వేరుశనగ మున్నగువాటికి కూడ ధరలు స్థిరీకరించాలి.

12 రైతులకు అవసరమయ్యే వ్యవసాయ పనిముట్లు, ఇనుము, సిమెంటు మున్నగు సరుకులు సక్రమంగా సకాలంలో అందే అన్ని చర్యలను కేంద్రం తీసుకోవాలి.

తాము చేసిన సిఫారసులపై కేంద్రం అభిప్రాయాలకు వేచివున్నామని మంత్రి చెప్పారు

ప్రభుత్వ విధానాలపై ప్రకటనలు

స్పీకరు రూలింగ్

హైదరాబాదు, డిసెంబరు 7

ప్రభుత్వం తన విధానాలపై చేసే ప్రకటనలు, శాసనసభ జరుగుతూన్నప్పుడు, శాసనసభకంటే ముందుగా పత్రికలకు విడుదలచేయడం సరికాదనీ, మొదట శాసనసభ కందించాలనీస్పీకరు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు రూలింగు ఇచ్చారు.

నేడు శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ సుందరయ్య పరిపాలనా సంస్కరణల నివేదిక మొదట వార్తా పత్రికలకు విడుదల చేసిన విషయం స్పీకరు దృష్టికి తీసుకొనిరాగా ఆయన పైవిధంగా రూలింగ్ ఇచ్చారు

ఇటువంటి పత్రాలను పత్రికలకు శాసనసభకు ఒకేసారి విడుదలచేయడం పార్లమెంటుకు సాంప్రదాయమని స్పీకరు చెప్పారు.

వర్షాలు లేనందున పంటలు పండక రాజస్థాన్‌లోని అనేక జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

రష్యాయువజన ప్రతినిధివర్గం

మంత్రి శ్రీ అల్లూరి అధ్యక్షతన హైదరాబాద్‌లో ఆహ్వానసంఘం

హైదరాబాదు, డిసెంబరు 7

ఈ నెల 14 వ తేదీన ఇక్కడికి వస్తున్న సోవియట్ యువజన ప్రతినిధివర్గానికి ఘన స్వాగతం యివ్వడానికి 'మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు గౌరవాధ్యక్షులుగా ఒక ఆహ్వాన సంఘం ఏర్పడింది

నగరంలో సోవియట్ యువజన ప్రతినిధివర్గానికి సన్మాన కార్యకలాపాలను నిర్వహించేందుకుగాను ఈ నెల నాలుగో తేదీన ఇక్కడ ఏర్పాటు చేయబడిన ఆహ్వాన సంఘానికి న్యాయవాది శ్రీ కె వి రఘునాథరెడ్డి అధ్యక్షులుగానూ, సినీ డైరెక్టర్ శ్రీ తాపీ చాణక్య - ప్రజాతంత్ర యువజన సంఘ అధ్యక్షుడైన శ్రీ డి. రామస్వామిగార్లు ఉపాధ్యక్షులుగానూ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ ఉపాధ్యక్షుడైన శ్రీ సురేష్ బాబు ప్రధాన కార్యదర్శిగానూ, టి సత్యనారాయణ, మెహెది అబేదాగార్లు సహాయ కార్యదర్శులుగానూ, శ్రీ హరికృష్ణ అగర్వాలా కోశాధిపతిగానూ ఎన్నుకోబడ్డారు

14 వ తేదీ సాయంత్రం 5–30 గంటలకు సోవియట్ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనాన్ని ఏర్పాటు చేస్తున్నారు

ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల నిర్ణయం

ఓడిపోయినచోట్ల మొదట జరుగుతుందని శ్రీ సంజీవరెడ్డి

హైదరాబాదు, డిసెంబరు 7

గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయిన నియోజకవర్గంలో మొదట తమ అభ్యర్థులను నిర్ణయిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ సంజీవరెడ్డి నేడు విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు.

ఈ నియోజకవర్గాలలో 1961 జూలై ఆఖరుకు అభ్యర్థుల నియామకం పూర్తి అవుతుందన్నారు.

కేరళలో మంత్రివర్గం బాగానే పనిచేస్తున్నదని ఒక ప్రశ్నకు సమాధానం చెప్పుతూ అన్నారు

శ్రీ పళ్ళంరాజు ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు కాబట్టి మంత్రి పదవికి రాజీనామా ఇవ్వవలసి వుందనీ, అయితే దానికొక గడువంటూ లేదనీ శ్రీ సంజీవరెడ్డి అన్నారు ఆంధ్ర ప్రదేశ్ మంత్రివర్గ విస్తరణకు అనుమతి కోరుతూ శ్రీ సంజీవయ్య కాంగ్రెస్ కేంద్ర పార్లమెంటరీబోర్డుకు లేఖ ఏదీ వ్రాయలేదని అన్నారు

సింహళ మార్కెట్టులో భారత నూలు బట్టల ప్రచారం చేసేందుకు డిసెంబరు 19,20 తేదీల్లోకొలంబోలో భారత - సింహళ నూలు బట్టల వారోత్సవం జరుగుతుంది

నదీజలాల వివాదం సుప్రీంకోర్టుకునివేదన

శ్రీ సంజీవరెడ్డి సలహా

హైదరాబాదు, డిసెంబరు 7

కృష్ణా, గోదావరి నదీజలాల పంపిణీపై 1951 లో జరిగిన ఒప్పందం చెల్లదని మైసూరు ప్రభుత్వం వాదిస్తున్నది కనుక ఆ ఒడంబడిక న్యాయసమ్మతమా, కాదా అనే విషయం తేల్చడానికై సమస్యను సుప్రీంకోర్టుకో లేక అడ్వొకేట్ జనరల్‌కో లేక మరో న్యాయశాస్త్ర నిపుణునికో నివేదించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ సంజీవరెడ్డి నేడు సూచించారు

ఈ ఒడంబడిక చెల్లుతుందని వారు నిర్ణయించినపక్షంలో వివాదాన్ని పరిష్కరించడం సులభమవుతుందని శ్రీ సంజీవరెడ్డి అన్నారు

సమస్యను మధ్యవర్తి తీర్పుకు పంపించాలని మీరు అభిప్రాయ పడుతున్నారా అని విలేకరులు ప్రశ్నించగా, ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు లోగడ తాను ఢిల్లీలో పార్లమెంటు సభ్యులతో చెప్పింది కూడ ఇదే నన్నారు

"వివాదం సమరసంగా పరిష్కారం కావడమే నాఅభిప్రాయం ఈసమస్యయే రాష్ట్రంలోనూ ప్రజాందోళనను రెచ్చగొట్టనక్కరలేదు సమస్య పరిష్కారానికి నేను సూచించిన చర్య తీసుకోవాలి ఒడంబడికలుండగా, వాటిని పదేపదే మార్చడం మంచిది కాదు అలా మార్చరాదు" అన్నారు శ్రీ సంజీవరెడ్డి

ప్రభుత్వ రంగంలో కొత్తగూడెం ఎరువుల ఫ్యాక్టరీ నిర్మాణం సందిగ్ధావస్థలోపడటం మొదలగు పరిణామాలనుగురించి మీ రేమనుకుంటున్నారని విలేకరులు ప్రశ్నించగా, గత పదకొండు మాసాలుగా ఆంధ్రప్రదేశ్‌లో ఏమి జరుగుతున్నదో తనకు తెలియదని అన్నారు "ఇతర రాష్ట్రాలలోని పరిణామాలు తెలుసు ఆంధ్రలో ఏమి జరుగుతున్నదో నాకు తెలియదు" అన్నారు

కాంగ్రెస్ ముఠా తగవులు

అనేక రాష్ట్రాలలోని ముఠా తగవులను గూర్చి ప్రశ్నించగా, ఇవన్నీ క్రమక్రమంగా సర్దుబాటు అవుతున్నవనీ, ఈ సంవత్సరం ఆఖరుకు పరిష్కారం కాగలవని ఆశిస్తున్నాననీ అన్నారు

"ఎన్నికలు జరిగే సంవత్సరంలో మనలోమనం ఇలా కొట్లాడుకుంటూ కూర్చోవచ్చునా? ఒరిస్సాలో కాంగ్రెస్‌సంస్థలో సామరస్య మేర్పడింది ఆంధ్రలోకూడా శ్రీ పళ్ళంరాజు అధ్యక్షుడుగా ఎన్నికకావటంశుభసూచకం" అని అన్నారు

అయితే ఈ వివాదాలు విధానాలు, కార్యక్రమాలపై కాక కేవలం పదవులకు వ్యక్తులకు సంబంధించి తలెత్తినవే కదా అని ఒక విలేకరి అనగా, శ్రీ సంజీవరెడ్డి ఆ మాట నిజమేనని అంగీకరించారు

శ్రీ సుబ్బారావు స్మారక సభ

విజయవాడ, డిసెంబరు 8

విశాలాంధ్ర కార్యాలయోద్యోగి శ్రీ కోట సుబ్బారావుగారి మరణానికి సంతాపం తెలియజేయడానికి నేడు సాయంత్రం విశాలాంధ్ర పత్రిక, స్వతంత్రఆర్ట్ ప్రింటర్స్, విశాలాంధ్ర ప్రచురణాలయంలలో పనిచేస్తున్నవారంతా విశాలాంధ్ర కార్యాలయంలో సమావేశమయ్యారు

సమావేశానికి 'విశాలాంధ్ర' ప్రధాన సంపాదకులు శ్రీ మోటూరు హనుమంతరావుగారు అధ్యక్షత వహించారు

శ్రీ సుబ్బారావుగారికి జోహార్లు నర్పిస్తూ సభికులు రెండు నిముషాల పాటు మౌనంగా నిలబడ్డారు ఆయన విశాలాంధ్రసంస్థకుచేసిన సేవను ఉగ్గడిస్తూపలువురు ప్రసంగించిన తరువాత ఈ క్రింది తీర్మానాన్ని సభవారు ఏకగ్రీవంగా ఆమోదించారు

"విశాలాంధ్ర కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీ కోట సుబ్బారావుగారు గత రాత్రి మరణించారనే వార్త ఈ సభవారిని శోక సముద్రంలో ముంచింది.

శ్రీ కోట సుబ్బారావుగారు 'ప్రజాశక్తి' రోజులనుంచీ పత్రికా, కార్యాలయంలో పనిచేస్తూ వచ్చారు ఆయన నిస్వార్థసేవ, పనిలో ఏకాగ్రత, ఆఫీసు అభివృద్ధికి ఆయన పడిన తహతహ ఈ కార్యాలయంలో పనిచేస్తున్న వారందరికీ ఆదర్శప్రాయమైనది

ఇట్టి అమూల్యమైన వ్యక్తిని కోల్పోయి ఈ సంస్థ పూడ్చలేని నష్టానికి గురైనది

శ్రీ కోట సుబ్బారావుగారు మనకు చిరస్మరణీయుడు

ఆయన మరణానికి ఈ సభ గాఢ సంతాపాన్ని వెలిబుచ్చుతున్నది ఆయన కుటుంబానికి సానుభూతిని ప్రకటిస్తున్నది "

'ఏది సత్యం ఏ దసత్యం?'

హైదరాబాదు, డిసెంబరు 7

1959-60 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోవున్న ఆసుపత్రు లెన్ని? 890 ఆసుపత్రులు, వీటిలో 17334 పడకలు వున్నవని తృతీయ ప్రణాళిక ముసాయిదా 16 వ పేజీలోవుంది ఆరవ పేజీలో 890 ఆసుపత్రులూ, వాటిలో 1,334పడకలున్నాయనివుంది 20 వ పేజీలో, ద్వితీయప్రణాళికాంతానికి రాష్ట్రంలో 766 ఆసుపత్రులు, 1500 పడకలూ ఉన్నవని వ్రాశారు

ఆర్థిక గణాంకసంస్థ ఇచ్చిన లెక్కలు 1959-60 లో రాష్ట్రంలో 18533 పడకలు గల 1048 ఆసుపత్రులున్నవని తెల్పుతున్నాయి

ఈ అంకెలను శాసనసభ దృష్టికి తెస్తూ 'వీటిలో ఏది సత్యం ఏదసత్యం? దేన్ని మమ్మల్ని నమ్మమంటారు' అని ప్రతిపక్ష నాయకుడు శ్రీ సుందరయ్య ప్రశ్నించారు

'రష్యా-చైనా మైత్రిని ఛేదించే శక్తి లేదు'

సోవియట్ అధ్యక్షుడు బ్రెజ్‌నెవ్ ఉద్ఘాటన

మాస్కో, డిసెంబరు 7

చైనాకు, తమదేశానికి మధ్య నెలకొన్న సంబంధాన్ని విచ్ఛిన్నం చేయగల శక్తి యీ భూమండలంలో ఏదీలేదని సోవియట్ అధ్యక్షుడు లియోనిడ్ బ్రెజ్‌నెవ్ నేడిక్కడ ఉద్ఘాటించారు.

మాస్కో నగరంలోని క్రీడామందిరంలో సోవియట్ - చైనా మిత్రత్వ సభలో ప్రసంగిస్తూ యీ రెండు దేశాలు 'యథార్థమైన మిత్రత్వంతో' బంధింపబడివున్నాయని చెప్పారు

సోషలిస్టు వ్యవస్థలోకలహానికి ఆధారమేలే దన్నారు.

చైనా ప్రజలకు రష్యా ఒక నిజమైన మిత్రమనీ, బలపరచే శక్తి అనీ వారు విశ్వసించవచ్చునని చెప్పారు

ప్రధాని కృశ్చేవ్ ఇదివరలో చెప్పిన మాటలను ఉల్లేఖించి చైనాపై సామ్రాజ్యవాదులు దాడి చేస్తే దానిని రష్యాపై జరిగిన దాడిగానే పరిగణిస్తామని పునరుద్ఘాటించారు

తృతీయ ప్రణాళికలో అదనపు పన్నులు

పేదలపై పడకుండా చూడాలని శాసనసభలో శ్రీ సుందరయ్యాగారి విజ్ఞప్తి

హైదరాబాదు, డిసెంబరు 6

ఆంధ్రప్రదేశ్ తృతీయ ప్రణాళిక ముసాయిదానుబట్టి, రాష్ట్రప్రభుత్వం ప్రణాళిక పెట్టుబడులలో తన వాటా భరించాలంటే యాభై మూడు కోట్ల రూపాయలను పన్నులద్వారాను, అప్పులద్వారాను సేకరించవలసి వుంటుందని ప్రతిపక్ష నాయకులు శ్రీ సుందరయ్య నిన్నటి తన ఉపన్యాసాన్ని నేడు కూడ కొనసాగిస్తూ చెప్పారు

అయితే, కొత్త పన్నులు విధించేటప్పుడు పట్టణాలలోనూ, గ్రామాలలోనూగల పేదప్రజలపై భారం పడకుండా చూడాలని శ్రీ సుందరయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

పట్టణాలలో నెలకు రు150-120ల వరకు ఆదాయంవున్న కుటుంబాలకు గ్రామాలలో అయిదు ఎకరాలవరకు, మాగాణీ లేక 15-20 ఎకరాలవరకు మెట్ట వున్న రైతులను అదనపు పన్నుల నుండి మినహాయించాలని కోరారు.

మోయగలవారిపైననే పన్నులభారం పడేలాచూడా లన్నారు.

వ్యవసాయోత్పత్తి పెంచాలంటే వ్యవసాయ సంస్కరణలు ప్రవేశపెట్టి భూమిలేని గ్రామీణ పేదలకు భూవసతి చూపించడం అత్యవసరమని శ్రీ సుందరయ్యగారు ఉద్ఘాటించారు. భూమిలేని కుటుంబానికి ఒక ఎకరం ప్రకారం పంచినా అది అధికోత్పత్తికి ఎంతో ప్రోత్సాహమిస్తుం దన్నారు.

9 కోట్ల కేటాయింపుతో తృతీయ ప్రణాళికాకాలంలో 6-11 ఏళ్ళ పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్య అమలుజరపడం సాధ్యంకాదని శ్రీ సుందరయ్య హెచ్చరించారు

గోదావరిపై ఆంధ్ర ప్రభుత్వం తృతీయ ప్రణాళికాకాలంలోనే ఒక ప్రాజెక్టు నిర్మించవలసిన ఆవశ్యకతను వివరిస్తూ, కనీసం గోదావరి తీర వాసులకు వరద ప్రమాదం లేకుండా చేయడానికైనా ఈ ప్రాజెక్టు నిర్మించక తప్పదన్నారు. ప్రాజెక్టుకయ్యే వ్యయం ఒక్క సంవత్సరంలోనే అధికోత్పత్తి ద్వారా వసూలుకాగల దన్నారు

ముష్కర చర్యలు

(1 వ పేజీ తరువాయి)

కుడు కసవూబూ, మొబుటూలకు పశ్చిమ రాజ్యాలు మద్దతు నిస్తున్నందువల్ల అక్కడ పరిస్థితి నానాటికీ అధ్వాన్నంగా తయారౌతున్నదని కూడా అధికారవర్గాలు భావిస్తున్నాయి

కాంగోనుండి భారత అధికారులను వెనక్కు రప్పించే సూచన లేమీలేవని కూడా తెలుస్తున్నది

కోరంలేక శాసనసభ వాయిదా

హైదరాబాదు, డిసెంబరు 6

రాష్ట్ర తృతీయ ప్రణాళికపై చర్చలు సాగించడానికై నేడు సాయంత్రం జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశం కోరం లేనందువల్ల వాయిదా పడింది.

స్పీకరు కోరం గంట మూడుసారులు మ్రోగించారు. కాని కోరంకు అవసరమయిన 30మందిసభ్యులు కూడ సభకు రాలేదు. మొత్తం శాసనసభ్యులసంఖ్య 301.

జిల్లా పరిషత్ అధ్యక్ష మండలి

హైదరాబాదు, డిసెంబరు 7

ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా పరిషత్ అధ్యక్షులు నేడు సమావేశమై, జిల్లా పరిషదధ్యక్ష మండలిని ఏర్పాటు చేయాలని తీర్మానించారు

రాష్ట్రంలోని 20 జిల్లాపరిషత్ అధ్యక్షులలో 16 మంది సమావేశానికి హాజరయ్యారు సమావేశానికి కర్నూలు జిల్లా పరిషత్ అధ్యక్షుడు శ్రీ విజయభాస్కరరెడ్డి అధ్యక్షత వహించారు

కమ్యూనిస్టుపై హత్యాప్రయత్నం

పెద్దపల్లి, డిసెంబరు 6

మహబూబ్‌నగర్ జిల్లా నాగరకర్నూలు తాలూకా పెద్దపల్లి గ్రామ కమ్యూనిస్టు శాఖ కార్యదర్శిని చంపాలని ఈ నెల 3 వ తేదీ రాత్రి కొందరు గూండాలు ప్రయత్నించి విఫలులైనారు

ఆ రాత్రి గ్రామ కమ్యూనిస్టుశాఖా సమావేశం జరిగింది ఇరవైమంది హాజరైనారు నాగరకర్నూలులో జరిగే సభకు వెళ్ళాలని కార్యక్రమం నిర్ణయించుకొన్నారు తర్వాత ఎవరి ఇళ్ళకు వారు బయలుదేరారు ఆఖరున అయిదుగురు మిగిలిపోయారు. సమీపంలో పొంచివున్న పదముగ్గురు గూండాలు కర్రలతో వీరిపైకి వచ్చారు కమ్యూనిస్టుశాఖ కార్యదర్శి శ్రీ క నాగయ్యగారిని పట్టుకొని లాగారు ఈగలభా విని ప్రజలు అక్కడ చేరేసరికి గూండాలు పారిపోయారు

రష్యా - చైనాల ఏకీభావం

మాస్కో, డిసెంబరు 7

సోవియట్ అనుసరిస్తున్న శాంతియుత సహజీవనవిధానాన్ని చైనా ప్రజలు అచంచలంగా బలపరుస్తున్నారనీ, చైనా ప్రజారిపబ్లిక్ అధ్యక్షుడు లీ షావ్ చీ, నేడు మాస్కో క్రీడామందిరంలో జరిగిన సభలో ప్రసంగిస్తూ అన్నారు. సోవియట్ - చైనా మైత్రీ సమితి ఈ సభను ఏర్పాటు చేసింది

మరో యుద్ధ ప్రమాదం అంతరించిపోలేదనీ, అప్రమత్తత అవసరమనీ ఆయన అన్నారు.

"ఈ రోజుల్లో యుద్ధాన్ని నివారించగల అవకాశాలున్నాయి అయితే, దానిని నివారించేందుకు ప్రజల ఐక్యసంఘటనను నిర్మించుకోవాలి" అని లీ షావ్ చీ ఉద్ఘాటించారు

ఆయన తన ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు .

సోషలిస్టు శిబిరంలోని సంఘీభావం ప్రపంచశాంతికి అన్నిటికన్నా ముఖ్యమయినహామీ అందులోనూ సోవియట్, చైనాదేశాల మైత్రి మరింత ప్రధానమయినది.

మహత్తరమయినమనపార్టీల మధ్య, మన మహాదేశాలమధ్య, మహాప్రజల మధ్య అనైక్యత మన ఉమ్మడిశత్రువుకు, ముఖ్యంగా అమెరికాసామ్రాజ్యవాదులకు వారుకావాలని కోరుకొన్నా కనబడదని లీ షావ్‌చీ అన్నారు

సోవియట్ అధ్యక్షుడు లియోనిడ్ బ్రెజ్నెవ్ ఈ సభలో ప్రసంగిస్తూ, ఉభయదేశాలనూ నిజమయిన స్నేహబంధాలు బంధిస్తున్నవన్నారు

కృశ్చేవ్ అస్వస్థత: మికోయాన్ ప్రకటన

మాస్కో, డిసెంబరు 7

ప్రధాని కృశ్చేవ్‌కి ఇన్‌ఫ్లుయంజా జ్వరం వచ్చిందని ఉపప్రధాని అనస్తాస్ మికోయాన్ నేడు అధికారరీత్యా ప్రకటించారు.

చైనా అధ్యక్షుడు లీషావ్‌చీ గౌరవార్థం సోవియట్ ప్రభుత్వం నేడు క్రెమ్లిన్ భవనంలో ఇచ్చిన విందుకు కృశ్చేవ్ హాజరుకావడానికి వైద్యులు అనుమతించలేదని కూడా మికోయాన్ ఈ ప్రకటనలో తెలిపారు

కసవూబూ భవనంపై మొబుటూ మూకల దాడి: బెల్జియం అధికారులతో మొబుటూ మంతనాలు

లియోపోల్డ్‌విల్లీ, డిసెంబరు 7

కాంగోనాయకులలో ఒక్కొక్కరికి కాపలాదార్లను పంపే బాధ్యతను విరమించుకోవాలనిఐరాస నిర్ణయించుకొన్న ఫలితంగా కాంగో అధ్యక్షుడు కసవూబూ భవనానికి కాపలా కాస్తున్న ఐరాస సైనికులను ఉపసంహరించారు అది జరిగిన కొద్ది నిముషాలలోనే కర్నల్ మొబుటూ సైనికులు కసవూబూ భవనంపై దాడిచేసి, నానా హంగామా చేశారు

కసవూబూ భవనంలో వున్న గుప్తాయుధాలకోసం వీరు యీ దాడి చేశారనీ, కొన్ని ఆయుధాలు దొరికాయనీ తెలుస్తున్నది

ప్రస్తుతంకసవూబూ తన స్వగ్రామంలో వున్నారు ఇక్కడ రాజధానిలో కసవూబూ, మొబుటూల మధ్య బహిరంగ ఘర్షణలు ఇక చెలరేగగలవనే వదంతులు వ్యాపించాయి.

నేడు మొబుటూ మాజీ ఫ్రెంచి కాంగో రాజధానియైన బ్రజవిల్లీకి వెళ్ళి అక్కడ బెల్జియం అధికారులతో మంతనా లాడారు.

అంతకు పూర్వమే ప్రధాని లుముంబాను అంతర్జాతీయ రెడ్‌క్రాస్ బృందమైనా సరే వచ్చి చూడడానికి అనుమతించేది లేదని ఐరాసకు గట్టిగా చెప్పాడు.

అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన కెన్నెడీ సోదరుడు ఎడ్వర్డు కెన్నెడీ ఆధ్వర్యాన ముగ్గురు అమెరికన్లు నేడు శ్రీ రాజేశ్వరదయాళ్‌తో లుముంబా పరిస్థితిపై మాట్లాడారు

లుముంబాను బలపరచే సైనికులు ఓరియంటెల్ రాష్ట్ర సరిహద్దులను దాటి ఈక్వేటార్ రాష్ట్రంలో ప్రవేశించి మొబుటూ అనుయాయులతో తలపడ్డారని వార్తలు అందడంతోనే మొబుటూ కొత్తగా సైనికులను చేర్చుకునే కార్యక్రమాన్ని ప్రకటించారు.

తన తెగకుచెందిన బలగాల నే చేర్చుకుంటానని మొబుటూ ప్రకటించాడు.

'రివిజనిజం'

"పీపుల్స్ డెయిలీ" సంపాదకీయం

హాంకాంగ్, డిసెంబరు 6

అన్ని దేశాల కమ్యూనిస్టులు రివిజనిజాన్ని (మార్క్సిజాన్ని తిరగతోడే విధానం) దృఢ సంకల్పంతో వ్యతిరేకించాలనీ, అందులోను యుగోస్లావియా అనుసరించే రివిజనిజాన్ని మరీ గట్టిగా ఎదుర్కొనాలనీ పెకింగ్ దినపత్రిక "పీపుల్స్ డెయిలీ" సంపాదకీయం వ్రాసిందని నవచైనా వార్తాసంస్థ ప్రకటించింది

ఇటీవల మాస్కోలో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టుపార్టీల నాయకుల సమావేశానంతరం వెలువడిన ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిజమే ప్రధానమై ప్రమాదకర ధోరణిగా ఇంకా నిలచివున్నదని "పీపుల్స్ డెయిలీ" వ్రాసింది "ప్రపంచశాంతిని పరిరక్షించి, సామ్రాజ్యవాద కూటములు దుర్మార్గంగా పన్నాగాలు పన్ని రెచ్చగొట్టజూచే కొత్త ప్రపంచ యుద్ధాన్ని నివారించడానికి" పూనుకొనడమే ప్రపంచ ప్రజలందరి ముందున్న ప్రధాన కర్తవ్యమని యీ పత్రిక సంపాదకీయం తెలిపింది

"సోషలిజం విజయం పొందడానికి వివిధ రాజ్యాలమధ్య యుద్ధం కావాలని ఏ సోషలిస్టు దేశమూ, ఏ కమ్యూనిస్టు పార్టీ ఎన్నడూ చెప్పలేదు

"అందుచేతనే సోషలిస్టు దేశాలు పెట్టుబడి దారీ దేశాలతో శాంతియుత సహజీవనాన్నీ, శాంతియుతమైన పోటీనీ నిరంతరంగా సాగించ పూనుకున్నాయి మరొక కొత్త యుద్ధపునే ఘోర ప్రమాదాన్ని నివారించడానికి ప్రపంచంలో శాంతిని కాంక్షించే ప్రజలూ, సోషలిస్టుదేశాలూ నిరంతరం కృషి సాగిస్తారు. అయితే ఫలితాలు ఎలాంటివైనప్పటికీ లెక్కచేయకుండా సామ్రాజ్యవాద యుద్ధోన్మాదులు ప్రపంచ ప్రజలమీద మరొక యుద్ధాన్నేగనుక తేవాలని పట్టుపట్టినట్లయితే, మాస్కో ప్రకటనలో తెలిపినట్లు 'ప్రజలు పెట్టుబడిదారీ విధానాన్ని తుడిచిపెట్టి పాతిపెడతారు.'

"మార్క్సిజం - లెనినిజంయొక్క సైద్ధాంతిక పునాదిపై నిర్మితమైన ఐక్యతను, 'అంతర్జాతీయ ఐక్యతను పరిరక్షించుకొనడానికి అన్ని దేశాల కమ్యూనిస్టులు మార్క్సిజం - లెనినిజం నుండి దూరమయ్యే రివిజనిజాన్ని, అందులోనూ యుగోస్లావియా రివిజనిజాన్ని గట్టిగా ప్రతిఘటించాలి.

"అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోరివిజనిజమే ఇంకా ఒక ప్రధానమైన ప్రమాదంగా వుంది.

"అదే సమయంలో వాస్తవానికి విరుద్ధంగావుండే పిడివాదం, ఒంటెత్తుతనం వ్యక్తమయ్యే ధోరణులకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడాలి, ఈ ధోరణి ఆయా పార్టీల అభివృద్ధి క్రమంలో ఏదో ఒక దశలో ప్రధానమైన ప్రమాదకర ధోరణిగా తయారు కావచ్చు"అనిఆసంపాదకీయంతెలిపింది.

వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలు

నందిగామ, డిసెంబరు 5

ఆంధ్రరాష్ట్ర వాలీబాల్ ఛాంపియన్‌షిప్ ఎన్నికకోసం కృష్ణాజిల్లా, నందిగామ బ్లాక్ యువకమండలి ఆధ్వర్యాన నందిగామలో ఇటీవల పోటీలు జరిగాయి

సీనియర్స్ ఎథలెట్స్ అసోసియేషన్ గుంటూరు టీము విన్నర్సుగాను, జూనియర్స్ గుంటూరు విన్నర్సుగాను గెలుపొందారు.

ఎన్నిక కమిటీ శ్రీ యస్. దుర్గాప్రసాద్ (ఛైర్మన్), శ్రీ టి. వెంకటేశ్వర్లు, శ్రీ యమ్ వెంకటేశ్వర్లు.

ఈక్రిందివారు ఎన్నికైనారు

సీనియర్సు శ్రీయుతులు సి.హెచ్. బుచ్చిరామయ్య, పి. వి రమణరావు, సి.హెచ్ కృష్ణమూర్తి, ఎస్ కోదండరామయ్య, కె నూరారెడ్డి, బి. శ్రీనివాసులు, వి సీతారామయ్య, శౌరయ్య, కె. వి. సుబ్బారావు, సి. హెచ్. బలరామదాస్, మల్లికార్జునరావు, గైక్‌వాల్, స్టాండ్‌బైస్, డాక్టర్ శ్రీహరి, రసూల్

జూనియర్స్. శ్రీయుతులు జి. పీగోచంద్, ఆశీర్వాదం, శ్యామసుందరరావు, మహానందరెడ్డి, హనుమంతరావు, విజయరావు, సత్యబాబు, షరీఫ్, శ్రీనివాసాచార్యులు, సూర్యనారాయణ, కాంతారావు, వి. హనుమంతరావు, స్టాండ్‌బైస్, నాగేశ్వరావు, రామయ్య.

27 వ తేదీ రాత్రి శ్రీ కాకాని వెంకటరత్నం అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది ఆటలలో గెలుపొందిన వారికి శ్రీ యార్లగడ్డ శివరామప్రసాద్ బహుమతులు పంచిపెట్టారు యువక మండలి అధ్యక్షులు శ్రీ దుగ్గి హనుమంతరావు వందన సమర్పణ చేశారు.

ప్రాదేశిక సమైక్యతను ప్రశ్నిస్తే మూడేళ్ళ శిక్ష

కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 7

భారత ప్రాదేశిక సమైక్యతను కాదనడం ద్వారా దేశభద్రతకు ముప్పుతెచ్చే వారికి మూడేళ్ళవరకు జైలు శిక్ష విధించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత పార్లమెంటు సమావేశంలో ఒక బిల్లును ప్రవేశపెట్టనున్నదని రూఢిగా తెలుస్తున్నది.

భారత ప్రభుత్వం బిల్లులోని అంశాలన్నీ ఆమోదించిందనీ, ఈ బిల్లుకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులుకూడ అంగీకరించారనీ అభిజ్ఞు లంటున్నారు

దేశభౌగోళిక సమైక్యతను ప్రశ్నించే పత్రాలను జప్తుచేయడానికి ప్రభుత్వానికి అధికార ముంటుంది

"నోటి మాటలతోగాని, రచనలతోగాని, చిత్రాలద్వారాగాని, దేశ భౌగోళిక సమైక్యతను కాదని దేశ భద్రతకు ప్రమాదం కలిగించేవారికి మూడేళ్లు శిక్ష లేక జరిమానా లేక రెండూ విధించ వచ్చు"నని బిల్లులో వుందిట.

బారాహోతి ప్రాంతంపై శ్రీ నెహ్రూ వివరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 8

భారత-చైనా సరిహద్దు వివాదంపై ఇటీవల జరిగిన ఉభయ దేశాల అధికారుల చర్చల్లో బారాహోతి ప్రాంతంపై ప్రత్యేకంగా చర్చజరగలేదని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో వెల్లడించారు అయితే ప్రధాన సమస్యపై చర్చ జరిపేటప్పుడు ఒక భాగంగా ఈ ప్రాంతంపై కూడా చర్చ జరిగిందని కూడ శ్రీ నెహ్రూ అన్నారు

ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ శ్రీ నెహ్రూ ఇలా అన్నారు

"చైనాతో సరిహద్దు తగాదా రాకముందునుండికూడాబారాహోతి ప్రాంతం వివాదగ్రస్తంగానేవుంది ఈవివాదం దశాబ్దకాలంనుండీ వున్నది.

ఈ విషయంపై ఉభయ దేశాల మధ్య సంప్రతింపులు జరిగాయి తత్ఫలితంగా ఏ దేశ సైన్యంకూడ ఈప్రాంతాన్ని ఆక్రమించుకొనకూడదని ఒప్పందానికి వచ్చాము నిరాయుధులయిన వ్యక్తులు అక్కడికి వెళ్ళవచ్చును అదే ప్రకారంవేసవికాలంలో మన రెవిన్యూ అధికారులనుకూడ అక్కడికి పంపిస్తున్నాము."

గత వేసవికాలంలో పశువులకాపర్లు అక్కడికి వెళ్లారా అని శ్రీ రామసుభాగ్‌సింగ్ ప్రశ్నించారు

ప్రధాని నెహ్రూ ఇలా జవాబు చెప్పారు.

"అక్కడికి ఎన్ని పశువులు వెళ్లాయో నాకు తెలియదుకాని కొందరు మనుష్యులు మాత్రం వెళ్లారు. మన రెవిన్యూ అధికారులు వెళ్లి ఏడెనిమిది నెలలపాటు అక్కడే వున్నారు."

శ్రీ ఎ. సి. శుక్లా శీతాకాలంలో చైనా సైనికులు అక్కడ వుంటున్నారా?

శ్రీ నెహ్రూ లేదు. నాకు తెలిసినంతవరకూ ఇది వాస్తవంకాదు

శ్రీ భక్తదర్శన్ నాకు తెలిసినంతవరకూ అక్కడ వుండడం అక్కడకు వెళ్ళ అంతకష్టమైన పనికాదు. సంవత్సరంపొడుగునా పోవడానికి వీలుండేట్లు బారాహోతికి రోడ్డు నిర్మించే ప్రతిపాదన ప్రభుత్వం చేస్తుందా?

శ్రీ నెహ్రూ రోడ్డునుగురించి నేనేమీ చెప్పలేను కొండల్లోకి పలు రోడ్డు వేస్తున్నాము ఆ రోడ్డు వేస్తున్నామోలేదో నాకుగుర్తులేదు. అక్కడికి రోడ్డు వేయడం అవసరమా అనేది నాకు సందేహాంగావుంది దానిపై పెట్టే ఖర్చు సమర్థనీయమేనా అని నా అనుమానం."

ఐరాస పై కసవూబూ విమర్శ

ఐరాస, డిసెంబరు 8

లుముంబా అరెస్టునుగురించి ఐరాస అవలంబించినవైఖరి, కాంగో దేశమంతటా ఐరాస నాయకులపట్ల తీవ్రమైన వ్యతిరేకతను కలిగించిందని కాంగో అధ్యక్షుడు కసవూబూ హామర్‌షెల్డ్‌కి నేడొక తంతి పంపాడు.

న్యూఢిల్లీ, డిసెంబరు 7

తృతీయ ప్రణాళికా కాలంలో రూర్కెలాలో ప్రాంతీయ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం నిశ్చయించింది ఇంజనీరింగ్‌లో అక్కడ డిగ్రీకోర్సులు వుంటాయి ఏటా 250 మంది విద్యార్థులను చేర్చుకొంటారు.

రేడియో

శనివారం, డిసెంబరు 10

శక 1882 మార్గశిర 19

విజయవాడ

357.1 మీ [840 కిలోసై]

ఉదయం 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు, చిత్తమెచట [టాగూర్ రచనకు తెలుగు అనువాదం], 6-40 భక్తిరంజని. [సంప్రదాయ కీర్తనలు] బి. శ్రీనివాసన్, బృందం, 7-0 తె. వా; 7-15 అల్లు సత్యవతి వయొలిన్, 7-45 సంగీత శిక్షణ, 8-0 ఆం వా, 8-15 హిం. వా, మధ్యాహ్నం 12-30 కార్మికులకు (హై. రి), 1-0 'వనితావాణి', 1-30లలిత సంగీతం, 1-50 తె. వా, 2-0 సంగీతశిక్షణ, 2-20 బొమ్మరిల్లు, సాయంత్రం 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాం వా, 6-15 గ్రామస్థులకు, 7-0 తె. వా, 7-15 గ్రామస్థులకు, 7-30 మానవస్వత్వాలు డాక్టర్ టి. యస్ పౌలస్ ప్రసంగం, 7-40 ఫిల్మ్‌సంగీతం, 8-0 అల్లు సత్యవతి. వయొలిన్, 8-30 రేడియో న్యూస్ రీల్ [ఆంగ్లం] (ఢి రి), 8-40 లలిత సంగీతం, 9-0 ఆం వా, 9-15 విన్నానులెండి [నాటిక] (హై. బి రి), 9-30 పన్నాలాల్ ఘోష్ వేణువు (ఢి రి), 11-0 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్ (ఎ)

405 4 మీ [740 కిలోసై]

ఉదయం 6-30 సుప్రభాత్, కార్యక్రమవివరణ, 6-40 భక్తిరంజని, 7-0 తె వా, 7-15 వయొలిన్(వి రి), 7-45 సంగీత శిక్షణ, 8-0 ఆం. వా, 8-15 హిం వా, 8-30 బాలానందం, మధ్యాహ్నము 12-30 కార్మికులకు, 1-0 మహిళలకు (వి. రి), 1-30 లలిత్ సంగీత్ వి సరళ, 1-50 తె వా, 2-0 అబ్దుల్ కరీమ్ ఖాం, 2-10 ఉ వా, 2-20 పిల్లలకు (వి. రి), సాయంత్రం 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాం. వా, 6-15 'నగరవాణి' - మేలుకొన్న మనిషి [మానవ హక్కులదినం సందర్భమున ప్రత్యేక రూపకము]; 7-0 తె వా; 7-15 ఉర్దూప్రసంగం, ఘజల్, 7-30 మానవస్వత్వాలు [ప్రసంగం] (వి రి), 7-40 విజ్ఞానకే ప్రగతీ ఎమ్ డి చతుర్వేది హిందీప్రసంగం, 7-50 శ్రోతల ఉత్తరాలకు జవాబులు, 8-0 కె. భీమశంకరం ఆంగ్లప్రసంగం, 8-10 విరామ సంగీతం, 8-15 రాగ్ భూపాలి - శంకరరావు, ఎల్ రాయన్న వేణువు, క్లారినెట్, 8-30 విజయవాడవలె, 8-40 విరామ సంగీతం, 8-45 నేటి ప్రసంగం, 8-55 విరామ సంగీతం, 9-0 ఆం వా; 9-15 ఉ. వా, 9-30 అఖిలభారత సంగీత కార్యక్రమం (ఢి. రి), 11-0 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్ (బి)

49 02 మీ [6120 కిలోసై]

ఉదయం 6-30 సుప్రభాత్ కార్యక్రమ వివరణ

30 86 మీ [9720 కిలోసై]

మధ్యాహ్నం 12-30 హై ఎ వలె; 2-10 వయొలిన్ నిలయ విద్వాంసుడు, 2-20 హై ఎ వలె

60.12 మీ [4990 కిలోసై]

సాయంత్రం 6-0 స్థానిక ప్రకటనలు, 6-15 గ్రామస్థులకు, 7-0 తె వా, 7-15 గ్రామస్థులకు, 7-30 హై ఎ వలె, 7-40 ప్రాదేశిక్ సుగమ్ సంగీత్, 7-50 హై ఎ వలె, 9-15 విన్నానులెండి [నాటిక], 9-30 హై. ఎ వలె, 11-0 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

మద్రాస్ (బి)

211.3 మీ [1420 కిలోసై]

ఉదయం. 6-55 మంగళగానం, 7-0 తె వా, 7-15 'సుప్రభాతమ్'- పి వి. శివరామన్ సంస్కృతప్రసంగం, 7-30 మ ఎ వలె, 8-0 ఆం వా

211.3 మీ [1420 కిలోసై]

మధ్యాహ్నం 1-0 కదంబం, 1-30 ఆం వా; 1-40 గీతమంజరి, 1-50 తె. వా, 2-0 లలితసంగీతం, 2-10 'ముత్తుక్కువియల్' [పిల్లలకు - తమిళం]

211 3 మీ [1420 కిలోసై]

సాయంత్రం 5-30 పాశ్చాత్య సంగీతం, 5-55 స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు (ఆంగ్లం), 6-0 ఆం వా, 6-5 ప్రాంతీయ శెయిదిగళ్, 6-15 కార్యక్రమ వివరణ [తమిళం], 6-20 పిఠాపురం సత్యనారాయణ క్లారినెట్, 7-0 తె వా, 7-15 సంగీతమాల, 7-30 ఒరు అధ్యాయం నాటిక (తిరుచ్చివలె), 8-30 కున్నక్కుడి వెంకటరామ అయ్యర్, 9-0 ఆం వా 9-15 ఆంగ్లమున, 9-25 వాద్యసంగీతం, 9-30 పాశ్చాత్య సంగీతం, 11-0 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి

మహబూబ్‌నగర్ జిల్లాలో శ్రీరాజేశ్వరరావు గారి పర్యటన

అచ్చంపేట, డిసెంబరు 5

మహబూబ్‌నగర్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ మహాసభ తీసుకొన్న నిర్ణయాల ప్రకారం నాగరుకర్నూలు తాలూకా -క్కులపల్లి కుట్రకేసునుగూర్చి ప్రజలకు వివరించడానికి మొత్తం ఏడుచోట్ల బహిరంగసభలు ఏర్పాటు చేయబడ్డాయి.

పెన్నచర్లగ్రామములో ఈనెల 1 వ తేదీ సాయంత్రం రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు, జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీ లక్ష్మణాచారిగార్లను వైభవంగా ఊరేగించారు కమ్యూనిస్టు కార్యకర్తలు, ప్రజలు దాదాపు వేయిమంది ఈ ఊరేగింపులో పాల్గొన్నారు

మధ్యాహ్నం నాగరు కర్నూలు తాలూకా కమ్యూనిస్టు పార్టీ మహాసభ జరిగింది ఈదిగువవారితో కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకొన్నారు

శ్రీయుతులుఎం లింగారెడ్డి,లింగోజీ, శింగోటం నాగయ్య, నారాయణ, బాలలింగం, లింగాశెట్టి (కార్యదర్శి) ఆరాత్రి పెద్ద బహిరంగ సభ జరిగింది శ్రీ లక్ష్మణాచారి, శ్రీరాజేశ్వరరావు, శ్రీ కె గోపాలరావుగార్లుమాట్లాడారు

అచ్చంపేటలో ఈనెల 2 వ తేదీన సాయంత్రం శ్రీ చండ్ర రాజేశ్వరరావుగారిని 500 మంది ప్రజలు ఊరేగించారు రాత్రి శ్రీ లక్ష్మణాచారి అధ్యక్షతను పెద్దబహిరంగసభ జరిగింది

జాగీరి భూస్వాములు, దొరలు సమితి, పరిషత్తులను ఆక్రమించుకొని వారి స్వార్థానికై ఎలా దుర్వినియోగం చేస్తున్నదీ సభాధ్యక్షులు వివరించారు

శ్రీ కె. గోపాలరావుగారు రైతు సంఘాన్ని సంఘటితపరచుకోవలసిన ఆవశ్యకతనగూర్చి మాట్లాడారు.

శ్రీ చండ్ర రాజేశ్వరరావు గారు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలలో గల లోపాలను విమర్శిస్తూ ప్రసంగించారు

తర్వాత శ్రీ కుమారస్వామి గారు తాలూకాలోని దొరల దౌర్జన్యాలను వివరించారు

వనపర్తి దళంవారిచే వైజ్ఞానిక ప్రదర్శనల అనంతరం సభముగిసింది.

రైతుసంఘ కమిటీ

ఖమ్మం, డిసెంబరు 3

ఖమ్మంజిల్లా కొత్తగూడెంలో ఇటీవల జరిగిన బ్లాక్ వ్యవసాయకార్మిక, రైతు సంఘాల సదస్సులో ఈ క్రిందివారితో రైతుసంఘ కమిటీని ఎన్నుకొన్నారు

అధ్యక్షులు శ్రీ దండమూడి కేశవనారాయణ, ఉపాధ్యక్షులు శ్రీ సూర అప్పయ్య, కోశాధ్యక్షులు శ్రీ సుంకర పూర్ణచంద్రరావు, కార్యదర్శి శ్రీ కంగల బుచ్చయ్య, సహాయ కార్యదర్శి శ్రీ డి వీరనారాయణ, మరో 14 మంది సభ్యులు.

రెండువేలమందిని సంఘంలో చేర్పించాలని నిర్ణయించారు

బజారు ధరలు

విజయవాడ, డిసెంబరు 8

(మధ్యాహ్నం గం 1 వరకు)

		రు.	అ	పై
బంగారం				
మేలిమి పాట్లా		135	8	0
మూస		134	8	0
నవరసం		91	8	0
వెండి · 100 తులములు		224	0	0
1 తులము		2	4	0
ధాన్యం				
24 నెంబరు		రు 81	0	0
వంకసన్నాలు		28	8	0
అక్కుళ్లు		23	0	0
కుసుమ (కొత్త)		23	0	0
బియ్యం				
24 నెంబరు		71	0	0
వంకసన్నాలు		68	0	0
12 నెంబరు		66	0	0
అక్కుళ్ళు (కొత్తవి)		54	0	0
కుసుమ		65	0	0
అపరాలు				
మినుములు 240 శే		49	0	0
కందులు	35-/	42	0	0
నల్లపెసలు[మాగాణి]		46	0	0
పచ్చపెసలు 230		46	0	0
పచ్చపెసలు (మెట్టవి)	43/-	46	0	0
సెనగలు (దేశవాళీ)		52	0	0
,, (పంజాబు)		47	0	0
ధనియాలు 26 కుంచాలు		49	0	0
ఉలవలు	39/-	45	0	0
ఆముదాలు		54	8	0
పంచదార(ఉయ్యూరు)		118	2	6
కొబ్బరినూనె డబ్బా		47	12	0
వెల్లుల్లి మణుగు	4 8 0	5	4	0
బెల్లం ,,	4 10 0	5	10	0
మిర్చి ,,	18/-	24	0	0
నీరుల్లి ,,	2 4 0	3	8	0
చింతపండు ,,	8 0 0	11	0	0
నువ్వులనూనె ,,		26	0	0
వేరుశెనగపప్పు 177 శే.				
జగ్గయ్యపేట		73	8	0
వేరుశెనగ నూనె మణుగు		21	11	0
కేక్ 160 కౌనులు		24	8	0
కొబ్బరికాయలు 1000		182	0	0
సంచులు 100		156	0	0
డిటో ఫార్వర్డు		149	8	0
తవుడు 2 వ పట్టు		12	0	0
,, 3 వ పట్టు		14	0	0

తిండిగింజలకు కటకట

పల్నాడు తాలూకా పరిస్థితి

దాచేపల్లి, డిసెంబరు 6

కళ్లాలు చేసే యీ తరుణంలో పల్నాడు తాలూకాలో ప్రజలు తిండి గింజలకు పశువులమేతకు కటకటలాడిపోతున్నారు

తాలూకాలో జొన్న పూర్తిగా పోయింది సజ్జపైరు మాత్రం అక్కడక్కడా కొద్దిగా పండింది వేరుశనగ రెండణాలవంతు మాత్రం పండింది వరిగచేలు చాలవరకు విత్తనమే పడలేదు వేసినవి ఎండిపోయినవి అణావంతు వరిగపంటకూడా పండేట్లు లేదు. మిర్చికి కూడా ముడత తెగులు బోడ తెగులు పడి చాలా తోటలు దెబ్బతిన్నవి.

పశువులకు తగినంత మేత లేదు. వాటిని అమ్ముదామన్నా కొనేనాథుడు లేడు వేరుశనగ కట్టె బండి 1 కి రు 15 చొప్పున కొంటున్నారు ఇది వరకు రు 6 లేక రు. 8 లకు దొరికే చొప్ప ఇప్పుడు రు. 25 లేక రు 30 వరకు ధర పెరిగింది. కాని అదికూడా దొరకడంలేదు గత సంవత్సరం ఈ పంట తరుణంలో రూపాయకు 8 శేర్లు వచ్చేవి ఇప్పుడు 2½ శేర్లు సజ్జలు కూడ దొరకడంలేదు

వ్యవసాయ కూలీలు వలస వెళ్ళే ప్రయత్నంలో వున్నారు.

గూడ్సుఇంజన్‌ప్రమాదంలో రైల్వేకార్మికుని మృతి

చిన్నగంజాం, డిసెంబరు 6

గాలింకి బసవయ్య అను ఒకటవ నెంబరు ఖాయపు గ్యాంగి మన్ నవంబరు 27 వ తేదీన చిన్నగంజాము వాటరుకాల్వ దగ్గర పని చేస్తూవుండగా మద్రాసు వైపునుండి 77 పార్శిలుబండి వచ్చింది అతడు లైనునుండి తప్పుకోబోగా అదేసమయంలో విజయవాడ వైపునుండి స్లో 'లైనులో' గూడ్సు రైలుబండి ఇంజను కొట్టివేసింది. బసవయ్య వెంటనే చనిపోయాడు.

మున్సిపల్ పనివారికి పి. ఎఫ్. అప్పులు

తాడేపల్లిగూడెం, డిసెంబరు 6

"ప్రావిడెంటు ఫండ్‌నుండి అప్పులు యివ్వాలని 'జి. ఓ' వుంది కానీ ఎన్నిదఫాలు పిటీషన్లు పెట్టుకున్నా వాటిని బుట్టదాఖలుచేస్తూ ఆరుమాసాల నుండి ఐదు, ఆరు దఫాలు పిటీషన్లు పెట్టుకున్నా కాలయాపనచేస్తున్నారు దీపావళి అడ్వాన్సులు యిస్తామని చెప్పి ఆఫీసు స్టాఫుకే యిచ్చారు కాని వర్కర్సుకి యివ్వలేదు బట్టలువగైరా సకాలంలో ఇవ్వటంలేదు కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన జి. ఓల ప్రకారమైనా చేయవలసిన సౌకర్యాలను సహితం చేయకుండా చాలా నిరంకుశత్వంగా ప్రవర్తించుచున్నారు ఇంతటినుండైనాపైకోర్కెలను వెంటనే అమలుపర్చాలి యూనియన్ ప్రతినిధులయెడల సౌహార్దతతో ప్రవర్తించాల"ని కమీషనర్‌ను కోరుతూ తాడేపల్లిగూడెం మున్సిపల్ వర్కర్సు యూనియన్ సమావేశంలో తీర్మానించారు

ఈ సమావేశం ఆంధ్ర మున్సిపల్ అండ్ లోకల్‌బోర్డు ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి శ్రీ బూరాడ సీతారామయ్య అధ్యక్షతను జరిగింది

శానిటరీ ఇనస్పెక్టరు పశుగ్రాసాన్ని స్వంతానికి ఉపయోగించుకొనుచున్నందున పశువులకు మేత సరిపోవక పాడైపోయినవని ఒక కౌన్సిలర్ అడిగిన దానికి ఉన్న వాస్తవాన్ని చెప్పినందున శానిటరీ ఇన్‌స్పెక్టరు ఆ పశువుల కాపరిపై పగసాధించి పనినుండి తొలగించారు ఈవిషయాన్ని యూనియన్ ప్రతినిధులు కమీషనర్ దృష్టికి తేగా విచారణచేసి న్యాయం చేస్తానని చెప్పియున్నారు ఏంచేసిందీ ఇంతవరకుయూనియన్‌కు తెలియపరచలేదు. పశుగ్రాసాన్ని తన స్వార్థంకోసం ఉపయోగించుకొనుచున్న శానిటరీ ఇన్‌స్పెక్టరుపై చర్యతీసుకోవలసింది పోయి వాస్తవాన్ని తెలియజేసిన వర్కరు ఉద్యోగం తీసివేయుట న్యాయంకాదని, బహిరంగ విచారణ జరిపి తగిన చర్య తీసుకోవాలని అధికారులను కోరుతూ తీర్మానించారు,

మున్సిపల్ చెత్తబండ్లు, మలంబండ్లు రిపేరు చేయించాలనీ, కష్టసుఖాలను చెప్పుకొనుటకు వెళ్ళే యూనియన్ ప్రతినిధులను లెక్కించని శానిటరీ ఇనస్పెక్టర్ల చర్యలను నిరసిస్తూ మరో రెండు తీర్మానాలను చేశారు (వి వి)

భద్రాచలం పట్టణ కమ్యూనిస్టు సమావేశం

భద్రాచలం, డిసెంబరు 5

భద్రాచలం పట్టణ కమ్యూనిస్టుపార్టీ సర్వసభ్య సమావేశం నిన్న శ్రీ అకుల సూర్యనారాయణగారి అధ్యక్షతన జరిగింది ఈ దిగువ వారితో పట్టణ కమిటీని ఎన్నుకున్నారు

శ్రీ బి చందర్రావు (కార్యదర్శి), శ్రీ అకుల సూర్యనారాయణ, శ్రీ పె వెంకటేశ్వర్లు, శ్రీ బి ఎ రెడ్డి, శ్రీ కె ఖదీరు, శ్రీ యస్ నారాయణ, శ్రీ పి హెచ్. తిరుపతి

'దేశభక్తి' గేయంలోని మానవతాప్రబోధం

చిరస్మరణీయమని ప్రముఖుల ప్రశంస : గురజాడ శతజయంతికి ఢిల్లీలో కమిటీ ఏర్పాటు

న్యూఢిల్లీ, డిసెంబరు 6

ఇక్కడ జరిగిన గురజాడ జయంతి సభలో పార్లమెంటు సభ్యులు శ్రీ ఉద్దరాజు రామం, శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగార్లు అప్పారాయ కవి కవిత - సాంఘిక సేవలను గురించి మాట్లాడారు ఆయన దేశభక్తిగీతంలో ప్రతిమానవుడు పాటించవలసిన సూత్రాలు ఇమిడి ఉన్నాయన్నారు

ఢిల్లీలో సార్తు ఎవెన్యూ పార్లమెంటు సభ్యుల క్లబ్ హాలులో మహాకవి గురజాడ అప్పారావుగారి 99 వ జన్మదినోత్సవం దక్షిణభారత నటీనట సమాఖ్య, తెలుగురచయితలసంఘ, రసన ల సంయుక్తియాజమాన్యాన జరిగింది ఈ సభకు శ్రీ బచ్చు జగన్నాథదాసుగా రధ్యక్షత వహించారు

పార్లమెంటు సభ్యురాలు కుమారి మోతే వేదకుమారి 'దేశమును ప్రేమించుమన్నా' అనే దేశభక్తి గేయాన్ని ఆలాపించడంతో సభ ప్రారంభమైంది

తరువాత ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారాయన కవితా రీతులను గురించి చర్చిస్తూ, అప్పారాయకవిని మహాకవియని ఎందుకంటున్నామో సోదాహరణంగా వివరించారు

అధ్యక్షులు శ్రీ జగన్నాథదాసుగారు మాట్లాడుతూ, 'కన్యాశుల్కం' నాటకంలో ఆ నాటి సమాజపు కుళ్లు బయటపడిందనీ, ఆ నాడొక పెద్ద విప్లవం తీసుకొని వచ్చిందనీ, అది ఇప్పటికీ ప్రతివారు మననం చేసికొనదగిన కావ్యమనీ, అట్టి నాటకాన్నీ, 'ముత్యాల సరాల'నూ మన కందించిన కవి శేఖరుని శత జయంత్యుత్సవం పెద్ద ఎత్తున జరపటానికి ఇప్పటినుంచే కృషి చేయాలని అన్నారు ఇందుకు రాష్ట్ర ప్రభుత్వమే కాకుండా, కేంద్ర ప్రభుత్వంకూడా పూనుకోవాలని నుడివారు తదుపరి శ్రీ రెంటాలరాఘవరావుగారు దేశభక్తి గేయాన్ని హిందీలోకి అనువదించి చదివారు

వచ్చే సంవత్సరం మహాకవి గురజాడ శతజయంత్యుత్సవాన్ని ఢిల్లీలో చక్కగా జరపడానికిగాను ఈ సభలో శ్రీ టి రామచంద్రరావుగారు కన్వీనరుగా ఒక అడ్‌హాక్ కమిటీ ఏర్పడింది

ఈ కమిటీలో పార్లమెంటు సభ్యులు శ్రీయుతులు యన్. జి. రంగా, దుగ్గిరాల బలరామ కృష్ణయ్య, ఉద్దరాజు రామం, ముసలికంటి తిరుమలరావు, కుమారి మోతే వేదకుమారి ప్రభృతులున్నూ, 'నేషనల్ హెరాల్డు' సంపాదకులు యమ్ చలపతిరావు, 'సప్తాహిక్ హిందూస్తాన్' సంపాదకులు బంకబీహారి భట్నగర్, ప్రఖ్యాత హిందీ రచయిత పార్లమెంటు సభ్యులు శ్రీ బనారస్ దాస్ చతుర్వేది, బచ్చు జగన్నాథదాసు, ఆకెళ్ల అచ్యుతరామం, సెట్టి ఈశ్వరరావు, అబ్బూరి వరదరాజేశ్వరరావు, క్రొవ్విడిలక్ష్మన్న, రెంటాల రాఘవరావు, పి. వి. రాఘవరావు, డాక్టరు అయ్యగారి వీరభద్రరావు, డా॥ కె. వీరభద్రరావు ప్రభృతులున్నారు

తదుపరి డాక్టరు అయ్యగారి వీరభద్రరావుగారి దర్శకత్వం క్రింద దభానన సమాఖ్య సభ్యులచే 'కన్యాశుల్కం' నాటకంలో 'వెంకటేశం చదువు' అనే భాగం ప్రదర్శింపబడింది

కలకత్తాలో

కలకత్తా, డిసెంబరు 6

కలకత్తా ఆంధ్రసాహిత్య పరిషత్తు ఆధ్వర్యాన మహాకవి గురజాడ తొంబైతొమ్మిదవ జయంతి 4వ తేది సాయంత్రం కిద్దరుపూర్ హేమచంద్ర లైబ్రరీ హాలులో వైభవంగా జరిగింది సభకు ఆంధ్రులు, ఆంధ్రేతరులు చాలామంది వచ్చారు పరిషత్తు అధ్యక్షులు శ్రీ ఎన్ ఏ యాజులుగారు అధ్యక్షతవహించారు ప్రముఖ తెలుగు యువరచయిత శ్రీ సూరిశెట్టి జీవరక్షణరావుగారు (జీవన్) ముఖ్య అతిదులుగా విచ్చేశారు

'దేశభక్తి' గీతంతో సభారంభమైంది కార్యదర్శి శ్రీ ముక్కామల వెంకటేశ్వరరావు సభికులకు స్వాగతం పలికారు

ఈ సందర్భంలో 'మహాకవి గురజాడ' పైగోష్ఠి జరిగింది "నవ్యాంధ్ర సాహిత్య, సమాజాల నిర్మాత - గురజాడ" అను విషయంపై శ్రీ కొల్లూరు వెంకటేశ్వర్లు, "సమకాలీన సాహిత్యం-గురజాడ" అను అంశంపై శ్రీవేదాంతం సుబ్రహ్మణ్యం, "వంగ సాహిత్యం, గురజాడల సంబంధం"పై శ్రీ బొమ్మన విశ్వనాథం, "కన్యాశుల్కం"పై శ్రీ పమిడిముక్కల లక్ష్మణరావుగార్లు వ్యాసాలను చదివారు

అనంతరం మహాకవి మహనీయ వ్యక్తిత్వాన్ని గురించి శ్రీ డి వి శర్మగారు మాట్లాడారు. యువరచయితలు శ్రీయుతులు కె సంగమేశ్వరరావు (పద్మావతి లలితశ్రీ), డి వి రమణమూర్తిగారలు గురజాడపై తాము వ్రాసిన గేయాలను చదివారు శ్రీమతి డి. మీనాక్షిగారు "పూర్ణమ్మ" గీతాన్ని గానం చేశారు.

సహాయ కార్యదర్శి శ్రీ ఆర్. సత్యనారాయణ వందన సమర్పణ, కుమారి ఏ. సీతాదేవి జాతీయగీతాగానంతో ఉత్సవం జయప్రదంగా ముగిసింది.

రాజమండ్రిలో

రాజమండ్రి, డిసెంబరు 5

రాజమండ్రి ఫ్రెండ్సు కల్చరల్ అసోసియేషన్‌వారి ఆధ్వర్యాన శ్రీశ్రీపాద సుబ్రహ్మణ్యంగారిఅధ్యక్షతన ఆంధ్ర మహిళా గానసభ ఆవరణలో మహాకవి గురజాడ జయంతి సభ జరిగింది.

అధ్యక్షులు శ్రీ సుబ్రహ్మణ్యం శాస్త్రిగారు ప్రసంగిస్తూ 'కన్యాశుల్కం'నాటకం వ్యావహారికభాషలో వ్రాయబడినందుకు విచారించిన నాగ్రాంధికవాదులు కూడా మెచ్చుకొనక తప్పింది కాదన్నారు.

శ్రీయుతులు కవికొండల వెంకట్రావు, భమిడిపాటి రాధాకృష్ణ, రా-నూ-వా గార్లు మాట్లాడారు. అనంతరం 'చదవురుగులు' అను నాటిక ప్రదర్శింపబడినది. (వి వి)

కొత్తగూడెంలో

కొత్తగూడెం, డిసెంబరు 5

కొత్తగూడెం జిల్లాపరిషత్తు సెకండరీస్కూలులో మహాకవి గురజాడ అప్పారావు జయంత్యుత్సవం జరిగింది. సింగరేణికాలరీస్ కంపెనీ లిమిటెడ్ పర్సనల్ మేనేజర్ శ్రీ ఎస్ భాస్కరాచారి అధ్యక్షతవహించారు

సెకండరీస్కూలు హెడ్మాస్టర్ శ్రీ కె. శ్రీహరిరావుగారు మాట్లాడుతూ, అప్పారాయకవి రచనలు తెలుగు సాహిత్యంలో పెద్ద మార్పు తెచ్చాయనిచెప్పారు ఆయన రచనలను విద్యార్థులందరూ చదవాలని ఉద్బోధించారు.

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ జూనియర్ పర్సనల్ మేనేజర్ (పబ్లిసిటీ) శ్రీ ఎస్. సోమరాజు, విద్యార్థి నాయకుడు శ్రీ నాగేశ్వరరావు, పంచాయతీ సాంఘిక విద్యాధికారి శ్రీ పి. హెచ్ కాశయ్య, డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంటు శ్రీ సి. వి ఎం కృష్ణారావు, పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ పానుగంటి పిచ్చయ్యగార్లుకూడా సభలో మాట్లాడారు శ్రీ బి. రంగాచారిగారు స్వీయ కవితాగానం చేశారు.

తర్వాత సభాధ్యక్షులు "సాహితీ, సంగీతి" అను సాహిత్య సంస్థకు ప్రారంభోత్సవం చేశారు

చెన్నూరు తాలూకా రైతు ప్రతినిధుల సభ

బెల్లంపల్లి, డిసెంబరు 6

ఆదిలాబాద్ జిల్లా చెన్నూరులో ఇటీవల తాలూకా రైతు ప్రతినిధుల సమావేశం డాక్టరు సీతాపతిరావుగారి అధ్యక్షతన జరిగింది వివిధ గ్రామాల నుండ 40 మంది ప్రతినిధులు వచ్చారు. ఈ సమావేశంలో శ్రీ బి గంగారాం (ఎం ఎల్ సి) గారుకూడా పాల్గొన్నారు.

సంవత్సరం నుండి ఈ తాలూకాలో జరిగిన రైతుసంఘ కార్యకలాపాల గురించి డాక్టరు సీతాపతిగారు నివేదిక సమర్పించారు తదుపరి డాక్టరు సీతాపతిరావుగారు అధ్యక్షులుగా, శ్రీ నాయిని రాజంగారు ఉపాధ్యక్షులుగా, శ్రీ శంకరయ్యా, శ్రీ ఖాజా ఫరీదుద్దీను గార్లు కార్యదర్శులుగా, శ్రీ డి. నారాయణరెడ్డిగారు కోశాధికారిగా, 19 మందితో తాలూకా రైతుసంఘ కమిటీని ఏర్పాటుచేశారు

తెనాలి కిల్లీషాపుసంఘం

తెనాలి, డిసెంబరు 6

తెనాలి కిల్లీషాపు యజమానులు నిన్న పాత శివాలయంలో శ్రీ జాస్తి ఉమామహేశ్వరరావుగారి అధ్యక్షతన సమావేశమై శ్రీ దాసరి కమలాదాసుగారిని అధ్యక్షులుగాను, శ్రీ జాస్తి ఉమామహేశ్వరరావుగారిని కార్యదర్శిగాను మరో 23 మందిని కార్యవర్గ సభ్యులుగాను ఎన్నుకొన్నారు

హోటల్ వ్యాపారుల సభ

అమ్మకపు పన్ను విధానానికి నిరసనగా తెనాలి హోటల్ వ్యాపారుల సంఘ యాజమాన్యాన రణరంగ చౌకులో బహిరంగసభ జరిగింది శ్రీ మాధవపెద్ది నాగభూషణంగారు అధ్యక్షత వహించారు హోటల్ వ్యాపారులపై అమ్మకపుపన్ను విధింపులోను, వసూలులోనుగల అవకతవకలను గూర్చి పలువురు మాట్లాడారు

ప్రదేశ్ కమ్యూనిస్టు ప్రతినిధులకు కొన్ని సూచనలు

అనంతపురం, డిసెంబరు 7

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు మహాసభ అనంతపురంలో డిసెంబరు 12 నుండి ప్రారంభ మవుతున్న సందర్భంలో ఆహ్వానసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఐ సదాశివన్, ఎం ఎల్ సి గారు ప్రతినిధులకు క్రింది సూచనలు చేస్తున్నారు

1 అనంతపురంలో యీ సారి చలి ఎక్కువైంది చలికి తట్టుకొనే విధంగా కప్పుకోడానికి, పరచుకోడానికి తెచ్చుకోవలెను.

2. మహాసభ ప్రదేశం అనంతపురం రైల్వేస్టేషనుకు అర ఫర్లాంగులోను, కొత్తివూరు బస్సుస్టాండుకు ఒక ఫర్లాంగు దూరములోను వుంది రైల్వే స్టేషను దగ్గర, బస్సుస్టాండు దగ్గర వాలంటీర్లు వుంటారు

3 రైళ్లు - విజయవాడనుండి, మధ్యాహ్నం 3-15 కు, రాత్రి 2-00 గంటలకు బయలుదేరుతాయి మచిలీపట్నంనుండి బెంగుళూరు పెట్టెలు యీ రెండు రైళ్లలోనూ వుంటాయి అందులో కూర్చుంటే నేరుగా అనంతపురంలోదిగవచ్చు లేకపోతే ద్రోణాచలంలో ఉదయం బండికి మారాలి. రాత్రిబండికి గుంతకల్లులో మారాలి.

హైద్రాబాదునుండి వచ్చే వారు రాత్రి 9-55 కు, ఉదయం 6-15 కు రైళ్ళు బయలుదేరుతాయి రాత్రి బయలుదేరేది నేరుగా అనంతపురం వస్తుంది. ఉదయంబండి, ద్రోణాచలంలోనూ, గుంతకల్లులోనూ మారవలెను. సికింద్రాబాదునుండి బెంగుళూరుపెట్టె లుంటాయి. అందులో కూర్చుంటే ఎక్కడా మారనక్కరలేదు

సోవియట్ యువజన ప్రతినిధి వర్గానికి స్వాగత సన్నాహాలు

విజయనగరం, డిసెంబరు 5

డిసెంబరు 12 న పలాసా, శ్రీకాకుళంరోడ్డు స్టేషన్లలో సోవియట్ యువజన ప్రతినిధి వర్గానికి ఘనంగా స్వాగత మివ్వాలని శ్రీ కాకుళం జిల్లా యువజనసంఘ కార్యవర్గం తీర్మానించింది.

అనకాపల్లి తాలూకా యువజన సదస్సు

మునగపాక, డిసెంబరు 5

అనకాపల్లి తాలూకా యువజన సదస్సు నవంబరు 27న మునగపాకలో జరిగింది. తాలూకా యువజనసంఘ అధ్యక్షులు శ్రీశరగడం వీరునాయుడుగారు సభకు అధ్యక్షత వహించారు వివిధ గ్రామాలనుండి 40 మంది ప్రతినిధులు హాజరయ్యారు. శ్రీ పెంటకోట వెంకటరమణ ఎం ఎల్ సి గారు ప్రారంభోపన్యాసం చేశారు. జిల్లా యువజన సంఘాధ్యక్షులు శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు యువజనుల కర్తవ్యాలపై ప్రసంగించారు యూనివర్సిటీ విద్యార్థి శ్రీ వాసిరెడ్డి వెంకటప్పయ్య, కార్మిక నాయకులు శ్రీ జె సాంబమూర్తిగార్లు కూడా మాట్లాడారు పదకొండు మందితో కార్యవర్గాన్నెన్నుకొన్నారు 1951 నదీ జలాల ఒడంబడికను మార్చరాదని ఒక తీర్మానం చేశారు

కొత్తగూడెం యువజన సదస్సు

కొత్తగూడెం, డిసెంబరు 5

కొత్తగూడెం పట్టణ ప్రథమ యువజన సదస్సు శ్రీరామచంద్ర హైస్కూలులో శ్రీ కె మీరాసాహెబ్‌గారి అధ్యక్షతను జరిగింది సదస్సులో వివిధ వర్గాలకు చెందిన 150 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. సభలో ప్రదేశ్ యువజనసమాఖ్య సహాయ కార్యదర్శి శ్రీ చిట్టినేని జనార్దనరావు, ఖమ్మంజిల్లా యువజన సంఘ అధ్యక్షులు శ్రీ వి సూర్యనారాయణ, శ్రీ పర్సా సత్యనారాయణగారు ప్రసంగించారు కార్యకర్తలు సూచన లిచ్చిన తరువాత 1000 సభ్యత్వం చేర్పించాలనీ, యువజన పత్రికకు 200 చందాలు చేర్పించవలయుననీ, సంక్రాంతికి ఆటలపోటీలు నిర్వహించాలనీ, వెల్‌ఫేర్ సెంటర్సులో యువజనులంతా పాల్గొని సక్రియ నిర్వహణకు తోడ్పడాలనీ నిర్ణయాలు తీసుకొన్నారు 23 గురితో పట్టణ కార్యవర్గమును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు

రాజమండ్రి యువజన కార్యకర్తల సమావేశం

రాజమండ్రి, డిసెంబరు 6

ఈ నెల 12 వ తేదీన మెయిల్‌లో ఏలూరుకు వెళ్తున్న సోవియట్ యువజన ప్రతినిధివర్గానికి రాజమండ్రి రైల్వే స్టేషనులో ఘన స్వాగతమివ్వాలని రాజమండ్రి పట్టణ యువజన సంఘ కార్యకర్తల సమావేశంలో తీర్మానించారు ఈ సమావేశం శ్రీ వరదా బ్రహ్మానందంగారి అధ్యక్షతన జరిగింది 50 మంది హాజరైనారు

ప్రదేశ్ యువజనసమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ వాసిరెడ్డి సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీఏలూరి సూర్యరావుగారు, శ్రీ సబ్బారపు చెల్లారావుగార్లు మాట్లాడారు

'యువజన' పత్రికకు ఈ నెలాఖరులోగా 60మందిచందాదార్లను చేర్పించటానికి కార్యక్రమం తీసుకొన్నారు

సంక్రాంతి పండుగ సందర్భంలో జనవరి 12 నుండి 17 వరకు పట్టణ యువజనోత్సవాలు, మహాసభ జరపాలని, జనవరి 17 వ తూర్పుగోదావరి జిల్లాయువజనసదస్సును రాజమండ్రిలో జరపాలని నిశ్చయించారు.

ఖమ్మం జిల్లా నాగార్జున సాగర్ రెండవ మహాసభ

డిసెంబరు 10 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఖమ్మంలోని శ్రీ వెంకటలక్ష్మి టాకీసులో పై సభజరుగుతుంది అధ్యక్షులు శ్రీ పెరవల్లి వెంకటరమణయ్యగారు (జిల్లా భారత్ సేవక సమాజ్ కన్వీనర్) మహాసభలో ఆంధ్ర ప్రదేశ్ రైతు నాయకులు శ్రీ వై వి కృష్ణారావు, శ్రీ నందూరి ప్రసాదరావుగార్లు ఉపన్యసిస్తారు. అందరూ పాల్గొన ప్రార్థన

ఇట్లు,
ఆహ్వానసంఘం.

అగ్ని ప్రమాదం

ఎనికేపాడు, డిసెంబరు 5

గణపవరం బ్లాకులోని ఎనికేపల్లి గ్రామం (హరిజనపేట) లో నవంబరు 30 న రాత్రి నిప్పు అంటుకుని నాల్గు ఇళ్ళు పూర్తిగా కాలిపోయినవి సుమారు రు 1000 లు నష్టం జరిగింది.

విశాఖలో బ్రిటిష్ నౌక

విశాఖపట్నం, డిసెంబరు 7

విశాఖపట్నం నేవెనల్ జెట్టీవద్ద విడిదిచేసిన బ్రిటిష్ పతాకనౌక హెచ్ ఎస్ అలర్ట్‌పై 4వతేదీరాత్రి దూరప్రాచ్య సేనాధిపతి శ్రీ లూస్, లూస్ సతి పానీయ విందు చేశారు సుమారు 100 మంది ఉన్నతోద్యోగులు, పురప్రముఖులు, పత్రికా విలేకరులు హాజరైనారు (వి. వి.)

రైల్వే యూనియన్ కార్యకర్తల సమావేశం

విజయవాడ, డిసెంబరు 7

దక్షిణరైల్వే ఎంప్లాయీస్ యూనియన్ విజయవాడ హెడ్‌క్వార్టర్సు ఉత్తర, దక్షిణ బ్రాంచీల ముఖ్య కార్యకర్తలసమావేశం ఇటీవల యూనియన్ ఆఫీసులో దేసింగురాజుగారి అధ్యక్షతన జరిగింది. దాదాపు 70 మంది హాజరైనారు

ప్రధాన కార్యదర్శి శ్రీ సి హెచ్ శివరామశర్మగారు సమ్మె తదనంతర పరిస్థితిని, రెండవ పేకమిషన్ జీతాలను అమలు జరపటంలో తల ఎత్తిన సమస్యలను, దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్, సదరన్ రైల్వే లేబరు యూనియన్ కలయికను గురించి విపులీకరించారు

మూడు బ్రాంచీల వార్షిక మహాసభలు విజయవాడలో జనవరి 7, 8 తారీఖులలో జరపడానికి దానికి కావలసిన నిధి వసూలు చేయడానికి నిర్ణయించారు ఈ క్రింది వారితో ఆహ్వాన సంఘాన్ని ఎన్నుకున్నారు.

అధ్యక్షులు . శ్రీ జి కనకయ్యరెడ్డి, కార్యదర్శి శ్రీ ఎం వి సుబ్బయ్య, కోశాధికారి, శ్రీ దేసింగురాజు, మరో 20 మంది సభ్యులు.

ముచ్చేలి కమ్యూనిస్టుశాఖ

తిరుపతి, డిసెంబరు 6

కాళహస్తి తాలూకా ముచ్చేలి గ్రామంలో 9 మంది సభ్యులతో కమ్యూనిస్టుపార్టీ గ్రామశాఖను ఏర్పరచుకొన్నారు ఈ సమావేశమునకు జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు శ్రీ పి. వెంకటప్ప హాజరయ్యారు మాజీ పంచాయతీ అధ్యక్షులు శ్రీ లేబాక రమణారెడ్డిగారిని శాఖా కార్యదర్శిగా ఎన్నుకొన్నారు (వి.వి)

కమ్యూనిస్టుపార్టీకి కష్టజీవులశ్రమదానం

పర్ల, డిసెంబరు 7

కర్నూలు తాలూకా పర్ల గ్రామ కమ్యూనిస్టుపార్టీ సభ్యులు, సానుభూతిపరులు సుమారు 80 మంది 3½ ఎకరాలు వరికోతకోసి సంపాదించిన కూలి సుమారు 160 పళ్ళ ధాన్యము కమ్యూనిస్టుపార్టీ నిధికి సమర్పించారు (వి. వి)

* * *

తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకా కడలి గ్రామంలో చిందురుపువారిపేట వ్యవసాయ కార్మికులు 17 మంది ఇటీవల వరికోతకోసి తద్వారావచ్చిన రు 16 10-0 లు వ్యవసాయ కార్మిక సంఘానికి విరాళంగా ఇచ్చారు

లేఖలు

శ్రీనగరు పర్ని గ్రామోదయ సంఘ పునర్నిర్మాణావశ్యకత

ఆర్యా,

గ్రామోదయసంఘం, శ్రీనగరు పర్ని ట్రస్టీలలో నేను ఒక సభ్యుడను. ఈ ట్రస్టుకు శ్రీమతి వై సీతాకుమారి, యం యల్ ఏ. గారు అధ్యక్షురాలు. మేనేజింగ్ ట్రస్టీ, కార్యదర్శి శ్రీ గాలి కృష్ణమూర్తిగారు. మిగిలిన ఇద్దరు ట్రస్టీలు శ్రీ కొత్తా అప్పారావు, శ్రీ కొసరాజు కృష్ణమూర్తిగార్లు

అక్టోబరు, నవంబరు నెలలలో మేనేజింగు ట్రస్టీ అయిన శ్రీ గాలి కృష్ణమూర్తి, ఆజీపేట ఫారెస్టులో (బన్సువాడ తాలూకా, నిజామాబాద్ జిల్లా) సంఘము తరఫున అంబరు చరఖాలను తయారు చేయుటకని టేకు కలపను కొ హైదరాబాదులో అమ్ముతున్నార తెలియుచున్నది ప్రభుత్వం యిచ్చి వెయ్యి ఘనపుటడుగుల కలపనుగాక చాలా పెద్దఎత్తున దొంగతనముగా క పను కొట్టగా, జిల్లా అటవీశాఖాధికా నవంబరు 22వ తేదీ రాత్రి కొ క్రను జప్తు చేసినారు ఈ విధము అంబరుచరఖా పేరుతో స్వలాభమ కొరకు గవర్నమెంటును మోసమ చేయుచున్నారు

1960 ఆగస్టు నెలలో మ సంఘమునుగురించి మీ పత్రికలో ఒ రిపోర్టు వచ్చినది దానిలో వున్న వి యము చాలావరకు యథార్థము సంఘము తరఫున జరిగిన లోపము అన్నిటికి మొట్టమొదటి నుండి నేనుగాని, కొత్తా అప్పారా కొసరాజు కృష్ణమూర్తిగార్లు (ట్రస్టీ గానీ బాధ్యులము కాము ఈ బాధ్య అంతయూ మాతో సంబంధ లేకుండా ట్రస్టును నడుపుచున్న శ్రీమ వై సీతాకుమారి, ఎం ఎల్ శ్రీగాలికృష్ణమూర్తిగార్లదేఅయివున్న

ట్రస్టును నిర్మించిన తేదీ యతూ నేటివరకూ ట్రస్టుసమావేశ నేర్పాటు చేయుటలేదనీ, ఖర్చులు ట్రస్టుకు తెలియ లేదనీ, సంఘములో చాలా మో జరుగుచున్నదనీ, వెంటనే సమా ఏర్పాటు చేయవలసిందనీ కో ఖాదీబోర్డుకు, ఖాదీ కమిష లఘు పరిశ్రమల మంత్రికి మ ముగ్గురు ట్రస్టీల సంతకిమ రిజిష్టరు జాబులు పంపియుంటిమి

ఇదియుమగాక లోగడ ఖాదీ నుండి సంఘం స్థాపించిన ప్రథమ తెప్పించిన చరఖాలను యిప్పటిక గోదాము [illegible] రోజులలో ఛాత్రులయందు హైస్కూ బాదు తీసుకొని వెళ్ళినారు వీ హైదరాబాదులో ఏమిచేయుచున్న కూడా ట్రస్టీలమైన మాకు తెలియద

ఇదే విధంగా సంఘ వ్యవహార అంతయూ ట్రస్టీలమైన మాముగ్గురి సంబంధము లేకుండా మేనేజిం ట్రస్టీ, కార్యదర్శి, ఛైర్మన్ నడు చున్నారు కావున ఖాదీ కమిష ఖాదీ బోర్డువారు, ప్రభుత్వమూ సంఘ తరఫున జరుగుచున్న అక్రమముల అరికట్టి సంఘమును పునర్నిర్మించవల నదిగా కోరుచున్నాను ఇట్లు,

గడ్డిపాటి శివరామయ్య, ట్రస్టీ
గ్రామోదయసంఘము, శ్రీనగరుపర్ని.

చెరుకు రైతుల ఆందోళ

ఆర్యా,

పశ్చిమ గోదావరిజిల్లా కొవ్వూ పంచాయతీ సమితి ఏరియాలో సంవత్సరం సుమారు 6,000 ములు (బెల్లం వుత్పత్తి నిమిత్తం) చె పండించుచున్నారు విత్తనము నాట మొదలుకొని బెల్లం వుత్పత్తి య నాటికి ఎకరాకు సుమారు రు 800/ ఖర్చులగుచున్నవి. గత సంవత్సరము ధర కంటే యీ సంవత్సరం చాలావరకు తగ్గిపోయింది చి పెట్టుబడులుకూడవచ్చుటదుర్లభము నున్నది కాన ప్రభుత్వముఖ క్రింది చర్యలు సత్వరమే గైకొనా

1 ఇతర దేశాల్లో బెల్లం మార్కెట్టు వెదకాలి

2. రైతు నిలకడగా అమ్ము టకు బెల్లంమీదకూడ ధాన్యానికి నట్లు అప్పులు మంజూరుచేయాలి.

3. రైతులకు సరియైన రే రసాయనిక ఎరువులు సకాలమ సరిపోయేటట్లు సప్లయిచేయాలి.

ఇట్లు,
కుందుల వెంకట్రావు, మల్ల
కొవ్వూరు పంచాయతీ స

సభలు - సమావేశా

డిసెంబరు 25 నుండి అడయార్ (మద్రాసు థియో సొసైటీ)లో అంతర్జాతీయ మహాసభలు జరుగనున్నవి.

* *

సంతనూతలపాడు బ్లాక్ నిస్టు కమిటీ సమావేశం 10, 11 తేదీల్లో పొం జరుగుతుంది సమావేశం 1 మధ్యాహ్నం 2 గంటలనుండి మవుతుంది

విశాఖ జిల్లాలోని నదులపై ప్రాజెక్టుల్ని వెంటనే ప్రారంభించాలి

ఆంధ్రగవర్నరుకు జిల్లాకమ్యూనిస్టు సమితి కార్యదర్శి మెమొరాండం

విశాఖపట్టణం, డిసెంబరు 7

విశాఖపట్నంజిల్లాలో వ్యవసాయాభివృద్ధికై వరాహ, తాండవ, గోస్తని, శారదానదులపై ప్రాజెక్టులను కట్టాలనీ, అంచనాలువేసి ద్వితీయప్రణాళికలో కేటాయింపులుకూడా జరిగినవాటి పని సత్వరం ప్రారంభించాలనీ, చెరువుల మరమ్మతులపై అధికశ్రద్ధ చూపాలనీ కోరుతూ విశాఖజిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎం వి భద్రంగారు ఆంధ్రగవర్నరుకు మెమోరాండం సమర్పించారు.

మొన్న ఉదయం గవర్నరు రాజకీయ పార్టీలు, తదితర సంస్థలనుండి మహజర్లు తీసుకొన్నారు. జిల్లా కాంగ్రెసు కమిటీ తరఫున మరొక మెమోరాండం యివ్వబడింది కమ్యూనిస్టుపార్టీ మెమోరాండంలో ఇంకా యిలావుంది

"చౌకరేటుకు వ్యవసాయదారులకు పరిశ్రమలకు యిచ్చినట్లే విద్యుచ్ఛక్తి సప్లయి చేయాలి పారిశ్రామికీకరణ విషయంలో కొత్త పరిశ్రమల యేర్పాటులో అవసరం, అవకాశం వున్న స్టార్చి ఫ్యాక్టరీ, పెయింట్సు పరిశ్రమ, కార్లకు పనికొచ్చే లీఫ్-స్ప్రింగ్స్ పరిశ్రమ, రైసుమిల్లు విభాగాల తయారీ, జూట్‌తో పురికొస తయారీ, పింగాణీ, ఎలెక్ట్రికల్ పరికరాలు, జీడిపప్పునూనె, యిప్పటికేవున్న పరిశ్రమలకు తోడ్పడే సహాయక పరిశ్రమలు, గ్రాఫైట్ రిఫైనరీలు స్థాపించాలి పై చిన్నతరహా పరిశ్రమలను సహకారపద్ధతిపై యేర్పాటుచేస్తే పారిశ్రామిక కార్మికులనుండి తగినంత షేరుధనం వసూలు చేయవచ్చును ఇవేగాక పేపరుమిల్లు, కాస్టిక్ సోడా, సిమెంటు, మాంగనీసు,డయాక్సైడ్ ఫ్యాక్టరీల యేర్పాటుకుగల అవకాశాలను పరిశీలించాలి మాడుగుల నుండి చోడవరం మీదుగా అనకాపల్లికి రైల్వేలైను వేయుటద్వారానూ, కొత్తవలసనుండి బలైడిల్లాకు వేయతలపెట్టిన రైల్వేలైనును శృంగవరపుకోట, చిట్టివలసలమీదుగా మళ్లించటంద్వారానూ అటవీసంపదను బయటికి పంపవచ్చును వర్షాభావంవల్ల జరిగిన పంటల నష్టం దృష్ట్యా శిస్తు రెమిషన్ యివ్వాలి సహాయక కార్యక్రమాలు ప్రారంభించాలి. చౌకడిపోలు తెరవాలి".

జిల్లా కాంగ్రెస్ కమిటీ తరఫున ఆ సంస్థ అధ్యక్షుడు డా॥ బి వి సంజీవరావుగారు సమర్పించిన మహజరులో విజయనగరం కేంద్రంగా మరొక జిల్లాను ఏర్పర్చాలనీ, రైతులకు శిస్తు రెమిషన్, అప్పుల మంజూరు, ఎరువుల సప్లయిజరగాలనీ, చంపావతినదిపై గజపతి నగరంవద్ద వంతెన కట్టాలనీ కోరారు జిల్లా వైద్యాధికారి కేంద్రం విజయనగరంలోవుంచిఆయనకుఅక్కడి ఆస్పత్రులలో పనికూడా అప్పగించాలనీ కోరారు. చిన్న పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం కల్గించే ఇండస్ట్రియల్ కార్పొరేషన్‌ను విజయనగరంలో యేర్పర్చాలనీ, జిల్లాలో వున్న ఖనిజసంపద దృష్ట్యా భారీ పరిశ్రమల్ని నెలకొల్పాలనీ, విజయనగరంలో ఎరువుల ఫ్యాక్టరీని పెట్టాలనీ, ఆంధ్రవద్ద చంపావతి నదిపై ఆనకట్టకట్టాలనీ కూడా ఆయన కోరారు

మున్సిపల్ పన్ను చెల్లింపుదార్ల సంఘం తరఫున శ్రీ బుద్ధిరాజు శ్రీశైలమల్లికార్జునరావుగారు సమర్పించిన మహజరులో విశాఖపట్నం నుండి పిచ్చాసుపత్రిని తరలించరాదనీ, పన్నులు తగ్గిస్తూ ఈ ధ్యనే మున్సిపల్ కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని ప్రభుత్వం ఆమోదించునట్లు చూడాలనీ కోరారు పట్టణ పారిశుధ్యాన్నీ, రోడ్లనిర్వహణా సరిగా వుండునట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతీసుకొని సాయపడాలని తెల్పారు లక్షలరూపాయలఖర్చుతోతలపెట్టిన విశాఖ సముద్రతీరం అభివృద్ధి-బీచ్ రోడ్ అన్నగా లేకుండా అడ్డుగా వున్న కోస్టు బ్యాటరీవల్ల-వృథా అవుతున్నదనీ, కోస్టు బ్యాటరీ తొలగింపు, సముద్రతీర ప్రాంతాల్లో బహుజనోపయోగార్థం పాయిఖానా దడ్లు యేర్పాటు కావాలనీ కోరారు

తంతి తపాలా ఉద్యోగుల సంఘాల అధ్యక్షులు శ్రీ నిష్కల సోమయాజులుగారు సమర్పించిన మహజరులో కేంద్రప్రభుత్వోద్యోగుల జీతాల స్కేళ్లు పెంచాలని కోరారు ప్రభుత్వోద్యోగుల కోర్కెలు కన్సిలియేషన్, మధ్యవర్తి పరిష్కారముల ద్వారా పరిష్కరించాలన్నారు డిపార్టుమెంటు చర్యలు చాలా ఆలస్యమౌతున్నాయనీ, విశాఖపట్నాన్ని పారిశ్రామిక నగరంగా ప్రకటించి ఉద్యోగులకు అదనపు భత్యం యివ్వాలనీ కోరారు

బార్ అసోసియేషన్ తరఫున, వాణిజ్య మండలి తరఫున కూడా మహజర్లు సమర్పించబడ్డాయి (వి వి)

కాంగ్రెసు పార్టీ సమావేశానికి భావనగర్ వద్ద నిర్మితమౌతున్న 'సర్దార్ నగర్' జనవరి మొదటివారానికల్లా [illegible]వుతుంది.

కాశ్మీర్ ప్రజాస్వామ్య జాతీయ మహాసభ

కొనసాగించాలని శ్రీ సరాఫ్ ప్రకటన

శ్రీనగర్, డిసెంబరు 6

సాదిక్ నాయకత్వాన గల ప్రజాస్వామ్య జాతీయ మహాసభ రద్దుకాకూడదని, ప్రజల శ్రేయస్సుకోసం పోరాటం కొనసాగించాలని కార్యవర్గ సమావేశంలో మహాసభ రద్దును వ్యతిరేకించిన ఆరుగురు కార్యవర్గ సభ్యులు, ముగ్గురు శాసన సభ్యులు నేడొక ప్రకటనలో పునరుద్ఘాటించారు వారిలో పార్టీప్రధాన కార్యదర్శి శ్రీ ఆర్. సి సరాఫ్‌కూడా ఉన్నారు

వారి ప్రకటనలో ఇంకా ఇలా ఉంది "అభివృద్ధి కార్యకలాపాల రంగంలో ప్రభుత్వంతో సహకారం ఉండాలనే మేము కోరుతున్నాం సహకారం అర్థం ప్రజల హక్కులను కాపాడే ఆయుధంగా పనిచేస్తున్న మా సంస్థను రద్దుచేసుకొనడం కాదు

"ఉత్తరం నుంచి పశ్చిమం నుంచి ప్రమాదం ఏర్పడిన దృష్ట్యా రాష్ట్ర రాజకీయ పరిస్థితిని పునఃపరిశీలించాలని ఒక సాకు చూపిస్తున్నారు పునఃపరిశీలనకు అవసరమైన నూతన పరిస్థితులు ఏర్పడలేదని మా అభిప్రాయం 1959 డిసెంబరునుంచి పరిస్థితి అలాగే వుంది

"పాకిస్తాను, చైనాలతో మన వివాదాలను శాంతియుత ప్రాతిపదికపై పరిష్కరించాలని మేము అభిప్రాయ పడుతున్నాం మాతృదేశ ప్రాదేశిక సమైక్యతకు ఏమూలనుంచి ప్రమాదం ఏర్పడినా ఇతరపార్టీలతో పాటు తుదిదాకా పోరాడుతామని ప్రజాస్వామ్య జాతీయ మహాసభ ప్రతిన బూనుతుంది"

దేశం ఉత్తర సరిహద్దులోని ప్రాంతాలను చైనా ఆక్రమించడం భారతదేశంపై దురాక్రమణ జరపడం కాదా అని ప్రశ్నించగా శ్రీ సరాఫ్ ఇలా జవాబిచ్చారు "దానిని దురాక్రమణగా ప్రజాస్వామ్య జాతీయ మహాసభ ఎలా వర్ణించగలదు? మన సరిహద్దు చైనా ఉల్లంఘించింది అనే వైఖరిని గతంలో ప్రజాస్వామ్య జాతీయ మహాసభ తీసుకొన్నది ప్రస్తుతం భారత-చైనాల మధ్య చర్చలు జరుగుతున్నవి ప్రధాని నెహ్రూకూడా ఐరాసలో దురాక్రమణఅనేపదం ఉపయోగించలేదు."

భారత కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వంగల వ్యక్తి ఎవ్వరూ ప్రజాస్వామ్య జాతీయ మహాసభ సభ్యుడుగా లేరని మరొకప్రశ్నకు జవాబుగా శ్రీసరాఫ్ అన్నారు. కాని, మార్క్సిజంలోను, కమ్యూనిజంలోను విశ్వాసం ఉన్న కార్యకర్తలు సంస్థలో ఉన్నారని అన్నారు.

పార్టీ రద్దును వ్యతిరేకించిన కార్యవర్గ సభ్యులు ఈవేళ, రేపు సమావేశమై భావికార్యక్రమాన్ని రూపొందిస్తారని శ్రీ సరాఫ్ చెప్పారు

బెరుబారి సమస్యపై ఎన్నిక అవసరం

పశ్చిమ బెంగాలు శాసన మండలిలో సూచన

కలకత్తా, డిసెంబరు 6

బెరుబారిని పాకిస్తానుకు బదిలీ చేసే సమస్యకు ఎన్నిక జరపడమే ప్రజాస్వామ్య పరిష్కారమార్గమని పశ్చిమ బెంగాలు శాసనమండలిలో స్వతంత్ర సభ్యుడు శ్రీ శశాంక శేఖర్ సన్యాల్ సూచించారు

పశ్చిమ బెంగాల్ కాంగ్రెసు శాసనసభ్యుడు ఒకరు తన స్థానానికి రాజీనామా ఇవ్వాలనీ, ప్రధానినిగాని లేక అతని అభ్యర్థినిగాని బెరుబారి మార్పిడి సమస్యపై తిరిగి పోటీకి ఆహ్వానించాలనీ ఆయన సూచించారు అట్టి ఎన్నిక ఫలితం సమస్యను పరిష్కరిస్తుందని అన్నారు

ఈ సమస్యపై రాష్ట్రప్రభుత్వం మౌనం వహించటంద్వారా తన అంగీకారాన్ని తెలిపిందని పదేపదే అంటూ ప్రధాన సమస్యను గందరగోళ పరుస్తున్నారని ఆయన అన్నారు.

రాష్ట్రప్రభుత్వం, ప్రజలు బెరుబారి మార్పిడి జరగకూడదని అంటున్నారు భారతప్రభుత్వం జరగాలని అంటున్నది ఎవరివైఖరినెగ్గాలన్నదే ప్రస్తుత రాజ్యాంగసమస్యఅని శ్రీ సన్యాల్ అన్నారు ఈ రాజ్యాంగప్రతిష్టంభనను పరిష్కరించడానికి ఎన్నికజరగడమే మార్గమని అన్నారు ఈ సమస్యపై రాష్ట్రశాసనసభలోని ఇతర పార్టీల నాయకులు రాజీనామాచేసి తిరిగిఎన్నిక కావాలని అన్నారు

బెరుబారిసమస్యపై వచ్చేవారం సభలో చర్చజరుగుతుందని తెలియజేయబడింది

మన సంస్కృతి: పూర్వాపరాలు

మద్రాసులో చర్చా వేదిక

మద్రాసు, డిసెంబరు 7

"మనసంస్కృతి పూర్వాపరాలు" అను విషయముపై తెలుగు సంస్కృతీ వర్ధనివారు మద్రాసులోని త్యాగరాయ కళాశాల ఆవరణలో నిన్న ఒక చర్చా వేదికను ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి శ్రీ పిలకా గణపతిశాస్త్రిగారు అధ్యక్షత వహించారు

ప్రారంభంలో న్యాయకళాశాలకు చెందిన శ్రీ తుమ్మల చౌదరి వక్తలనూ, చర్చనూ పరిచయంచేస్తూ, తెలుగు సంస్కృతీ విశిష్టతను వివరించవలసినదిగా అర్థించారు.

పద్మశ్రీ మోటూరి సత్యనారాయణ (యం పి)గారు ప్రసంగిస్తూ, తెలుగు సంస్కృతిగానీ, మరే ప్రాంతీయ సంస్కృతిగానీ భారతీయ సంస్కృతి నుండి వేరుకాజాలదన్నారు.

ఇంకా ఇలా అన్నారు

"నిరంతరం ప్రవహించే గంగవంటిది భారతీయ సంస్కృతి. అందు ప్రాంతీయ సంస్కృతులన్నీ అంతర్వాహినులు భారతీయ సంస్కృతిని అర్థం చేసుకుంటేగాని, తెలుగు సంస్కృతి సమగ్ర స్వరూప సాక్షాత్కారం లభించదు. భావ వ్యక్తీకరణకు భాష ఒక సాధన. అంతేగాని, భాష వేరయినంతమాత్రమున జాతి వేరుకాదు"

"తెలుగు దానికై అదిజన్మించినభాష కాదు భిన్న భాషల స్వభావాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకుని, నిత్యమూ పరిణామం చెందుతూవచ్చిన ఒక భాషా సంపుటివంటిదది అందుకే, మూలంలోగూడా లేని సొగసును మహాభారతానికీ, భాగవతానికీ చేకూర్చినారు ఆంధ్రులు సంస్కృతి కేవలం సాహిత్యస్వరూపమే కాదు మన నిత్య వేష భాషలలో, ఆలోచనా క్రమంలో, నిత్యజీవితంలో దాని ప్రతిబింబంగోచరిస్తుంది. సంఘంయొక్క సమగ్ర స్వరూపాన్ని సాక్షాత్కరింపజేసేదే సంస్కృతి" అన్నారు

శ్రీయుతులు తిమ్మావఝ్ఝుల కోదండరామయ్య, సాల్వ కృష్ణమూర్తి ఎన్. ఆర్ శివస్వామిగార్లు కూడా ప్రసంగించారు

శ్రీ సి హెచ్ సిద్దారెడ్డి వందన సమర్పణ చేస్తూ, వర్గసంఘర్షణలతోనూ, పారిశ్రామికయుగ సమస్యలతోనూ, నేటి ప్రజల దైనందిన జీవితంతోనూ నిమిత్తంలేకుండా సాహిత్యంగాని, కళగానీ అభివృద్ధి చెందడం అసంభవమన్నారు

సిక్కిం భూటాన్‌ల మధ్య కట్టుదిట్టాలు

ఎట్టి సమాచారం లేదని నెహ్రూ ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 7

సిక్కిం భూటాన్‌ల మధ్యనున్న చుంబీ లోయలో చైనావారు స్థిరమైన ఏర్పాటు చేసుకొన్నారని, తద్వారా సరిహద్దులను గురించి భారతదేశానికి ఆందోళన కలిగించేస్థితి ఏమైనావుందా అని శ్రీ మునుస్వామి లోక్‌సభలో నేడు ప్రశ్నించారు

అందుకు సంబంధించి ప్రభుత్వానికి ఖచ్చితమైన సమాచారమేమీ లేదని ప్రధాని నెహ్రూ సమాధానం చెప్పారు. అయితే టిబెట్ లోయలో చైనావారు కట్టుదిట్టాలు చేసినట్లు తెలిసిందని శ్రీ నెహ్రూ అన్నారు

భారత సరిహద్దునుండి ఖాట్మండుకు చైనావారు నిర్మించిన రోడ్డును ఇంకా ఉత్తరానికి పొడిగించాలని, తద్వారా నేపాల్ టిబెట్‌ల మధ్య వ్యాపారం పెంపొందించాలని, ఇందుకు నేపాల్ అనుమతి చైనా తీసుకోనున్నదని మరో సభ్యుని సూచనకు తమవద్ద సమాచారమేమీ లేదని ప్రధాని సమాధానం చెప్పారు

బలమైన శాంతి ఉద్యమం

నిర్మించాలని కేరళ కమ్యూనిస్టుపార్టీ సభ తీర్మానం

కన్ననూర్, డిసెంబరు 6

నిరాయుధీకరణకై సోవియట్ రష్యా చేసిన ప్రతిపాదనలకు అండగా గొప్ప శాంతి ఉద్యమం నిర్మించాలని కేరళ కమ్యూనిస్టు మహాసభ అంతర్జాతీయ పరిస్థితులపై నేడొక నివేదిక ఆమోదించింది

పార్టీ తరఫున వెలువరించిన పత్రికా ప్రకటనలో ఇలా వుంది

"సోషలిస్టుశిబిరం ఐక్యతను,ఆఫ్రికా ఆసియా దేశాల ఐక్యతను భగ్నం చేయాలని సామ్రాజ్యవాదులు కుట్రలు చేస్తున్నారు యుద్ధప్రమాదమువున్నది కనుక జాగరూకత అవసరం గోవా విముక్తి పోరాటం సాగించాలి. ఐరాస ప్రపంచ పరిస్థితులలోని మార్పును ప్రతిబింబించటం లేదు చైనాకు ఐరాసలో సభ్యత్వమివ్వాలి లుముంబాను వెంటనే విడుదల చేయాలి" అని వారు తమ రిపోర్టులో వివరించారు

కాంగో పరిస్థితిపై తటస్థదేశాల సంప్రతింపులు

ఐక్య అరబ్ రిపబ్లిక్ రాయబారి వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 7

కాంగోలోని తాజా పరిణామాలపై ఐక్య అరబ్ రిపబ్లిక్ ఎప్పటికప్పుడు ఘనా, ఇండొనిషియా, యుగొస్లేవియా భారత దేశాలతో సంప్రతించుతున్నదనీ, పాట్రిస్ లుముంబానే కాంగో ప్రధానిగా గుర్తించాలని కోరుతున్నదనీ, నేడిక్కడ ఐక్య అరబ్ రిపబ్లిక్ రాయబారి అహమ్మద్ హుస్సేన్ ఎల్-ఫెకీ పత్రికా విలేకరులతో అన్నారు

ఒక విలేఖరి ప్రశ్నకు ఆయన జవాబు చెబుతూ, నాలుగురోజుల క్రిందటనే నాజర్ ఆదేశంపై తాను ప్రధాని నెహ్రూను కలుసుకొని కాంగో పరిస్థితినిగురించి చర్చించానని తెలిపారు.

లుముంబా రేడియోలో తన ప్రజలతో మాట్లాడి, వ్యతిరేకులపై చర్యలను తీసుకొనకుండా ఐరాస మొదటిలో అడ్డుపెట్టినదనికూడా అహమ్మద్ హుస్సేన్ ఆక్షేపించారు. కర్నల్ మొబుటూ తన యిష్టంవచ్చినట్లు వ్యవహరించేందుకు అవకాశం యిచ్చిందన్నారు.

ఐరాసతో నిమిత్తం లేకుండా కాంగోలో స్వతంత్రంగా ఏమైనా చర్యలను తీసుకోవాలని ఐక్య అరబ్ రిపబ్లిక్ ఆలోచించుచున్నదా అని ఒక విలేకరి ప్రశ్నించగా ఆయన ఇలా అన్నారు

ఐరాస ద్వారానే కాంగోలో మా ప్రభుత్వం వ్యవహరించాలని ఇంకా అనుకొంటున్నది.

ఒక విలేకరిప్రశ్న కాంగో ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఐరాస ద్వారానే మీరు ఎలా పని చేయగలరు? కాంగో సమస్యపై ఐరాసలో ఏదైనా తీర్మానాన్ని మీరు ప్రతిపాదించదలచారా?

రాయబారి: ఐరాసలో యింకా మాకు విశ్వాసం వుంది. ఏదో ఒకనాటికి మేము వాంఛించినట్లే ఐరాస పని చేయగలదు ప్రపంచ ప్రజాభిప్రాయం చాల బలమైనది కాంగోలో ఐరాస గట్టిగా పనిచేయవలసివుంది. కొద్దిరోజుల క్రిందటనే ఐరాసలోనే మా ప్రతినిధి ఐరాస ప్రధానకార్యదర్శిని కలుసుకొని లుముంబాను విడుదల చేయాలని కోరాడు.

రాయబారి ఇంకా ఇలా అన్నారు

"కాంగోను సందర్శించనున్న ఐరాస రాజీసంఘంనుండి మా ప్రతినిధిని ప్రభుత్వం ఉపసంహరించింది రాజీసంఘం కాంగోను సందర్శించినందువల్ల నేటి పరిస్థితుల్లో ఎలాంటి ఉపయోగమూ వుండదని మాప్రభుత్వం భావిస్తున్నది. వివిధ నాయకులమధ్య రాజీ కుదర్చడానికి యీ సంఘం ఏర్పాటైంది. కాని ప్రధాని లుముంబా నేడు జైల్లో వున్నారు. నేటి పరిస్థితుల్లో కాంగోలో వివిధ వర్గాలు స్వేచ్ఛగా సంప్రతింపులు జరుపుకొనే సూచనలు లేవు

నైల్ నదిలో కలిసే రెండు ఉపనదులను ఈజిప్టు, సూడాన్‌లలోకి ప్రవహించకుండా ఆపుచేస్తానంటూ కర్నల్ మొబుటూ బెదరించారు

ఈ సందర్భంలో భూగోళ సూత్రాలూ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలూ మొబుటూ, ఆయన సలహాదారులూ నేర్చుకోవడంమంచిది. నదీప్రవాహాన్ని అడ్డుకోవడం మానవుల చేతకాదు. బలవంతాన అంతకంటే సాధ్యంకాదు ఒకవేళ అలా చేసినప్పటికీ సూడాన్‌కుగానీ, ఈజిప్టుకుగానీ ఏమాత్రంనష్టంలేదు కారణమేమంటే నైల్ నదిపుట్టుక ఇథియోపియాలో నున్నది.

గమనించదగిన విషయమొకటున్నది తన సైన్యాన్నంతటినీ, కార్మికులుగా మార్చాలని మొబుటూ తలపోస్తున్నారు చాల చక్కని ఊహ పుట్టింది వాళ్ళు నెలాగూ సైనికులుగా తయారుచేయలేరు కార్మికులుగా పనిచేయడానికే మొబుటూ సైనికులు తగినవారు కాంగోలో శాంతిభద్రతలు యేర్పడాలంటే మొబుటూ సైనికులను నిరాయుధులను చేయాలని మేము డిమాండు చేస్తున్నాము

కాంగోలో అభివృద్ధిశక్తులుపనిచేయాలని మేము వాంఛించుతున్నాము సామ్రాజ్యవాదులతో స్నేహ సంబంధాలు వదలుకోవాలని కోరుతున్నాము ప్రపంచ శాంతికి, కాంగోలో ప్రశాంతతకు మొబుటూ సైనికులు పై కార్యక్రమంకోరకు మీతోకలిసిపనిచేస్తే సంతోషిస్తాము."

కాంగోలో పరిస్థితిపై అరబ్‌రిపబ్లిక్ మంత్రి అబ్దుల్ ఖాదర్ హాకీమ్ చేసిన ప్రకటనను రాయబారి నేడు విడుదల చేశారు

ఆ ప్రకటనలో ఇలా వుంది

"లుముంబా నాయకత్వానవున్న ప్రభుత్వమే న్యాయసమ్మతమైంది చట్టబద్ధమైంది. అలాంటి ప్రభుత్వాన్ని బలహీనపరచడంలో ఐరాస సైన్యం కూడా మద్దతు నిచ్చింది తమ తాబేదారులనుపదిలపరచుకొనడానికి,వారిని అధికారంలో పెట్టడానికి ఐరాస జెండాను సామ్రాజ్యవాదులు బాగానినియోగించుకొన్నారు ఐరాస ముసుగుక్రింద సామ్రాజ్యవాద దుష్టశక్తులు, వారి కీలుబొమ్మలు కాంగో పార్లమెంటును రద్దుచేశారు న్యాయ సమ్మతమైన ప్రభుత్వాన్ని బలపరచినవారిని అరెస్టుకూడా చేశారు సామ్రాజ్యవాదుల విచ్ఛిన్నకర చర్యలకు వ్యతిరేకంగా పోరాడిన వేలాది ప్రజలను బెల్జియం దురాక్రమణదారులు అమానుషంగా వధించారు".

పంచదార ఎగుమతులకు పాటిల్ సమర్థన

న్యూఢిల్లీ, డిసెంబరు 7

పంచదార ఎగుమతి సమస్యను పరిష్కరించడానికి రెండు రకాలైన చర్యలను తీసుకొనడం అవసరమని కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రి శ్రీ యస్ కె. పాటిల్ లోక్‌సభలో నేడు అన్నారు అందులో ఒకటి యితర దేశాలతో సంప్రతించి అంతర్జాతీయంగా పంచదార ధర పెంచడం, దేశంలో ధర తగ్గించడం రెండవదని శ్రీ పాటిల్ అన్నారు

దేశంలో పంచదారధర తగ్గించడం, అదే సమయంలో ఉత్పత్తిదారుడు నష్టపడకుండా రక్షణ కలిగివుండాలంటే ఎకరానికి రాలుబడిని పెంచడమొక్కటేమార్గమనికూడా శ్రీ పాటిల్ అన్నారు

పంచదార ఉత్పత్తి పంపిణీ, ఎగుమతులపై రెండు గంటలపాటు జరిగిన చర్చకు సమాధానమిస్తూ శ్రీ పాటిల్ ఇలా అన్నారు

"చెరకు ఉత్పత్తిని ఎకరానికి పద్నాలుగు టన్నులనుండి కనీసం ముప్ఫయి టన్నులవరకైనా పెంచాలి రైతులకు ఎరువులు, నీటిపారుదల, తదితర సౌకర్యాలు కలిగిస్తే ఉత్పత్తిని సాధించడం కష్టమైన పనేమీకాదు. చెరకు ఉత్పత్తిని యాభై శాతం పెంచడం అసాధ్యమైందేమీ కాకపోగా చాలా సులభమైన పని

పంచదార ధర మార్కెట్టులోనేగాక పరిశ్రమవద్దకూడ తగ్గించాలి ఈ సమస్యను పరిష్కరించడానికి ఇదొక్కటే మార్గం.

చివరకు ధరను పెంచాలని సోషలిస్టు సభ్యులు శ్రీ బ్రిజ్ రాజ్ సింగ్ వాదించారు

కమ్యూనిస్టుసభ్యులు శ్రీ సి యం పాణిగ్రాహిప్రశ్నకు సమాధానం చెబుతూ శ్రీ పాటిల్ ఇలా అన్నారు

పంచదారను అమెరికాకు ఎగుమతి చేయడంలో రాజకీయాలేమీ లేవు. క్యూబానుండి దిగుమతులు అమెరికా రద్దుచేసుకొనడానికీ, మనం ఎగుమతి చేయడానికీ ఎలాంటి సంబంధం లేదు. క్యూబానుండేగాక మరో పదకొండు దేశాలనుండి అమెరికా పంచదార దిగుమతి చేసుకొంటున్నది ఇదిప్రపంచ ధరకంటే అరవైశాతం ఎక్కువ చెల్లిస్తున్నది. అమెరికాకు క్యూబా సప్లయి చేసే పంచదారకంటే భారతదేశంలోని మొత్తం ఉత్పత్తికూడా తక్కువే.

అయితే ఇందులో రాజకీయాలు అంటుకొని వున్నాయి. అమెరికా మన పంచదార కొనుగోలుదారుడుగా రావాలని మనం కోరుకొంటాము.

అమెరికా మన పంచదార కొంటే మనకు మార్కెట్టు రక్షణ వుంటుంది.

పంచదారపైవున్న కంట్రోలును వెంటనే తీసివేయలేము. క్రమేణా కంట్రోలును తీసివేయాలి."

హైదరాబాద్ జిల్లా కమ్యూనిస్టు మహాసభ వాయిదా

హైదరాబాద్, డిసెంబరు 7

హైదరాబాద్‌జిల్లా కమ్యూనిస్టు మహాసభను కొన్ని ప్రత్యేక కారణాలవల్ల వాయిదా వేశారు (మహాసభ డిసెంబరు 8, 9 తేదీలలో జరపాలనిప్రథమంలో నిర్ణయించారు) ఆంధ్రప్రదేశ్ పార్టీ మహాసభ తర్వాతనే హైదరాబాద్‌జిల్లా మహాసభ జరుగుతుంది

వికారాబాద్, మక్కి, మేడిచర్ల తాలూకా పార్టీ సర్వసభ్య సమావేశాలను, మహాసభలను కూడా వాయిదా వేశారు.

రష్యాపట్ల భారత ప్రభుత్వ వివక్ష

స్కాలర్‌షిప్పుల విషయంలో కెనడాపట్ల చూపిన తీరుకు భిన్నంగావుందని భూపేష్‌గుప్త విమర్శ

న్యూఢిల్లీ, డిసెంబరు 8

కెనడా, సోవియట్ యూనియన్లు యిస్తాన్న విద్యార్థి స్కాలర్‌షిప్పులను అంగీకరించే విషయంలో భారత ప్రభుత్వం సోవియట్‌పట్ల వివక్ష చూపుతున్నదని రాజ్యసభలో కమ్యూనిస్టు నాయకుడు శ్రీ భూపేష్‌గుప్త నేడు నిశితంగా విమర్శించారు

ప్రశ్నకు సమాధానం చెబుతూ శాస్త్రీయ పరిశోధన, సాంస్కృతిక వ్యవహారాల ఉపమంత్రి శ్రీ మనమోహన్‌దాస్ ఇలా అన్నారు

"కెనడా కామన్వెల్త్ స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌ల సంఘం భారతదేశానికి పద్నాలుగు స్కాలర్ షిప్పులను ఇవ్వడానికి నిర్ణయించుకొన్నది ఈ సందర్భంలో ఇరవైఎనిమిదిమందిఅభ్యర్థులను నిర్ణయించడానికి భారత ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది ఈ ఇరవై ఎనిమిదిమందిలో పద్నాలుగురిని కెనడా అధికారులు ఎన్నుకుంటారు. తుది నిర్ణయం చేసేటప్పుడు భారత ప్రభుత్వ ప్రతినిధి ఎవ్వరూ లేరు"

శ్రీ భూపేశ్ గుప్తా కెనడా స్కాలర్ షిప్‌ల విషయంలో తుది నిర్ణయం చేసేటప్పుడు భారత ప్రతినిధి ఎవరూ లేరు మరలాంటప్పుడు మాస్కో స్నేహ విశ్వవిద్యాలయానికి విద్యార్థులను నిర్ణయించడంలో తుది నిర్ణయం తానేచెయ్యాలని భారతప్రభుత్వం ఎందుకు పట్టుబట్టింది?

మంత్రి ఒకదేశానికీ మరోదేశానికీ మధ్య తేడావుంది డబ్బుఅంతా ఎవరుభరిస్తున్నారనేది అసలుప్రశ్న కెనడాసంఘం స్కాలర్‌షిప్పులు ఇస్తానన్నది. అందుకుజరిగిన ఒప్పందంలోనే మనం ఇరవైఎనిమిది మందిని మొదట సూచిస్తామని వారిలో పద్నాలుగు మందిని కెనడా అధికారులు ఎన్నుకోవాలని అనుకున్నాము

శ్రీ గుప్తా డబ్బంతా ఎవరు భరిస్తున్నారనేదే ముఖ్యమైన అంశమైతే మాస్కో స్నేహవిశ్వవిద్యాలయమే ఖర్చులన్నీ భరిస్తున్నదిగా! ఒకరివిషయములో మాత్రమే తానే పూర్తినిర్ణయాలన్నీ చేయాలని ప్రభుత్వం పట్టుబట్టింది. కెనడా విషయంలో ఆ వాక్కును ప్రభుత్వం వదులుకొన్నది.

మంత్రి అందుకు ప్రభుత్వాన్నేమి చేయమంటారు? మాస్కో మాస్కోయే, కెనడా, కెనడాయే

సహకార వ్యవసాయ సంఘాలు

పదింటిని నెలకొల్పాలని ప్రభుత్వ యత్నం

హైదరాబాద్, డిసెంబరు 8

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే రాష్ట్రంలో పది సహకార వ్యవసాయ సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి శ్రీరామచంద్రారెడ్డి నేడుశాసన సభలో తెలియజేశారు

వాటిల్లో రెండింటిని అప్పుడే నెలకొల్పారనీ, అవి రిజిస్టరయినాయనీ ఆయనచెప్పారు ఒకటికర్నూలులోనూ, మరొకటి నెల్లూరుజిల్లాలోనూ ఇవి ఏర్పడ్డాయి మిగతా ఎనిమిదింటిలో ఒకదాన్ని కృష్ణా, నాలుగు కర్నూలు, మూడు ఆదిలాబాద్ జిల్లాల్లోనూ నెలకొల్పనున్నామని చెప్పారు. ప్రతీ కేంద్రంనుండి వచ్చే ప్రతిపాదనలను పరిశీలించినమీదట వాటిని ఏ యే ప్రత్యేకచోట్ల నెలకొల్పాలో నిర్ణయిస్తామన్నారు

ప్రదేశ్ చట్టాల విస్తరణ బిల్లు

ఆంధ్ర శాసనమండలి ఏకగ్రీవామోదం

హైదరాబాద్, డిసెంబరు 7

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి నేడు "ఆంధ్రప్రదేశ్ (బదిలీ అయిన ప్రాంతాల) విస్తరణచట్టాల బిల్లు-1960"ను కొద్దిపాటి చర్చ అనంతరం ఏకగ్రీవంగా ఆమోదించింది

బిల్లును ప్రణాళికా మంత్రి శ్రీ పి. రంగారెడ్డి సభలో ప్రవేశపెడుతూ, ఇటీవల మద్రాసు రాష్ట్రంనుండి ఆంధ్ర ప్రదేశ్‌కు దఖలుపడ్డ కొన్ని ప్రాంతాలూ—సత్యవీడు తాలూకాగా ఏర్పడ్డ ప్రాంతాలూ ఇప్పటివరకూ మద్రాసు చట్టాలనే అనుసరిస్తున్నాయని చెప్పారు

ఇకనుండి ఈ ప్రాంతాలు ఆంధ్ర రాష్ట్రంలో భాగమైపోయాయి కాబట్టి, మన రాష్ట్రంలో అమలులో వున్న చట్టాలే, అంతటా ఒకేరకంగా ఉండడంకోసం, ఈ ప్రాంతాలకు కూడా వర్తించాలని ఆయన అన్నారు. ఈ కొత్త ప్రాంతాలకు ప్రదేశ్ చట్టాలను విస్తరింపజేయాలన్నదే ప్రస్తుత బిల్లు ఉద్దేశమని మంత్రి అన్నారు.

తరువాత శ్రీ గుంటూరు బాపనయ్య (క ప్ర ప) బిల్లును బలపరుస్తూ మాట్లాడారు ఈ చట్టాలు మంచివైనా ఇవి ఇతర ప్రాంతాలకు విస్తరింపబడినప్పటికీ, ముఖ్యంగా ప్రస్తుత పంచాయతీపరిషత్తుల,జిల్లాపరిషత్తులచట్టంలో కొన్ని అవకతవకలు కన్పిస్తున్నాయన్నారు. ఈవిషయాన్ని ప్రభుత్వం గమనించాలని ఆయన కోరారు

ఒక జిల్లా పరిషత్తుకు చెందిన సాంఘిక సంక్షేమ కార్యకలాపాల్ని చూచే కమిటీ హరిజనేతరులూ, యింకా ఇతరులతో నిండివుండడంవల్ల అది హరిజనులకూ, వెనుకబడిన తరగతులవారికీ చాలా అన్యాయం చేస్తోందని శ్రీ బాపనయ్య తెలిపారు ఈ సందర్భంలో ఆయన ఒక ఉదాహరణ చూపుతూ కృష్ణాజిల్లా పరిషత్‌కు చెందిన కమిటీ హరిజనులకు ఇళ్ళస్థలాలు గ్రాంటు చేయాలన్న ప్రతిపాదనను నిరాకరించిందని చెప్పారు కమిటీలోని హరిజన సభ్యుడు మినహా మిగతా సభ్యులంతా ఆ ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఓటు చేశారన్నారు

అలాగే తూర్పు గోదావరి జిల్లాలో కూడా ఇటువంటి అన్యాయాలు జరుగుతున్నాయన్నారు విశ్వాస తీర్మాన సమస్యలాంటి విషయాలలో రహస్యబ్యాలెటు అవసరమని ఆయన సూచించారు పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తుల సిబ్బందిని రిక్రూటు చేసే విషయమై సలహా లిచ్చేందుకు ఏర్పడ్డ సెలక్షన్ కమిటీలు సమావేశం కావడంలేదని విమర్శించారు. వివిధ కమిటీల మధ్య సమన్వయమే లేదన్నారు. ఇతర కమిటీలలో ఏం జరుగుతోందో ఒక కమిటీకీ, ఒక కమిటీకీ తెలియదన్నారు.

తర్వాత శ్రీ పి శ్రీరామమూర్తి (ఉపాధ్యాయఇండి) మాట్లాడుతూ, ప్రభుత్వం నియమించే విద్యాసంఘాలలో తాలూకా విద్యాబోర్డుల విషయమై కుప్పుస్వామి కమిటీ చేసిన సూచన ప్రకారం ఉపాధ్యాయ ప్రతినిధులను చేర్చుకోవాలన్నారు.

తర్వాత శ్రీ రామకృష్ణయ్య(ఉపా. ఇండి) మాట్లాడుతూ, వేతన నిర్ణాయక సంఘ సిఫార్సుల కనుగుణంగా ఏ జీతాల స్కేళ్ళ ఆధారంగా తమను ఏర్పాటుచేసింకో అధికార్లు తెల్పేవరకూ, మద్రాసు రాష్ట్రంలో కొత్తగా పెంచిన జీతాలస్కేళ్ళ ఆధారంగా తమ స్కేళ్ళు పెంచడానికి వీలుండదని మద్రాసురాష్ట్రం నుండి మనకు బదిలీఅయిన ప్రాంతాలలోని ఆఫీసర్లకు మద్రాసు ప్రభుత్వం చెప్పిందన్నారు అందువల్ల వారిని ఏ స్కేళ్లపై ఖాయం చేశారో ఆ బదిలీఅయిన ఆఫీసర్లందరికీ ఆంధ్ర ప్రభుత్వం తెలియజేయాలి.

ఆంధ్రప్రభుత్వం మద్రాసురాష్ట్రం నుండి మనకు కొన్ని ప్రాంతాలు బదిలీఐన ఫలితంగా అప్పటివరకూ మద్రాసులోనే పని చేస్తున్న తెలుగు ఆఫీసర్లను వారి ఆస్తిపాస్తులూ, పిల్లలూఆంధ్రలో వున్నందున ఆంధ్రకు రప్పించడం అవసరమన్నారు

తరువాత మంత్రి శ్రీ పి రంగారెడ్డి చర్చకు జవాబిస్తూ, ప్రభుత్వానికి సభ్యులుతెలియజేసిన లోపాలలో కొన్ని తెలుసుననీ, ప్రస్తుత చట్టం క్రింద రూపొందించే నిబంధనలను సభవారి ముందుంచినప్పుడు యింకా సంతృప్తికరమైన పూర్తి చర్చజరుపుకోవచ్చునీ చెప్పారు సక్రమమైన నిబంధనలను రూపొందించడానికి ప్రభుత్వం ప్రతిపక్షసభ్యులతోసహా ఒక రూల్స్ కమిటీని నియమించిందనీ, ఇది రెండుసార్లు సమావేశమైందనీ, త్వరలోనే పనిని పూర్తిచేయనున్నదనీ చెప్పారు. తరువాత సభవారు బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించారు

నూలు బట్టలకు మిల్లులవద్ద సరసమైన ధర నిర్ణయించే సమస్యను టారిఫ్ కమిషన్‌కు నివేదించినందుకు భారత ప్రభుత్వాన్ని భారత చేనేత బోర్డు సభ్యులు శ్రీ సోమప్ప అభినందించారు

గేదెలు పోయినవి

1 కంత్రీమాశిగేదె, కోరకొమ్ములు. 2 సంవత్సరముదూడ, దున్నపోతు. 3 దిక్కకొమ్ములు గేదె, బొల్లపొట్ట, కంఠపొడుగు పైవాటి ఆచూకీ తెలిపిన తగిన ప్రతిఫలం యివ్వబడును

సూచికేవి వెంకటేశ్వరరావు. లబ్బీపేట, రైల్వేపోలీసు ఆఫీసువెనుక విజయవాడ2

టెండరు నోటీసు

పబ్లిక్‌వర్క్సు డిపార్టుమెంటు
ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు

సీలు వేయబడిన టెండర్లు ఈ దిగువ ఉదహరించిన పనికి శ్రీకాకుళం డివిజను ఎగ్జిక్యూటివు యింజనీరుగారిచే వారి ఆఫీసులో డి. 28-12-60 సాయంకాలము 8 గంటలవరకు తీసుకొనబడును

పనియొక్క పేరు పయిడిగాము ప్రాజెక్టు కాలువ మైలు 0/5 నుండి మైలు 1/6 వరకు త్రవ్వుటకు, టెండరు డిపాజిట్టు రు 4,300, అగ్రిమెంటు నమూనా కె 2.

టెండరుఫారములు డి 10-12-60 నుండి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగారి ఆఫీసునందు దొరకును

టెండరు ఫారముల ఖరీదు అమ్మకపుపన్నుతో సహా (వాపసు కాబడదు) రు 5-10

(సం) బి వెంకట నారాయణ,
సూపరింటెండింగు ఇంజనీరు,
వాల్తేరు సర్కిల్, విశాఖపట్టణము-2

ప్రకటన

ఏలూరు తాలూకా కైకరం కాపురస్థులు (1) తుమ్మల రామచంద్రరావు (2) వీరి భార్య తుమ్మల రామలక్ష్మి యిందుమూలముగా ఎల్లరకు తెలియ చేయునది—మాలో (2) వ వారితండ్రి గొడవర్తి జగపతిరామయ్య, ఈయన కుమార్లు గొడవర్తి కలికిమూర్తి, ఈ కృష్ణారావు, ఈ ప్రణవమూర్తి, మాలో (2) వ వారి తల్లి సావిత్రమ్మ, మాతామహి మేకా జానికమ్మ అందరూ భీమవరంతాలూకా అండలూరుగ్రామం మా వుభయులకు, మాలో (2)వ వారికి దఖలుపర్చబడిన భూమును యావత్తూ సస్యంసహా ఒప్పగింత చేసెదమని నమ్మించి రప్పించుకొని పొలంలో నిర్బంధించి దారుణంగా హింసింపగా భయంతో పారిపోవుచున్న మా కుమారుడైన భగత్ రావునుకూడా నిర్బంధించి మమ్ము తాళ్ళతోకట్టి బంధించి కత్తులు చూపి చంపుతామనిన్ని, మా కళ్లు పొడిచి పూడదీస్తామని బెదిరించి భయపెట్టి వారి పాలేర్లు వగైరా యింకా కొందరి సహాయంతో బలవంతంగా మాలో (1) వ వారిచేత నాల్గేసి రెవిన్యూబిళ్ళలు అంటించివున్న రెండు కాగితముల మీద నున్న, నేరే రెండు తెల్లకాగితములమీద నున్ను, స్టాంపుల మీదనున్ను—మాలో (2) వ వారిచేత స్టాంపుల మీదనున్న, కొన్ని తెల్లకాగితముల మీదనున్న, కొన్ని తెల్ల కాగితంలపై నాల్గేసి రెవిన్యూ బిళ్ళలు అంటించియున్న, వాటి మీద నున్ను, ది 27-11-60 రాత్రి సంతకములు చేయించుకున్నారు ప్రాణభయంతో మాత్రం సదరు కాగితములపై మేము సంతకములు చేయుట జరిగినది ఆ సమయంలో మాలో 1వ వారివద్ద రు 2400 ల కరెన్సీ బలవంతంగా తీసికొన్నారు. అంతేగాక మమ్ము వారి యింట్లో నిర్బంధించివుంచి, ఎవరితోనైనను చెప్పినచో నీ భర్తను, నిన్ను చంపివేయుదుమని భయపెట్టి ఎవరితోనూ మాట్లాడనీయకుండా వీరవాసరం సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీసుకు మాలో 2వ వార్ని మాత్రం తీసుకొనివెళ్ళి రెండవవారి చేత బలవంతముగా ఏవో దస్తావేజులు 28-11-60 తేదీని రిజిష్టరు చేయించుకొనియున్నారు సదరు తేదీని ఎవరెవరి పేర్లను ఏ ఏ దస్తావేజులువగైరాలు మాలో 2వ వారి పేరతో రిజిష్టరు కాబడినను, అట్టి రెవిన్యూబిళ్ళలపైవున్న సంతకముల కాగితములు, తెల్లకాగితములు, స్టాంపులు వగైరాలపై ఎవరి పేర ఎట్టి పత్రములు, ప్రోనోట్లు, రశీదులు యిత్యాది ఏవి సృష్టింపబడినను, అట్టివి మమ్ములను ఎంతమాత్రం బాధించనేరవనిన్నీ, చెల్లనేరవనిన్నీ తెలియజేయుచున్నాము మా కుమారుడైన, భగత్ రావును యిప్పటికి వారివద్దనే నిర్బంధించినారు. భగత్‌రావునకు ఎట్టి హాని జరిగినా మాచే జర్పబడు చర్యలకు వారే బాధ్యులగుదురని తెలియజేయుచున్నాము

తుమ్మల రామచంద్రరావు
తుమ్మల రామలక్ష్మి

కలకత్తాకు రష్యా యువజన ప్రతినిధుల రాక

కలకత్తా, డిసెంబరు 7

భారతదేశంలో పర్యటించుతున్న సోవియట్ యువజన ప్రతినిధివర్గం నేడు ఇక్కడికి పాట్నానుండివచ్చింది కలకత్తాలో వీరు మూడురోజులపాటు పర్యటించుతారు

కలకత్తా, జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయాలకుచెందిన వివిధ విద్యార్థిసంఘాలు, అనేక కార్మిక సంఘాలు, భారత - సోవియట్ మైత్రీ సంఘం వీరికి స్వాగతమిచ్చాయి

కలకత్తాకు వీరు రాగానే పట్టణ మేయరు శ్రీ కె సి బోసు వారికి మున్సిపల్ కార్యాలయంలో స్వాగతమిచ్చారు దంతపు అశోక స్తంభంకూడ బహూకరించారు. ప్రతినిధివర్గంవారు తిరిగి మేయరుకు ఒక ఫౌంటెన్ పెన్ బహూకరించారు.

లుముంబా విడుదలకై సోవియట్ తీర్మానం

భద్రతా సంఘ సమావేశంలో ప్రతిపాదన: పోటీగా అమెరికాచే మరో తీర్మానం

ఐరాస, డిసెంబరు 7

మొబుటూబందీగా ఉన్న కాంగో ప్రధాని లుముంబాను వెంటనే విడిపించవలసిందిగా ఐరాస ప్రధాన కార్యదర్శి హామర్‌షెల్డ్‌ని కోరుతూ భద్రతాసంఘం ముందు సోవియట్ ఒక తీర్మానం పెట్టింది

కాంగో విషయంలో సోవియట్ పక్షపాత వైఖరితో ఉన్నది కాబట్టి సోవియట్ ప్రతినిధి అధ్యక్షత వహించకూడదని అమెరికా ప్రతినిధి వాదించాడు సమావేశం రేపు రాత్రికి వాయిదాపడింది

కాంగోలోని ప్రస్తుత తీవ్రపరిస్థితిని చర్చించేందుకు సోవియట్ అభ్యర్థనపై ఐరాస భద్రతాసంఘం, భారత కాలమానం ప్రకారం ఈవేళ రాత్రి 9-31 గంటలకు సమావేశమయింది

వంతుప్రకారం ఈ నెలకు భద్రతా సంఘం అధ్యక్షులయిన సోవియట్ ప్రతినిధి వాలెరియన్ జోరిన్ అధ్యక్షత వహించారు

అమెరికా వాదన

సమావేశం ప్రారంభమయీ అవడంతోనే అమెరికా ప్రతినిధి వాడ్స్‌వర్త్ లేచి, కాంగో వ్యవహారంలో సోవియట్ బాగా పక్షపాతంతో ఉన్నది కాబట్టి, ఐరాస నిబంధనావళి ప్రకారం, ఈసమావేశానికి సోవియట్ ప్రతినిధి అధ్యక్షత వహించకూడదనీ, జోరిన్ దిగిపోవాలనీ వాదించారు

వాడ్స్‌వర్త్ ఇంకా ఇలా అన్నారు

కాంగో అధ్యక్షుడయిన కసవూబూను దేశద్రోహి అనీ, కాంగో పార్లమెంటునూ, కాంగో జాతీయ స్వాతంత్ర్యాన్నీ ధ్వంసం చేయడానికి అమెరికా ప్రభుత్వం బాహాటంగా ప్రయత్నిస్తున్నదనీ సోవియట్ ఒక ప్రకటన చేసింది.

యుగయుగాలుగా వలస ప్రజాపీడన సాగిస్తున్నవారి గులాము హామర్‌షెల్డ్ అనీ, అయనా, కాంగోలోని ఐరాస సైనికాధికారులూ, దురాక్రమణదారుల కీలుబొమ్మలుగా పని చేస్తున్నారనీ కూడా సోవియట్ వారు నిందించారు.

మీ (సోవియట్) ప్రభుత్వం ఈ సమస్యతో ఇంత బాహాటంగా సంబంధాలు కలిగి, ఇంత గట్టి అభిప్రాయాలను ఏర్పరచుకున్నప్పుడు, సమావేశానికి మీరలా అధ్యక్షత వహించగలరో మాకు అర్థం కావడం లేదు.

అప్పుడు అధ్యక్షుడు జోరిన్, వాడ్స్‌వర్త్‌కి అడ్డు తగిలి, సమావేశం ఎజెండా యింకా నిర్ణయించకముందే, సభ్యుడు అసలు విషయంలోకి దిగుతున్నాడనీ, ఇది తగదనీ అన్నారు.

వాడ్స్‌వర్త్ తెచ్చిన పాయింట్ ఆఫ్ ఆర్డర్ సమయం వచ్చినప్పుడు తప్పకుండా చర్చకు వస్తుందన్నారు.

జోరిన్ చెప్పిది సరికాదని వాడ్స్‌వర్త్ వాదించారు

ఐరాస నిబంధనావళిలోని సూత్రాన్ని దృష్టికి తేవడానికితనకుగల కారణాలను మాత్రం వివరిస్తున్నా నన్నాడు. "కాంగోలోని విధ్వంసక కార్యకలాపాల్లో సోవియట్ ప్రతినిధుల పాత్ర కూడా చాలా ఉన్నది కాబట్టి ఈయన మరీ పక్షపాత బుద్ధితో వ్యవహరించే అవకాశం వుందని" ఆయన ఆరోపించాడు.

"కాబట్టి, అధ్యక్షస్థానాన్ని మీరు ఖాళీ చేయాలని సూచిస్తున్నాను"ని అన్నారు.

పోలెండు ప్రతినిధి సూచన

పోలెండు ప్రతినిధి లెవాండోస్కీ లేచి, ప్రతీ భద్రతాసంఘ సమావేశంలోనూ ఎజెండాను ఆమోదించడం అనేది ప్రథమాంశంగా ఉండాలన్న ఐరాస ప్రణాళికలోనితొమ్మిదవ సూత్రాన్ని పాటించాలని సూచించారు. ఎజెండాను ఆమోదించేలోగా ఎజెండాకు సంబంధించినవిషయాల్లోకిదిగకూడదన్నారు.

మొన్న శనివారం భద్రతా సంఘ సమావేశంలో ఐరాస సభ్యత్వానికి మారిటానియా దరఖాస్తును సోవియట్ వీటో చేయడాన్ని కూడా వాడ్స్‌వర్త్ ప్రస్తావించిన విషయాన్ని పేర్కొని, ప్రస్తుత సమావేశంలోకూడా వాడ్స్‌వర్త్ ఈ విషయాన్ని చర్చకు తేవాలనుకొంటున్నారా ఏమిటని ఆయన ప్రశ్నించారు.

అధ్యక్షుడు జోరిన్ తన నిర్ణయం తెలుపుతూ, వాడ్స్‌వర్త్ పేర్కొన్న నిబంధన, ఏదైనా ఒక ప్రత్యేక సమస్యపైచర్చకుమాత్రమేవర్తిస్తుందనీ, ఇప్పుడుకర్తింపదనీఅన్నారు ఎజెండా నిర్ణయం సమస్యను తీసుకుంటానన్నారు.

కాంగోలోని తాజా పరిస్థితుల దృష్ట్యా అత్యవసరంగా తీసుకోవలసిన చర్యలను గురించీ, డిసెంబరు ఆరవ తేదీని సోవియట్ ప్రభుత్వం చేసిన ప్రకటనను గురించీ, ఐరాస ప్రధాన కార్యదర్శి నివేదికను గురించీ చర్చను ఎజెండాగా ప్రతిపాదించారు.

దీనికి ఆక్షేపణ ఉందా అని అడిగారు

సమావేశం వాయిదా

తరువాత భద్రతాసంఘ సమావేశం స్థానిక కాలమానం ప్రకారం రేపు రాత్రికి (భారత కాలమానం ప్రకారం ఎనిమిదవ తేదీరాత్రి 1½ గంటలకు) వాయిదా పడింది

సోవియట్ తీర్మానం

సోవియట్ ప్రతినిధివర్గం భద్రతా సంఘం ముందు పెట్టిన ముసాయిదా తీర్మానంలో ఇలాఉంది

కాంగో ప్రధాని లుముంబా వెంటనే విడుదల అయ్యేందుకు హామర్‌షెల్డ్ తగిన చర్యలను తీసుకోవాలి

కాంగో పార్లమెంటు ఉభయసభల అధ్యక్షులనూ, యితర మంత్రులనూ కూడా విడిపించాలి

కర్నల్ మొబుటూ ముఠాగులను కాంగోలోని ఐరాస సైనికాధికారులు వెంటనే నిరాయుధులను చేయాలి

కాంగోలో వున్న తన సైనికులనూ, తదితర ఉద్యోగులనూ వెంటనే ఉపసంహరించవలసిందిగా బెల్జియం ప్రభుత్వాన్ని భద్రతా సంఘం ఆదేశించాలి

కాంగోలోని చట్టబద్ధమైన ప్రభుత్వమూ, పార్లమెంటూ, తమ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను హామర్‌షెల్డ్ తీసుకోవాలి.

పశ్చిమ రాజ్యాల తీర్మానం

అమెరికా, బ్రిటన్, ఇటలీ, అర్జెంటైనా దేశాలు కలిసి ఒక తీర్మానాన్ని భద్రతాసంఘం ముందుంచాయి

ఇందులో ప్రధాని లుముంబా విడుదల ప్రసక్తే లేదు

కాంగో అంతటా నిర్బంధంలో ఉన్నవారినందరినీ అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంఘ ప్రతినిధులు పరీక్షించడానికి అనుమతి లభిస్తుందనే ఆశాభావాన్ని మాత్రం ఈ తీర్మానంలో వెలిబుచ్చారు. కాంగోలో మానవ హక్కులకు ఏలాంటి భంగం కలిగినా, అది ఐరాస లక్ష్యాలకే విరుద్ధ మని భద్రతా సంఘం ప్రకటించాలని మాత్రం ఇందులో కోరారు అరెస్టయిన వారి పట్ల న్యాయవిరుద్ధ మయిన చర్యలేవీ అసలు జరుగకుండా ఉంటాయని ఆశిస్తున్నామన్నారు

కాంగోలో శాంతిభద్రతలు నెలకొనేలా చేయడానికి హామర్‌షెల్డ్ తన కృషిని కొనసాగిస్తూనే ఉండాలని ఈ తీర్మానంలో కోరారు.

శాస్త్రీయాభివృద్ధికంటే తీసికట్టైన ప్రపంచరాజకీయస్థాయి

ఇదే నేటి ప్రపంచ ఘర్షణలకు మూలమని నెహ్రూ

న్యూఢిల్లీ, డిసెంబరు 8

శాస్త్రీయాభివృద్ధిలో ప్రపంచం సాధించిన స్థాయికంటె మానవుని రాజకీయస్థాయి తక్కువగావున్నదనీ,అందువల్లనే ప్రపంచంలో ఘర్షణలప్రమాదం వున్నదని ప్రధాని నెహ్రూ నేడిక్కడ అన్నారు శాస్త్రీయ స్థాయికి రాజకీయస్థాయి పెరిగినప్పుడు సహకార, శాంతియుత అభివృద్ధి వుంటుందని మనం ఆశించవచ్చునని కూడ శ్రీ నెహ్రూ అన్నారు

అంతర్జాతీయ తంతి, టెలిఫోన్ సంప్రతింపుల సంఘ రెండవ సమావేశాన్ని ప్రారంభిస్తూ, శ్రీ నెహ్రూ పై విధంగా అన్నారు.

సమావేశానికి యాభైఆరు దేశాల నుండి మూడువందల అరవైమంది ప్రతినిధులు హాజరయ్యారు

తన ప్రసంగంలో శ్రీ నెహ్రూ ఇంకా ఇలా అన్నారు

"మీ మధ్యలోవుంటే కొట్లాడుకొంటూవుండే ప్రపంచానికి దూరంగా వున్నట్లు నేను భావిస్తున్నాను. భవిష్యత్తు ఎక్కువ సహకారవంతంగానూ, శాంతియుతంగానూ వుంటుందని నేను ఆశిస్తున్నాను

వార్తాప్రసార పద్ధతి నేటి ప్రపంచంలో శరీరంలోని నాడీమండలంలా పనిచేస్తూ వున్నది. ప్రపంచమంతా నేడు ఒకేజీవిగా మారింది. రాజకీయ నాయకులు కీచులాడు కొంటున్నా వార్తాప్రసార పద్ధతి అభివృద్ధి పొందుతూనేవుంది"

లక్నో, డిసెంబరు 8

ఉత్తర ప్రదేశ్ నూతన మంత్రివర్గం సుహృద్భావన సూచకంగా 200 మంది సోషలిస్టుఖైదీలను విడుదల చేయడానికి నేడు ఉత్తరువు చేసింది. శ్రీచంద్రభాను గుప్త నాయకత్వాన నిన్న కొత్తమంత్రివర్గం ఏర్పడింది.

సోషలిస్టులు గత మే 1 వ తేదీన సత్యాగ్రహం ప్రారంభించారు

మత సంస్థలకు శ్రీ చంద్రమౌళి లేఖ

భద్రాద్రి రామాలయ పునరుద్ధరణ విషయమై

హైదరాబాదు, డిసెంబరు 7

భద్రాద్రి రామాలయ పునరుద్ధరణకు డబ్బివ్వవలసిందిగా ఆంధ్రప్రదేశ్ లోని వివిధ దేవాదాయ, ధర్మాదాయ సంస్థలకు తాను విజ్ఞప్తిచేస్తూ లేఖ వ్రాసిన మాటనిజమేననిదేవాదాయధర్మాదాయ శాఖా మంత్రి శ్రీ చంద్రమౌళి నేడు శాసనమండలిలో ప్రతిపక్షసభ్యుడు శ్రీ గంటూరుబాపనయ్య ప్రశ్నకు సమాధానంచెప్పారు. ఆర్థికసహాయం చేయవలసిందిగా సూచనమాత్రమేచేశాననీ, ఇది ఉత్తర్వుగా భావించడానికి వీలు లేదనీ మంత్రి అన్నారు.

ఇలాంటి జాబు మంత్రినుండి వస్తే ఆ సంస్థలుదాన్ని ఉత్తర్వుగా భావించడానికి వీలుందికదా అని శ్రీ బాపనయ్య ప్రశ్నించగా మంత్రి పై సమాధానమిచ్చారు

ఒక జీర్ణాలయ పునరుద్ధరణకై డబ్బు వసూలు చేయడానికై తన కాలం వినియోగించడానికిమారు మంత్రులు దేశాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించడం మంచిదికదా? జీర్ణాలయ పునరుద్ధరణకోసం దేశంలో అనేక మంది భక్తాగ్రేసరులున్నారు కదా? అనీ శ్రీ బాపనయ్య ప్రశ్నించారు.

శ్రీ చంద్రమౌళి, సభ్యునికి దైవభక్తి లేకపోవచ్చు. ఆయనకు దేవునిలో నమ్మకం లేదు కాని, నాకు దేవునిపై విశ్వాసముంది

శ్రీ బాపనయ్య: మీకన్నా నాకన్నా ఎక్కువ భక్తి కలవారే చాలా మంది ఇలాంటి కార్యక్రమం చేయగలరు. మంత్రులు తమశక్తిని దేశ ప్రయోజనాలకు వినియోగించడం బాగుంటుంది.

దేవుని సేవించడమే తన ధర్మంగా భావిస్తున్నానని మంత్రి అన్నారు

అంతకుముందు శ్రీ కొల్లా వెంకయ్య ప్రశ్నకు సమాధానమిస్తూ భద్రాద్రి రామాలయ పునరుద్ధరణకై వివిధ జిల్లాలలోని దేవాదాయ ధర్మాదాయ సంస్థలువిరాళాలుపంపించాయనిమంత్రి వెల్లడించారు.

కాంగో సమస్య:

ఐరాస సైన్యంనుండి మూడుదేశాల నిష్క్రమణ

యుగోస్లావియా, సింహళ, ఐక్య అరబ్బు రిపబ్లిక్‌ల నిర్ణయం

ఐరాస, డిసెంబరు 7

కాంగోలోని ఐరాస సైన్యంలో భాగంగా పనిచేయడానికి పంపిన తమ తమ సైనిక దళాలను ఉపసంహరించుకోడానికి ఐక్య అరబ్బురిపబ్లిక్, యుగోస్లావియా సింహళప్రభుత్వాలు నిశ్చయించుకున్నాయి తమ నిర్ణయాన్ని ఐరాస ప్రధాన కార్యదర్శి హామర్‌షెల్డ్‌కి తెలియజేశాయి

కాంగోవ్యవహారంలో ఇది మరొక తీవ్రపరిణామమని ఐరాస పరిశీలకులు భావిస్తున్నారు

ఐక్యఅరబ్బురిపబ్లిక్ కాంగోతో తన దౌత్యసంబంధాలను ఇదివరకే తెంచివేసుకున్న విషయం పాఠకులకు తెలిసినదే

కాంగోలోని యుగోస్లావ్ దౌత్యప్రతినిధుల ఉపసంహరణ

లియోపాల్డ్‌విల్లీలోని తన దౌత్యప్రతినిధులను వెంటనే ఉపసంహరించుకుంటున్నామని కూడా యుగోస్లావియా ప్రభుత్వం నేడు ఐరాసకు తెలియపరిచింది.

కాంగోలోని ఐరాస సైన్యంలో భాగంగా పనిచేయడానికి పంపిన తన సైనికులు, తదితర సిబ్బందికింద అయిన ఖర్చును ఐరాస నుండి రాబట్టుకొనే హక్కును కూడా ఉంచుకొంటున్నామని యుగోస్లావియా ప్రభుత్వం తన లేఖలో తెలిపింది

"కాంగో ప్రభుత్వాధిపతి అయిన లుముంబాను వెంటనే విడుదల చేయించేందుకు చాలా సమర్థవంతమయిన చర్యలను, అత్యవసరంగా తీసుకోవాల"ని యుగోస్లావియా ప్రభుత్వం ఈ లేఖలో ఖండితంగా తెలిపింది నిర్బంధంలో వున్న ఇతర ప్రముఖుల విడుదలకు కూడా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది

ఐరాస అధికారుల పాత్రపై నిశిత విమర్శ

కాంగోలో ఐరాస అధికారులూ, సేనలూ నిర్వహించిన పాత్రను నిశితంగా విమర్శిస్తూ యుగోస్లావియా ప్రభుత్వం తన లేఖలో యిలా పేర్కొన్నది

ఐరాస సర్వసభ్య సమావేశమూ, భద్రతాసంఘమూ, నిర్దేశించిన కర్తవ్యాలకు విరుద్ధంగా కాంగోలో ఐరాస ప్రతినిధిసంస్థలూ, ఐరాస సేనలూ వ్యవహరించాయి.

ఐరాస సేనకు అప్పగించిన కర్తవ్యాలలో ఒక్కటికూడా నెరవేరలేదు అక్కడ విదేశీజోక్యం కొనసాగుతూనే ఉంది

జోక్యం కలిగించుకుంటున్న విదేశ సేనల కార్యకలాపాలూ, విదేశీ ఆయుధాలనూ రవాణా సాధనాలనూ బాహాటంగా ఉపయోగించుకోవడమూ, ముమ్మరంగా సాగుతూంది.

ఇదంతా కూడా ఐరాస ప్రతినిధుల, ఐరాస సేనల కళ్ళెదుటే జరుగుతున్నా వాటిని నిరోధించేందుకు ఏలాంటి చర్యా తీసుకోలేదు అంతేకాదు భద్రతాసంఘమూ, ఐరాస మహాసభా తీసుకొన్న నిర్ణయాలు అమలుజరిగేందుకుకూడా వారేలాంటి చర్యా తీసుకోలేదు

కాంగోలో, ఐరాస ప్రతినిధుల సమక్షంలో ప్రస్తుతం జరుగుతున్న వ్యవహారాలకు బాధ్యతను పంచుకోడానికి, ఐరాస సభ్యదేశంగా యుగోస్లావియా నిరాకరిస్తూంది

అక్కడ విదేశీ జోక్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన ప్రజలను అణచడంలో, ఐరాస సైనిక దళాలు, ఐరాస సైనికాధికారుల ఉత్తరువులపై పాల్గొన్న సందర్భాలు కూడా ఉన్నాయి

కాంగో ప్రభుత్వాధిపతి లుముంబా అమానుష హింసాకాండకు గురి అవుతున్నారు లుముంబా వెంటనే విడుదల అయ్యేందుకు తక్షణం తగినచర్యలు తీసుకోవాలి ఐరాసకు ఇప్పుడిదే ప్రప్రధానమైన అత్యవసర కర్తవ్యం.

యుగోస్లావియా ప్రభుత్వం పంపిన ఈ లేఖను ఐరాసలో యుగోస్లావియా ప్రతినిధి హామర్‌షెల్డ్‌కి నేడు అందచేశారు.

లంక ప్రధాని లేఖ

కాంగో ప్రధాని లుముంబాపట్ల జరిగిన అత్యాచారానికి తాము చాల ఆందోళన చెందామని, లంక ప్రధాని శ్రీమతి సిరిమావో ఐరాస కార్యదర్శి హామర్‌షెల్డ్‌కు ఒక లేఖలో తెలిపారు రాజ్యాంగచట్టం రీత్యా పార్లమెంటు సభ్యునిగా అయినా లుముంబాకు రక్షణ ఉండవలసిందన్నారు

లుముంబాకు ఏదైనా అపాయం జరిగితే, అంతర్జాతీయ ఉద్రిక్తత తీవ్రం కావడంతోపాటు, ఐరాస ప్రతిష్ఠ తగ్గుతుందని కూడా శ్రీమతి సిరిమావో హెచ్చరించారు

కాంగోసమస్యపై ఆసియా-ఆఫ్రికా దేశాలతో కలిసికట్టుగా వ్యవహరించవలసిందని సిరిమావో ఐరాసలోని లంక ప్రతినిధిని ఆదేశించారు

కాంగో పరిస్థితిపై మీనన్ హెచ్చరిక

న్యూయార్కు, డిసెంబరు 7

కాంగోలో పరిస్థితులు మెరుగుకాని పక్షంలో 'ఐరాస సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకురావలసి వస్తుందని' భారత ప్రతినిధి వర్గ నాయకుడు శ్రీ వి కె, కృష్ణమీనన్ నేడిక్కడొక టెలివిజన్ గోష్ఠిలో హెచ్చరించారు,

"కాంగోలోని సైనికులకు అనేక అవమానాలకు, క్రౌర్యాలకు గురి చేస్తున్నారు. మా పౌరులమీద గత రెండు రోజులుగా కాంగో సైన్యం, కాంగోపౌరులు చేయి చేసుకొంటున్నారు. ఈ విషయంలో మేము ఇంతకాలం చాలా ఓర్మితో వ్యవహరించాం, కాని, ఈ పరిస్థితి ఎల్లకాలం సాగడానికి వీలులేదు ఐరాస తన సభ్యరాజ్యాలపట్ల వహించవలసిన బాధ్యతలను గుర్తించాలి.

"అసలు ఐరాసలో కసవూబూ నియమించిన ప్రతినిధి వర్గానికే స్థానం ఇవ్వడం తప్పు కసవూబూకు అధికారమున్నప్పటికీ దానిని ఉపయోగించే సామర్థ్యం వున్నట్టుకనిపించదు " అని కృష్ణమీనన్ చెప్పారు

కాంగోనుండి త్వరపడి భారత సైనికులను ఉపసంహరించడం జరగదని చెప్పారు

సంతాన నిరోధ మహాసభ

హైదరాబాద్‌లో 1961 జనవరి ఆఖరిలో

హైదరాబాద్, డిసెంబరు 8

సంతాన నిరోధ సమస్యపై నాల్గవ అఖిల భారత మహాసభ 1961 జనవరి 29 నుండి ఫిబ్రవరి 8 వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరుగనున్నది

మహాసభకు ప్రతినిధులుగా హాజరు కాగోరేవారు తమ దరఖాస్తులను "డాక్టర్ ఆర్ పగ్గోంకర్, ఆపోజిట్ సుల్తాన్‌బజార్ హాస్పిటల్, హైదరాబాద్" అన్న చిరునామాకు వ్రాయాలి.

కేంద్ర ఆహారమంత్రి శ్రీ పాటిల్ మహాసభనుప్రారంభిస్తారు ప్రతినిధుల రిజిస్ట్రేషన్ రుసుము రు. 10 లు

(వి వి)

చిలకలూరిపేట, డిసెంబరు 6

చిలకలూరిపేట పట్టణ పంచాయతీ అధ్యక్షుడుగా ఎన్నికైన శ్రీ గట్టా సూర్యనారాయణగారికి అభ్యుదయ సేవా సమాజంవారు నవంబరు 28 వ తేదీ సాయంత్రం సన్మానం జరిపారు అల్పాహార విందుకు దాదాపు వంద మంది హాజరైనారు. సభకు శ్రీ రాచుమల్లు వెంకన్నారావుగారు అధ్యక్షత వహించారు.

టిబెట్ యాత్రికులు

న్యూఢిల్లీ, డిసెంబరు 8

యాత్రికులకు రక్షణకల్పించే హామీ యివ్వలేమని చైనాప్రభుత్వం తెలియజేసినప్పుడు పశ్చిమటిబెట్‌లోని పుణ్యక్షేత్రాలకు భారతయాత్రికులు వెళ్లడం మంచిదికాదని ప్రధాని నెహ్రూ లోక్‌సభలో నేడు నిక్కచ్చిగా చెప్పేశారు. [illegible] దేశాల్లో తిరిగేందుకు విశృంఖలమైన హక్కు ఎవ్వరికీ లేదని కూడా శ్రీ నెహ్రూ అన్నారు.

శ్రీ హేమబారువా తమమత ధర్మాలను నిర్వర్తించుకొనడానికి భారతీయులు కైలాస, మానస సరోవరాలకు వెళ్ళేహక్కును చైనావారు నిరాకరించడానికి కారణమేమిటి? అందుకు కారణం టిబెట్‌లో అసాధారణ పరిస్థితులేవైనా ఉండడమో లేక భారతదేశంపట్ల వ్యతిరేక భావం ప్రదర్శించడానికి ఈ చర్య చైనావారు తీసుకొన్నారా?

శ్రీ నెహ్రూ ఇతర దేశాల్లో పర్యటించడానికి ఎవరికైనా వున్న హక్కు లేమిటో నాకు తెలుసు చైనావారు ఈ విధంగా తెలియజేయడానికి కొన్ని వందల కారణాలుండవచ్చు. అక్కడ జబ్బులుండవచ్చు, లేక పరిస్థితులు సక్రమంగా లేకపోవచ్చు. అక్కడ పరిస్థితులుబాగాలేవనీ, వెళ్ళే వారికి తాము రక్షణ కల్పించలేమనీ వారు చెప్పినప్పుడు ఎవరైనా అంగీకరించాలి



చీలమండ బెణికిందా?

అమృతాంజనము
కొంచెం రాయండి



వెంటనే గుణం కనిపిస్తుంది
మీకు అమృతాంజనము ఎప్పుడు కావలసివస్తుందో మీకే తెలియదు ఇంట్లో ఎప్పుడూ ఒక బుడ్డిని ఉంచండి ఎంతైనా నమ్మకమైనది.
అమృతాంజన్ లిమిటెడ్
14/15, ఆర్ చర్చి రోడ్డు, మద్రాసు-4
బొంబాయి-1, కలకత్తా-1, న్యూఢిల్లీ

మేలైన సిగరెట్టు
ఒక సిగరెట్టు తృప్తిని, కమ్మదనమును యివ్వాలంటే,
ఒక సిగరెట్టు ఆహ్లాదమైన వాసనను, రుచిని కలిగివుండాలంటే,
ఒక సిగరెట్టు ధారాళమైన పొగ యిచ్చేదిగా వుండాలంటే,
ఆ సిగరెట్టులోని పొగాకు సమమైన పదును కలిగి వుండాలి
అటువంటి సిగరెట్టు విల్స్ బర్కిలీ —



10 సిగరెట్లు 30 న.పై. మాత్రమే
TSC 3A TE




3 వ వారం
పత్రికా ప్రశంసలు

ఇట్టి చిత్రాలు తెలుగులో అపూర్వం. పాటలు మధురాతి మధురం - సంభాషణలు రోచకం - నటీనటుల్లో దాదాపు అందరూ చక్కగా నటించారు - "చివరకు మిగిలేది" చిత్రం నవ పంథాలో నడచిన దృశ్య కావ్యం
— కృష్ణా పత్రిక.

కథలో, కథనంలో, సాంకేతిక పథాల్లో, సంగీతంలో, తారాగణంలో కొంత క్రొత్తపుంత త్రొక్కింది - తెలుగుతెరకు సరికొత్త కానుక - "చివరకు మిగిలేది".
— ఆంధ్ర సచిత్ర వారపత్రిక

క్రొత్త పద్ధతిలో - సరికొత్త టెక్నిక్‌లో - ఫొటోగ్రఫీతో కథ నడిపించటం - ముఖంలో బాధలు చెప్పించి - కళ్ళలో పాటలు పాడించి - విషయాన్ని విచిత్రంగా అలంకారాల సహాయ్య ప్రత్యక్షం చేయడం - తెలుగు సినీ రంగంలో సాహసంతో కూడిన ముందడుగు - క్రొత్త రుచితో కూడిన దృశ్య పానీయం
—— ఆంధ్రజ్యోతి.

మంజీరా వారి
చివరకు మిగిలేది!
దర్శకత్వం: జి. రామినీడు : నిర్మాత: వి. పురుషోత్తమరెడ్డి
డిస్ట్రిబ్యూటర్సు ఆంధ్ర పరమేశ్వరీ పిక్చర్స్, నైజాం విజయా పిక్చర్స్
PRASADS

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షులు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి. విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, విజయవాడ -2.